

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-1-2026 సోమవారం సంపుటి: 31 సంచిక: 348 పేజీలు: 10+4 వెల: 6.50


23న తమిళనాట ప్రధాని పర్యటన

లోయలో పడిన బస్సు: ఐదుగురు మృతి

5లో






# వచ్చే నెల మెగా డీఎస్సీ!

## 2,500 టీచరు పోస్టులు భర్తీ చేసే అవకాశం

**విజయవాడ,జనవరి 18.ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం నిరుద్యోగ ఉపాధ్యాయ పట్ట భద్రులకు శుభవార్త చెప్పే దిశలో అడుగులు వేస్తోంది.ఇటీవలే మెగా డీఎస్సీ ద్వారా భారీగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది.ఈ సం దర్భంగా ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. ఆ దిశలోనే రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఉపాధ్యాయ కొలువుల భర్తీకి సిద్ధ మైంది. ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ 2,500 పోస్టుల భర్తీకి సన్నద్ధమవుతుంది. ఫిబ్రవరి మొదటి వారంలో సుమారు 2,500 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. పదవీ విరమణలు, మోడల్ స్కూళ్ల ఏర్పాటుతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఈసారి డీఎస్సీ పరీక్షలో ఆంగ్లం, కంప్యూటర్ అవగాహనపై అదనపు పేపర్లు ఉండనున్నాయి. ఈ మార్పులతో విద్యావ్యవస్థ నాణ్యత పెరుగుతుందని అధికా రులు ఆశిస్తున్నారు. ఈ నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే స్వల్ప సంఖ్యలో ఖాళీలు ఉండటంతో ఈభర్తీ ప్రక్రియ చేపట్టనున్నారు. గతంలో జీవో 117ను రద్దు చేశారు. దీంతో పాటు 9 రకాల స్కూళ్లను తీసుకురావడం, 9,200 ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చి, ప్రతి తరగతికి ఒక టీచర్ అన్న నిబం ధన తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో అద నంగా 1,146 మంది టీచర్లు అవసరమని గుర్తించారు. ఈ ఖాళీలతో పాటు మరికొన్నిం టిని కలిపి మొత్తంగా 2,500 టీచర్ పోస్టుల భర్తీ కోసం కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వ నున్నారు. ఫిబ్రవరి రెండో వారంలో డీఎస్సీ 2026 ప్రకటన విడుదల చేసేందుకు అధి కారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే టెట్ నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. క్షేత్రస్థాయిలో ఖాళీగా ఉన్న పోస్టుల లెక్కలు సేకరించే ప్రక్రియ కొలిక్కి వచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో సుమారు 986 పోస్టు లు ఖాళీగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దాదాపు 30వేల మంది నిరుద్యోగ ఉపాధ్యా యఅభ్యర్థులు ఈ కొత్త డీఎస్సీ కోసం ఎదు రుచూస్తున్నారు.గతంలో మెగా డీఎస్సీ 2025లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 1,672పోస్టులను భర్తీ చేశారు. పలు సాంకేతిక కారణాల వల్ల కొన్ని పోస్టులు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. వచ్చే విద్యా సం వత్సరం ప్రారంభమయ్యే నాటికి పదవీ విర మణల వల్ల మరిన్ని ఖాళీలు ఏర్పడనున్నాయి. గత ఏడాది జిల్లాలో సుమారు 460 ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా మార్చారు. ఈ కారణాల వల్ల అద నంగా ఉపాధ్యాయులు >>2

# వడివడిగా కీలక ప్రాజెక్టులు


దావోస్ వెళ్లే ముందు సాగునీటి ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

### వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు ఈ యేడాదే పూర్తి

### పూర్వోదయ పథకంపై మరింత శ్రద్ధ

## పిపిపి ప్రాజెక్టుల సమగ్ర జాబితా సిద్ధం చేయండి

## వివిధ పథకాల సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రాధాన్యతల వారీగా చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గత ఏడాది హంద్రీనీవా కాల్వ వెడల్పు పనులకు గడువు నిర్దేశించుకుని పూర్తి చేశామని... అలాగే పోలవరం ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించామని గుర్తు చేశారు. అదే తరహాలో 2026 ఏడాదిలో వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల నిర్మాణ పనులను పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు.సీఎం తన క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాల్సిన కీలక ప్రాజెక్టులపై సమీక్ష నిర్వ హించారు. రాయలసీమలో ఉద్యాన రంగంలోని అభివృద్ధి కార్యక్ర మాలు, పూర్వోదయ పథకం, నల్లమల సాగర్ సహా ఇరిగేషన్ ప్రాజెక్టులు, వివిధ శాఖల్లో చేపట్టాల్సిన పీపీపీ ప్రాజెక్టులు, జల్ జీవన్ మిషన్ పథకం, సాస్కీ నిధుల వినియోగం వంటి అంశాలపై చర్చించారు. దావోస్ పర్యటనకు వెళ్లే ముందు ఆయా పథకాలు, ప్రాజెక్టులపై సమీక్షించిన సీఎం. దావోస్ పర్యటన నుంచి తిరిగి రాగానే తనకు సమగ్ర నివేదికలు సమర్పించాలని మంత్రులకు, ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ గత ఏడాది వివిధ రంగాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. అలాగే సంక్షేమాన్ని అమలు చేశాం. 2026లో కీలక ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉంది. ముఖ్యంగా పూ ర్వోదయ స్కీం ద్వారా ప్రకాశం సహా రాయలసీమలోని తొమ్మిది జిల్లాల్లో అభివృద్ధి చేయొచ్చు. ఉద్యాన రైతులకు పెద్ద ఎత్తున మేలు జరుగుతుంది. పూర్వోదయ స్కీంలో భాగంగా విడతల వారీగా ఉద్యాన రంగ అభివృద్ధిపై దృష్టి సారించాలి. ఈ ఏడాది 2 లక్షల హెక్టార్లల్లో ఉద్యాన పంటలు పండించేలా రైతులను సమాయత్తం చేయాలి. ఇక పథకంలో భాగంగా చేపట్టాల్సిన ఇరిగేషన్, రోడ్ నెట్ వర్క్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, వేర్ హౌసింగ్ సదుపాయాలు, కోల్డ్ చెయిన్ వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలి. ఆయా శాఖల్లో అభివృద్ధి చేయాల్సిన పనులపై జిల్లాల వారీగా జాబితాను సిద్ధం చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం పూర్వోదయ స్కీం కింద రూ. 40 వేల కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది... దీనికి అదనంగా మరిన్ని ప్రాజెక్టులను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు.రాయలసీమలోని తొమ్మిది జిల్లాల్లోని ఉద్యాన రైతులకు పెద్ద ఎత్తున మేలు జరుగుతుం దన్నారు. విడతల వారీగా ఉద్యాన రంగ అభివృద్ధిపై దృష్టి సారిం చాలని ఈ ఏడాది 2 లక్షల హెక్టార్లల్లో ఉద్యాన పంటలు పండించేలా రైతులను సమాయత్తం చేయాలన్నారు.

**ప్రాజెక్టులు పూర్తి చేయాలి...చెరువులను నింపాలి:** ఇక ఈ ఏడాది ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో ఏ మాత్రం >>2

# బెంగాల్‌లో మాఫియా పాలన

## అన్నిటిపై సిండికేట్ పన్ను

## కేంద్ర పథకాలనూ అడ్డుకుంటున్నారు

## సింగూరు సభలో ప్రధాని మోడీ ధ్వజం


సింగూరు సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

**సింగూరు(పశ్చిమబెంగాల్), జనవరి 18:**పశ్చిమబెంగాల్‌లో మాఫియా పాలన నడు స్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇక్కడ ప్రతి దానిపై సిండికేట్ పన్ను విధిస్తున్నారని అన్నారు. శాంతిభద్రతలు అదుపు తప్పాయని మం డిపడ్డారు. సందేశ్‌ఖాలీలో జరిగిన మహిళలపై అకృత్యాలు, విద్యా సంస్థలలో ఇటీ వల వరుసగా వెలుగుచూసిన అత్యాచారాలు, ఇందుకు ఉదాహరణ ప్రధాని ఎత్తి చూపారు. ఆదివారం హుగ్లీ జిల్లా సింగూరులో పలు అభివృద్ధి పను లను ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ, ఈ ఏడాది చివరిలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వస్తే, పశ్చిమ బెంగాల్‌లో 'ఒక జిల్లా, ఒక ఉత్పత్తి' (ఓడిఓపి) విధానాన్ని ప్రవేశపెడు తుందని అన్నారు. 'బెంగాల్‌లోని ప్రతి జిల్లాకు దానికంటూ ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడి సామాన్య ప్రజలకు తెలివితేటలు, ప్రతిభ మరియు సామర్థం ఉన్నాయి. బిజెపి ప్రతి జిల్లాకు ఒక ప్రణాళికను సిద్ధం చేస్తుంది. దీని ఫలితంగా, సంబంధిత జిల్లా ప్రజలు అత్యధికంగా లబ్ధి పొందుతారు. పశ్చిమ బెం గాల్‌లో బిజెపి అధికారంలోకి వస్తే, జిల్లా ప్రత్యేక ఉత్పత్తులను ప్రోత్సహిం చడానికి రాష్ట్రంలో ఓడిఓపి విధానాన్ని ప్రవేశపెడుతుంది' అని ప్రధాని పునరు ద్ఘాటించారు. తనపై, బిజెపిపై పగ తీర్చుకోవడానికి మమతా బెనర్జీ నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రజలకు అంద కుండా చేస్తోందని మోడీ ఆరోపించారు. 'నాపై, బిజెపిపై తృణమూల్ కాంగ్రెస్ చూపిస్తున్న నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోగలను. కానీ వారు రాష్ట్రంలో కేంద్ర ప్రాయోజిత అభివృద్ధి పథకాలను అమలు చేయకుండా అడ్డుకుని, ప్రజలను కష్టాల్లోకి నెడుతున్నారు' అని ఆయన అన్నారు

## సమాచార హక్కు కమిషనర్ల నియామకం

### సిఐసిగా లాయర్ వజ్జా శ్రీనివాస రావు, మరో నలుగురు


వజ్జా శ్రీనివాసరావు

**విజయవాడ.జనవరి 18.ప్రభాతవార్తప్రతి నిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు (ఆర్‌టీఐ) కమిషన్‌కు ప్రభుత్వం కొత్త సార థులను నియ మిం చింది. ప్రధాన సమా చార కమిషనర్‌గా (సీఐసీ) ప్రముఖ న్యాయవాది వజ్జా శ్రీనివాసరావును ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేడు ఉత్తర్వులు జారీ చేశారు.శ్రీనివాసరావుతో పాటు మరో నలుగురిని సమాచార కమిషనర్లుగా నియమించారు. వీరిలో వి.శరత్ >>2



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ఆరుగురు మావోయిస్టులు మృతి

### వారిలో నలుగురు మహిళలు

**రాయ్‌పూర్, జనవరి 18:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లోజరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరు గురు మావోయిస్టులు మృతిచెందారు. వారిలో నలుగురు మహిళా కేడర్ మావోలు కూడా ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. బీజాపూర్‌జిల్లాలో గత రాత్రినుంచి భీకర ఎన్‌కౌంటర్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే.డిఆర్‌జి, కోబ్రా, ఎస్టీఎఫ్‌లు >>2

# 'ఆరోగ్యం'లో అవేర్ సేవలు



### హిస్టారికల్ డేటా ఆధారంగా వ్యాధుల తీవ్రత ప్రాంతాల గుర్తింపు

### ఆర్టీజిఎస్‌తో అనుసంధానం: మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,జనవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సీజనల్ డిసీజెస్‌ను రియల్ టైమ్‌లో పర్యవేక్షించి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవడానికి రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) లోని అవేర్ విభాగం సేవలను వినియోగించుకోనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల ప్రకారం రాష్ట్రంలో వ్యాధులు ప్రబలకుండా సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకునే దిశగా వైద్య, ఆరోగ్యశాఖ అడుగులు వేస్తోందని చెప్పారు. ఇందుకోసం సత్య కుమార్ వెల్లడిం చారు. ఆర్టీజీఎస్‌లోని అవేర్ (అడ్వాన్స్ వార్నింగ్ అడ్వైజరీ ఫర్ రిసిలియెంట్ ఎకోసిస్టమ్) ద్వారా రాష్ట్రంలో వ్యాధుల తీవ్రత, వ్యాప్తికి ఉన్నఅవ కాశాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వాటిని సత్వరం నివారించే దిశగా త్వరలో చర్యలు తీసు కుంటామన్నారు.

గత ఐదారు సంవత్సరా ల్లో (హిస్టారికల్ డేటా) గ్రామాలు, సచివాయాలయాల వారీగా అంటు వ్యాధులు (డెంగీ, మలేరియా,టైఫాయిడ్, ఇతర) కేసెస్ డేటా ఆధారంగా విశ్లేషిస్తారు. అలాగే వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యాప్తి చెందే సీజనల్ డిసీజెస్ కు సంబంధించి ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలకు ఆర్టీజీఎస్‌లోని సాంకేతిక సదుపాయాలను విని యోగించుకోనున్నారు. ఆర్టీజీఎస్ సేవలను ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యు కేషన్ అధికారులకు అవగాహన కలిపించారు. ఆర్టీజీఎస్ లోని అవేర్ విభాగం ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులను పసిగట్టి ప్రభుత్వ యం త్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేస్తుంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఇప్పుడు మారుతున్న వాతావరణాన్ని బట్టి ఆయా ప్రాంతాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలగలవో డేటా విశ్లేషణతో అవేర్ విభాగం ద్వారా ముందస్తుగానే పసిగట్టి సమర్థవంతమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందన్నారు. డెంగీ, మలేరియా, టైఫా యిడ్, ఇతర కేసులను సచివాలయాలు వారిగా గుర్తిస్తామని చెప్పారు. ఇందుకు ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు (జియో ఇన్ఫ ర్మేషన్ సిస్టమ్) కూడా పరిగణలోనికి తీసుకుం టామని తెలిపారు. గత ఐదారు సంవత్సరాల్లో >>2

# సిఎం చంద్రబాబు దావోస్ పయనం

## ఆయన వెంట మంత్రి నారా లోకేష్, మరి కొందరు మంత్రులు, అధికారులు

## నాలుగు రోజులు అక్కడే

**విజయవాడ జనవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు ఆది వారంరాత్రి తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబుపాటు మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్‌తో పాటు ఇతరమంత్రులు, అధికారుల బృందం దావోస్ బయల్దేరి వెళ్ళినట్లు కీలక సమాచారం. ఆది వారం రాత్రి 8.35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి బయల్దేరి ఢిల్లీ వెళ్ళిన సీఎం చంద్రబాబు దాదాపు అర్ధరాత్రి ప్రాంతంలో అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో జ్యూరిచ్‌కు వెళ్తారు. 4 రోజుల పాటు దావోస్‌లో ముఖ్యమంత్రితో మంత్రుల బృందం పర్యటించనున్నారు. 19వ తేదీ నుంచి 22వతేదీ వరకూ దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి ముఖా ముఖి భేటీలు, కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఢిల్లీలో 19 తేదీన రాత్రి 01.45 గంటలకు బయల్దేరి ఉదయం జ్యూరిచ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో స్విట్జర్లాండ్ భారతీయ రాయబారి మృదుల్ కుమార్ మర్యాదపూర్వకంగా భేటీ అవుతారు. అనంతరం ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిషోర్ లుల్లా, సహ అధ్యక్షులు రిథిమా లుల్లా, స్వనీత్ సింగ్‌లు కూడా ముఖ్యమంత్రితో సమావేశం అవుతారు. >>2

# ఎన్టీఆర్‌కు భారతరత్న సాధిస్తాం


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించిన సిఎం చంద్రబాబు

### తెలుగుజాతి గుండెల్లో శాశ్వతంగా ఉండే నాయకుడాయన..

### ఉగాది రోజున 5 లక్షల గృహ ప్రవేశాలు, రాష్ట్రంలో మరో 700 అన్న క్యాంటీన్లు

### ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ.జనవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు జాతి గుండెల్లో శాశ్వతంగా ఉండే ఏకైక నాయకుడు ఎన్‌టిఆర్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్టీఆర్ 30వ వర్ధంతి కార్యక్రమంలో సిఎం పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ మనందరికీ దూరమై 30ఏళ్లు అవుతున్నా తెలుగు జాతి గుండెల్లో శాశ్వతంగా ఉండే ఏకైక నాయకుడు. తెలుగు జాతి ఖ్యాతిని ఎవరెస్ట్ అంతఎత్తుకు తీసుకెళ్లిన యుగపురుషుడు. మన ఆరాధ్య దైవం ఎన్టీఆర్. పార్టీ పెట్టిన 9 నెలల్లో అధికారంలోకి వచ్చి.. ఒక చరిత్ర సృష్టించారు. దేశంలో సుపరిపాలనకు ఎన్టీఆర్ అర్థం చెప్పారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికారు. విద్యావంతులు, బడగులకు టిక్కెట్లు ఇచ్చి ఎన్నో అవకాశాలు కల్పించారు. విద్యావంతులను.. మేథావులను.. సమర్థులను ఎన్టీఆర్ రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. సామాజిక న్యాయం చేశారు. తెలుగు జాతి ఆత్మగౌరవ నినాదంతో ముందుకెళ్లారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగాపాలన చేపట్టారు.పొట్టి శ్రీరాములు >>2




### పల్నాడు ప్రశాంతతను

## చెదరనివ్వం

### మంత్రి గొట్టిపాటి రవి

**విజయవాడ,జనవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** పల్నాడు ప్రాంతంలో వైసీపీ హయాంలో రక్తం ఏరులై పారాయని ఆ జిల్లా ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వ్యాఖ్యా నించారు. కూటమి ప్రభుత్వం >>2

ఆదివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, మంత్రి లోకేష్

# ఎన్టీఆర్‌కు భారతరత్న సాధిస్తాం

>> తెలుగు రాష్ట్రం కోసం పోరాడి సాధించారు. మదరాసీలు అని తెలుగు వాళ్లను పిలుస్తున్న రోజుల్లో తెలుగు జాతికి ఎన్టీఆర్ గుర్తింపు తెచ్చారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 9 శాతం రిజర్వేషన్లు కల్పించారు. దాన్ని నేను 33 శాతం చేశాను. నేడు రాబోయే ఎన్నికల్లో పార్లమెంట్, శాసన సభల్లో 33 శాతం మహిళలకు రాబోతున్నాయి. ఇది మార్పుకు నాంది. రూ.2కే కేజీ బియ్యం ఇచ్చారు. తిరుమలలో అన్నదానం ప్రవేశపెట్టారు. లక్ష మందికి తిరుమలలో నిత్యం అన్నదానం జరుగుతోంది. నేడు మనం అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5 లకే అన్నం పెడుతున్నాం. అన్ని నియోజకవర్గాల్లో అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేస్తాం. వృద్ధులకు రూ.35లతో పింఛను ప్రారంభించారు. దాన్ని నేను రూ.70 చేశాను. రూ.200 ఉంటే రూ.2000 లకు, ఇప్పుడు రూ.4 వేలకు పెంచాం. పేదలకు ఎన్టీఆర్ పక్కా ఇళ్లను ఇచ్చారు.. అదే బాటలో ఇప్పుడు ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పేదలతో సామూహిక గృహ ప్రవేశాలు చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్ల 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెట్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తాం. ఇటీవల 3 లక్షల గృహ ప్రవేశాలు చేశామన్నారు. ఉగాది రోజున 5 లక్షల గృహ ప్రవేశాలు ఉంటాయి. మరో 3 ఏళ్లలో అందరికీ ఇల్లు నిర్మించి ఇస్తాం అన్నారు. రికార్డులు తారుమారు చేయకుండా ఉండేందుకు ఎన్టీఆర్ ఒకప్పుడు మున్సబ్, కరణం వ్యవస్థను రద్దు చేశారు. ఐదేళ్ల అధికారంలో ఉండి మళ్లీ ప్రతిపక్షంలోకి రావటానికి సిద్ధంగా లేమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గుజరాత్ స్ఫూర్తితో ఒకే ప్రభుత్వాన్ని కొనసాగిస్తూ అభివృద్ధి పథంలో ముందుకెళదామని పిలుపునిచ్చారు. అవినీతి సొమ్ముతో మీడియా సంస్థ పెట్టిన పార్టీతో పోరాడాల్సి రావటం మన దౌర్భాగ్యమని చంద్రబాబు మండిపడ్డారు. క్రెడిట్ చోరీ అంటూ సొంత మీడియాలో గ్రీన్ కో, భోగాపురం విమానాశ్రయం, అమరావతి పై విషం కక్కుతున్నారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. తాను ఎక్కడుంటే అక్కడ రాజధాని అంటూ కనీస ఇంగితం లేకుండా జగన్ మాట్లాడుతున్నాడని సీఎం దుయ్యబట్టారు. తాను బెంగుళూరులో ఉంటే బెంగుళూరు, ఇడుపులపాయలో ఉంటే అదీ రాజధాని అవుతుందా అని నిలదీశారు. రాజకీయ ముసుగులో గిల్లికజ్జాలకు పాల్పడుతూ తోక జాడిస్తే ఎక్కడున్నా పట్టుకొచ్చి బట్టలూడదీస్తాం జాగ్రత్త అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ముసుగులో నేరాలు ఘోరాలు చేస్తే ఉపేక్షించమని వైఎస్సార్సీపీని చంద్రబాబు హెచ్చరించారు. పల్నాడును శాంతియుత ప్రాంతంగా మార్చి చూపుతామని తెలిపారు. ఎన్టీఆర్‌కు భారతరత్న సాధించి తీరుతామనే నమ్మకం నాకుందని చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కొత్త విషయాలు నేర్చుకుంటూ పెట్టుబడులు సాధించేందుకే దావోస్ పర్యటన అని చంద్రబాబు తెలియజేశారు. బాబాయ్‌ని చంపినంత తేలిక కాదు రాష్ట్రంలో నేరాలు చేయటమని సీఎం అన్నారు. త్వరలోనే మరో 700 అన్న క్యాంటీన్లు పెడతామన్న చంద్రబాబు, ఎన్టీఆర్ స్ఫూర్తితోనే రాష్ట్రంలో 200 కు పైగా అన్న క్యాంటీన్లు నడుపుతున్నామని తెలియజేశారు. భౌతికంగా దూరమైనా తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. సుపరిపాలనకు సరైన నిర్వచనం చెప్పిన నాయకుడు ఎన్టీఆర్ అని చంద్రబాబు అన్నారు. అన్ని వర్గాలను రాజకీయాల్లోకి తీసుకురావాలని ఆలోచించిన ఏకైక నాయకుడు ఎన్టీఆరేనని సీఎం గుర్తు చేశారు.

# సిఎం చంద్రబాబు దావోస్ పయనం

>> అనంతరం భారత ఎంబసీ ఆధ్వర్యంలో జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. మొత్తం 20 దేశాల నుంచి వచ్చే ఎన్ఆర్టీలతో నిర్వహించే తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొని తెలుగు ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు. అనంతరం సీఎం చంద్రబాబు జ్యూరిచ్ నుంచి రోడ్డు మార్గాన దావోస్ వెళ్తారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక, పర్యాటక విభాగాల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో వివిధ దేశాల మధ్య జరిగే సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం టాటాసన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రితో భేటీ కానున్నారు.

సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ కూడా దావోస్ వేదికగా సీఎంతో సమావేశం అవుతారు. విదేశీ మీడియా సంస్థ పొలిటికోకు ముఖ్యమంత్రి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు. దావోస్ రెండో రోజు పర్యటనలో భాగంగా హోటల్ మొరోసాని ప్రోమెనేడ్‌లో ఇండియా ఎట్ సెంటర్ జియోగ్రఫీ గ్రోత్ ఏపీ అడ్వాంటేజ్ పేరిట సీఐఐ నిర్వహిస్తున్న బ్రేక్ ఫాస్ట్ సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. అనంతరం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండియా లాంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం ఛైర్మన్ సీఈఓ అరవింద్ కృష్ణతో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. ఈ భేటీకి ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కూడా హాజరుకానున్నారు. గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌తోనూ సీఎం సమావేశం కానున్నారు. ముఖాముఖి భేటీల అనంతరం ఏపీ లాంజ్‌లో నిర్వహించనున్న వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ ప్యానల్ డిస్కషన్‌కు సీఎం హాజరుకానున్నారు. అనంతరం ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ సీఎన్ బీసీ ఇంటర్నేషనల్‌కు కూడా ముఖ్యమంత్రి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు. దావోస్ కాంగ్రెస్ సెంటర్‌లో వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, అనిల్ మూర్తిలతో సీఎం కొద్దిసేపు సమావేశం అవుతారు. ప్రపంచ ఆర్థిక సదస్సు సెషన్‌లో ఎనర్జీ ట్రాన్సిషన్ లీడర్స్ సమావేశంలోనూ ముఖ్యమంత్రి పాల్గొంటారు. స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవహారాల డిప్యూటీ మినిస్టర్ హెలెన్ బడ్లిజెర్ అర్టెడా, రాయబారి ఆండ్రియా రౌబర్‌తో సీఎం చర్చలు జరుపుతారు. అలాగే స్విట్జర్లాండ్ పార్లమెంటు సభ్యుడు, భారత స్విస్ ఫ్రెండ్ షిప్ గ్రూప్ అధ్యక్షుడు నిక్ గుగ్గర్ సహా ఇతరులతో సీఎం సమావేశం కానున్నారు. అనంతరం ఎన్విడియా ఉపాధ్యక్షుడు కాలిస్టా రెడ్మండ్‌తో సీఎం భేటీ అవుతారు. ఇజ్రాయెల్ ఆర్థిక పారిశ్రామిక విభాగం మంత్రి నిర్ బర్కత్, ఆ దేశ ట్రేడ్ కమిషనర్ రోయ్ ఫిషర్, స్విట్జర్లాండ్‌లో ఇజ్రాయెల్ ఎకనామిక్ ట్రేడ్ మిన్ హెడ్ షిర్ స్లడ్జ్కి తోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరపనున్నారు. రెండో రోజు సాయంత్రం జేఎస్ డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ ఎండీ సజ్జన్ జిందాల్, జెఎస్ డబ్ల్యూ సిమెంట్స్, పెయింట్స్ సంస్థల ఎండీ పార్థ్ జిందాల్‌తోనూ సీఎం భేటీ అవుతారు.

అంతర్జాతీయ కంటైనర్ లాజిస్టిక్స్ సంస్థ మోలర్ మేర్స్క్ సీఈఓ విన్సెంట్ క్లెర్క్ తో సీఎం ముఖాముఖి సమావేశం అవుతారు. ఈ రెండు సమావేశాలకూ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కూడా హాజరు కానున్నారు.

అనంతరం జాన్ కాక్రిల్ సంస్థ గ్రూప్ సీఈఓ జీన్ లక్ మారాంగేతో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. విజన్ టు వెలాసిటీ డెప్లాయింగ్ ఇన్నోవేషన్ ఎట్ స్కేల్ పేరిట నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరవుతారు. దావోస్‌లో మూడో రోజు వరల్డ్ ఎకనామిక్ ఫోరం కాంగ్రెస్ సెంటర్‌లో జరిగే పారిశ్రామిక పురోగతి అంశంపై నిర్వహించే సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. హురైసిస్ ఛైర్మన్ ఫ్రాంక్ రిచర్ తో భేటీ కానున్నారు. తమారా హాస్పిటాలిటీ సంస్థ ఫౌండర్ సృష్టి శిబులాల్, ఆ సంస్థ సీఈఓ కుష్బు అవస్థి, కాలిబో ఏఐ అకాడమీ సీఈఓ రాజ్ వట్టికుట్టి, స్కాట్ శాండ్స్టెఫర్ లు సమావేశం ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతారు. అనంతరం ఏపీ సీఎస్ఎఫ్ నిర్వహించే హీలింగ్ ప్లానెట్ త్రో రీజెనరేటివ్ ఫుడ్ సిస్టమ్స్ పేరిట జరిగే చర్చా కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. ఆ తర్వాత ట్రిలియన్ డాలర్ ప్రైవేట్ రీరేటింగ్ మార్కెట్ సిగ్నల్స్ ఫర్ నేచర్ పాజిటివ్ గ్రోత్ అనే అంశంపై చర్చా కార్యక్రమంలోనూ సీఎం పాల్గొంటారు.

బ్లూమ్ బెర్గ్ సంస్థ నిర్వహించనున్న ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్ ఏఐ మూమెంట్ ట్రాన్సా ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ సెషన్ లో ముఖ్య వక్తగా ప్రసంగించనున్నారు. ఏపీ లాంజ్ లో నిర్వహించే బిల్డింగ్ ఇండియా ఇన్ఫ్రా స్ట్రక్చర్ కార్యక్రమంలో కేంద్ర మంత్రులతో కలిసి సీఎం హాజరు అవుతారు. వాతావరణ మార్పులపై ఫైనాన్సింగ్ రీజెనరేషన్ మొబిలైజింగ్ కేపిటల్ పేరిట నిర్వహించే మరో కార్యక్రమంలోనూ ముఖ్యమంత్రి పాల్గొంటారు. మొత్తంగా దావోస్‌లో 36 కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. ప్రభుత్వాల మధ్య జరిగే 3 సమావేశాల్లో పాల్గొంటారు. పారిశ్రామికవేత్తలతో 16 వన్ టు వన్ సమావేశాలు జరగనున్నాయి. 9 రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్లీనరీ సెషన్స్‌లో సీఎం పాల్గొంటారు.

సీఎన్బీసీ ఇంటర్నేషనల్ సహా వివిధ అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తారు. పర్యటన తొలి రోజున జ్యూరిచ్‌లో తెలుగు డయాస్పోరా మీటింగ్‌లో పాల్గొంటారు. జనవరి 22 తేదీన దావోస్ నుంచి జ్యూరిచ్ కు చేరుకుని స్విట్జర్లాండ్ కాలమానం ప్రకారం 2.35 గంటలకు స్వదేశానికి బయల్దేరి రానున్నారు. 23వ తేదీ ఉదయం 8.25 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్ చేరుకోనున్నారు.

# పల్నాడు ప్రశాంతతను చెదరనివ్వం

>> హయాంలో పంట భూములకు నీళ్ల పారుతున్నాయని స్పష్టం చేశారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణకు రాజకీయ రంగు పులిమి తెలుగుదేశం పార్టీపై బురద చల్లేందుకు వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని మండి పడ్డారు. చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ కి జగన్ నేతృత్వంలోని వైసీపీ కి మధ్య ఉన్న తేడా ప్రజలకు బాగా తెలుసని అన్నారు. అరాచకాలతో గందరగోళం చేసే పార్టీ వైసీపీ అని ఆరోపించారు. కానీ టీడీపీ అలా కాదన్నారు. గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పని చేసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని స్పష్టం చేశారు. కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నందుకే ఆ పార్టీని ప్రజలు 11సీట్లకు పరిమితం చేశారన్నారు. అయినా కూడా వైసీపీకి బుద్ధి రాలేదని విమర్శించారు. పల్నాడు ఫ్యాక్షన్, హత్యా రాజకీయాలపై వైసీపీ నేతలు చేస్తున్నఅసత్య ప్రచారాన్ని ఖండిస్తూ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అమరావతి లోని క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం ఒక వీడియో విడుదల చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఫ్యాక్షన్, అక్రమ మైనింగ్ లతో పల్నాడు ప్రాంతం వల్లకాడు అయ్యిందని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. గురజాల నియోజకవర్గం, మాచవరం మండలంలోని పిన్నెల్లి గ్రామానికి చెందిన 300 మంది ఊరు వదిలి భయంతో పారిపోయారని అన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో పిన్నెల్లి గ్రామంలోనే 12 మందిని చంపేశారని, అందులో ఎస్సీ, బీసీలు కూడా ఉన్నారని మంత్రి గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మైనింగ్ తో ఏర్పడిన గుంటల్లో పడి ఏడెనిమిది మంది చనిపోయినా పట్టించుకున్న వాళ్లు లేరని విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై జరిగిన దాడులు, హత్యా రాజకీయాలు, పల్నాడు ప్రాంతంలో చేసిన గందరగోళాలు అందరికీ తెలుసని మంత్రి గొట్టిపాటి చెప్పారు. బాధితులను పరామర్శించడానికి చంద్రబాబు నాయుడు పల్నాడుకు వెళ్తే అడ్డుకునే ప్రయత్నం చేసిన విషయాన్ని కూడా మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గతంలో ఊరు విడిచి వెళ్లిన వాళ్లందరు తిరిగి ఊళ్లకు వస్తున్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పల్నాడు ప్రాంత రైతుల వ్యవసాయ భూములకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సాగునీటి సరఫరా చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. టీడీపీ, చంద్రబాబు ఎలాంటి వారో అందరికీ తెలుసని ఈ విషయాలు కూడా అదే స్పష్టం చేస్తున్నాయన్నారు. గ్రామాభివృద్దే లక్ష్యంగా పని చేయాలని మొదటి నుంచి సీఎం చంద్రబాబు చెబుతుంటారని మంత్రి గొట్టిపాటి తెలిపారు. ప్రజలందరూ సుఖ, శాంతులతో ఉండాలన్న ఏకైక ధ్యేయంతో., గత 40 సంవత్సరాలుగా చంద్రబాబు పని చేస్తున్నారన్నారు.

**అక్రమ సంపాదన నుంచి పుట్టిందే వైసీపీ:** జగన్ అధికారం చేపట్టిన తరువాత నుంచి పల్నాడుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఏ విధంగా హత్యా రాజకీయాలు జరిగాయో ప్రజలు కూడా గమనించాలని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. టీడీపీ నేతలపై దాడులు చేయడమే కాకుండా చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులు బనాయించి జైలుకు కూడా పంపారన్నారు. అక్రమంగా సంపాదించిన సొమ్ములతో వైసీపీ పార్టీని పెట్టారని మంత్రి ఆరోపించారు. తెలుగోడి ఆత్మ గౌరవం కోసం పుట్టిందే తెలుగుదేశం పార్టీ అన్నారు. ప్రజలు 11 సీట్లు ఇచ్చినా ఇంకా వైసీపీ నేతలకు సిగ్గు రాలేదని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. గ్రామాల్లో జరిగిన హత్యలకు రాజకీయ రంగు పూసి, ఎవరు చనిపోతారా.. లబ్ధి పొందుదామని వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని మంత్రి మండి పడ్డారు. వైసీపీ నేతల అనైతిక చర్యలను ప్రజలు కూడా ఖండించాలని మంత్రి గొట్టిపాటి కోరారు.

**ఫ్యాక్షన్ లేని పల్నాడుకు కృషి చేస్తున్నాం:** రాష్ట్రంలో హత్యా రాజకీయాలు, ఫ్యాక్షన్ గొడవలు ఎక్కడ జరిగినా అణచి వేసింది చంద్రబాబు నాయుడు ఒక్కరే అని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పల్నాడు ప్రాంతం ఎంతో ప్రశాంతంగా ఉందన్నారు. ఈ ప్రశాంతతను భగ్నం చేయడానికి వైసీపీ నేతలు ప్రయత్నిస్తే చూస్తూ ఉపేక్షి ంచబోమని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడ హత్యా రాజకీయాలు జరిగినా కూటమి ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి రైతు కుటుంబంలోనూ ఒక ఉద్యోగం ఉండాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. ఫ్యాక్షన్ గొడవల పట్ల పోలీస్ శాఖ కూడా కఠిన వైఖరి అవలంబిస్తుందన్నారు. బాధితులకు అండగా ఉంటూనే, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి హెచ్చరించారు.

## అమెరికన్ల మృతికి ప్రతీకారం..

# అల్‌ఖైదా అనుబంధ సంస్థ కమాండర్ హతం

**డమాస్కస్, జనవరి 18:** సిరియాలో తమ పౌరులపై గత నెలలో జరిగిన ఘాతుకానికి అమెరికా ప్రతీకారం తీర్చుకుంది. ముగ్గురు అమెరికన్ల మృతికి కారకుడైన ఉగ్రవాద నాయకుడిని వైమానిక దాడిలో హతమార్చినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ధ్రువీకరించింది. ఈ దాడి ఈనెల 16న వాయవ్య సిరియాలో జరిగింది. సెంట్‌కామ్ వివరాల ప్రకారం ఈ దాడిలో అల్‌ఖైదా అనుబంధ సంస్థకు చెందిన కీలక నేత బిలాల్ హసన్ అల్‌జాసిమ్ హతమయ్యాడు. డిసెంబర్ 13న పాల్మైరాలో జరిగిన దాడిలో ఇద్దరు అమెరికన్ సైనికులు, ఒక అమెరికన్ సివిలియన్ ఇంటర్‌ప్రెటర్ మరణించారు. ఈ దాడికి సూత్రధారి అయిన ఐసిస్ ఉగ్రవాదితో అల్‌జాసిమ్‌కు ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

డిసెంబర్ దాడి తర్వాత అమెరికా జరిపిన మూడో ప్రతీకార దాడి ఇది. మేం ఎప్పటికీ మర్చిపోం, వదిలిపెట్టం అని రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ హెచ్చరించారు. సెంట్‌కామ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ మాట్లాడుతూ, మా బలగాలపై దాడి చేసే ఉగ్రవాదులను వెంబడించడంలో మా సంకల్పాన్ని ఈ ఘటన తెలియజేస్తుంది. అమెరికన్లపై దాడులు చేసేవారికి ఎక్కడా సురక్షితమైన ఆశ్రయం ఉండదు. మిమ్మల్ని వెతికి పట్టుకుంటామని అన్నారు. ఆపరేషన్ హాక్‌ఐ స్ట్రైక్ పేరుతో చేపట్టిన ఈ విస్తృత చర్యల్లో భాగంగా సిరియా వ్యాప్తంగా 100కు పైగా ఐసిస్ స్థావరాలు, ఆయుధాగారాలను ధ్వంసం చేసినట్లు సెంట్‌కామ్ పేర్కొంది. గడిచిన సంవత్సరంలో 300 మందికి పైగా ఐసిస్ కార్యకర్తలను పట్టుకోగా, 20 మందికి పైగా ఉగ్రవాదులను హతమార్చినట్లు తెలిపింది. సిరియాలో ఐసిస్‌ను ఎదుర్కోవడానికి, స్థానిక భాగస్వామ్య దళాలకు మద్దతుగా అమెరికా తన సైనిక కార్యకలాపాలను కొనసాగిస్తోంది.

# వడివడిగా కీలక ప్రాజెక్టులు

>> నిరక్ష్యం చేయకుండా పని చేయాలి. ముఖ్యంగా వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ఈ ఏడాదిలో పూర్తి చేయాల్సి ఉంది. వీటి నిర్మాణం విషయంలో టార్గెట్ పెట్టుకోవాలి. ఇక నల్లమల సాగర్ విషయంలో కేంద్రంతో, పొరుగు రాష్ట్రంతో సంప్రదింపులు జరపాలి. వివాదాలు లేకుండా రెండు రాష్ట్రాలు కలిసి అభివృద్ధి చెందేలా సహకరించుకోవాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. సముద్రంలోకి వృధాగా వెళ్ళే వరద నీటిని రెండు తెలుగు రాష్ట్రాలు వినియోగించుకోవాలన్నదే ఉద్దేశం. అందుకే మేం అభ్యంతరం చెప్పలేదు. వృధాగా పోయే జలాలను వాడుకునేలా రూపొందించిన నల్లమల సాగర్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు తీసుకోవడంతోపాటు పొరుగు రాష్ట్రం కూడా అభ్యంతరం చెప్పకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయ్యాక అవసరమైన పక్షంలో తెలంగాణకు కూడా నీటిని ఇచ్చే పరిస్థితి ఉంటుంది. ఇక ఈ ఏడాది పీపీపీ పద్ధతిన వివిధ రంగాల్లో పెద్ద ఎత్తున ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. సుమారు 290 ప్రాజెక్టులను మొదటి విడతలో చేపట్టాలి. దీనికి కేంద్రం నుంచి సహకారం లభిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పీపీపీ పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయండి. జల్ జీవన్ మిషన్ పనుల్లో వేగం పెంచాలి. 2027 నాటికి ఈ స్కీం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి."అని ముఖ్యమంత్రి తెలిపారు.

**జల్ జీవన్ మిషన్ పనుల్లో వేగం:** వృధాగా పోయే జలాలను వాడుకునేలా రూపొందించిన నల్లమల సాగర్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు తీసుకోవడంతోపాటు పొరుగు రాష్ట్రం కూడా అభ్యంతరం చెప్పకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక అవసరమైన పక్షంలో తెలంగాణకు కూడా నీటిని ఇచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. ఈ ఏడాది పీపీపీ విధానంలో వివిధ రంగాల్లో పెద్ద ఎత్తున ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. సుమారు 290 ప్రాజెక్టులను మొదటి విడతలో చేపట్టాలని, కేంద్రం నుంచి సహకారం లభిస్తోందని తేల్చిచెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పీపీపీ పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్ పనుల్లో వేగం పెంచాలని 2027 కి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి తెలిపారు. కీలక రంగాలకు సంబంధించిన వివిధ పథకాలను అమలు చేసే అంశాల్లో సాంకేతిక పరమైన అంశాలు ఏమైనా ఉంటే వాటినీ వెంటనే పరిష్కరించుకునే అంశంపై దృష్టిపెట్లాలని దిశానిర్దేశం చేశారు. అవసరమైన మేరకు కేంద్రంతో సంప్రదింపులు జరపాలని సీఎం సూచించారు.

**దావోస్ నుంచి వచ్చేలోగా నివేదికలు సిద్ధం చేయండి**

కీలక రంగాలకు సంబంధించిన వివిధ పథకాలను అమలు చేసే అంశంపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయండి. దావోస్ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత రిపోర్టులు సమర్పించాలి. ప్రణాళికలతోపాటు.. ఆయా పథకాల అమలుకు అధికారులు సిద్ధంగా ఉండడంతోపాటు.. క్షేత్ర స్థాయి యంత్రాంగాన్ని కూడా సిద్ధంగా ఉంచుకోవాలి. అలాగే సాంకేతిక పరమైన అంశాలు ఏమైనా ఉంటే.. వాటిని కూడా వెంటనే పరిష్కరించుకునే అంశంపై ఫోకస్ పెట్టండి. అవసరమైన మేరకు కేంద్రంతో సంప్రదింపులు జరపండి."అని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు సీఎస్ విజయానంద్ సహా ఆర్థిక, ఇరిగేషన్, వ్యవసాయం, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'ఆరోగ్యం'లో అవేర్ సేవలు

>> నమోదైన కేసులు వివరాలను కూడా అనుసంధానం చేస్తామని తెలిపారు తద్వారా ప్రాంతాల్లోని పరిస్థితులపై పూర్తి అవగాహన వస్తుందని పేర్కొన్నారు. మాతాశిశు ఆరోగ్యం, సీజేరియన్లు, టీకాలు వేయించుకునే శిశువులు తదితర వివరాలను గ్రామ, సచివాలయాల వారీగా వివరాలు సిద్ధం చేస్తున్నారు. సైక్లోన్ సమయంలో సదరు ప్రాంతాల్లోని హైరిస్క్ గర్భిణులను సురక్షి త ప్రాంతాలకు తరలిం చేందుకు అవేర్ బాగా ఉపయోగపడుతుందని మంత్రి సత్యకుమార్ వివరించారు.

**ఇతర శాఖలతో అనుసంధానం:** ఆర్టీజీఎస్ ఆధ్వర్యంలో నడిచే అవేర్ ప్లాటుఫాం వేదికగా వ్యవసాయ, మత్స్య శాఖలు, పర్యావరణం కాలుష్యం, వాటర్ అండ్ రిజర్వాయర్ మేనేజ్ మెంటు, శాటిలైటు డేటా బేస్డ్ మానిటరింగ్, డిజాస్టర్ మేనేజ్మెంట్, ఇతర శాఖలతో అనుసంధానం చేశారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

>> సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఆపరేషన్‌లో ఆదివారం రాత్రి పదిగంటలప్రాంతంలోనే మావోయిస్టులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుల్లో మావోయిస్టు కమాండర్ డివిసిఎం దిలీప్ బెద్జా, ఎసిఎం మాడ్వి కోసా, మహిలా ఎసిఎం లఖీ మాడ్కమ్, పార్టీ సభ్యుడు రాదాలుగా ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన ఇద్దరినీ గుర్తించాల్సి ఉంది. ఇంద్రావతి రిజర్వు, నేషనల్‌పార్క్ ప్రాంతాల్లో దిలీప్ చురుకుగా మావోయిస్టు కార్యకలాపాలునిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా విస్తృత కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తేలింది. డిప్యూటీ సీఎం విజయ్‌శర్మ మాట్లాడుతూ బెద్జా లొంగిపోడానికి అవకాశం కల్పించినా తిరస్కరించాడని, పదేపదే హెచ్చరికలు జారీచేసి ఆయుధాలతో లొంగిపోవాని హెచ్చరించినా కూడా లెక్కచేయలేదని, చివరకు ఎన్‌కౌంటర్‌లోప్రాణాలు పోగొట్టుకున్నట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్‌ప్రాంతంలో భారీ సంఖ్యలో ఆయుధాలు, రెండు ఎకె 47 తుపాకులు, ఒక ఇన్సాస్ రైఫిల్, రెండు 303 రైఫిళ్లు, ఆరుగ్రేనేడ్‌లను స్వాధీనంచేసుకున్నారు. మావోయిస్టులు భారీ ప్లాన్‌తో ఉన్నట్లు గుర్తించామని అందుకే నిఘా వ్యవస్థను పటిష్టంచేసి ఆపరేషన్ కొనసాగించినట్లు బీజాపూర్‌ఎస్‌పి డా.జితేంద్రయాదవ్ తెలిపారు. బస్తర్‌రేంజి ఐజి సుందర్‌రాజ్ పట్టిలింగమ్ సాయుధదళాల కృషిని ప్రశంసించారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనా సవాళ్లు ఎదురవుతున్నా డిఆర్జీ, కోబ్రా, ఎస్టీఎఫ్ దళాలు ధైర్యంగా ముందుకుపోయాయరని కొనియాడారు.

# వచ్చే నెల మెగా డిఎస్సీ

>> అవసరమవుతారు. కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, విద్యా నాణ్యతను పెంచేలా ప్రణాళికలు వేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 18 తరగతుల వరకు ఎన్‌సీఈఆర్టీ సిలబస్ బోధించేందుకు కొత్త పుస్తకాలు తీసుకురానున్నారు. డీఎస్సీ పరీక్షలో ఆంగ్ల భాష, కంప్యూటర్ అవగాహనపై ఒక పేపర్ ఉంటుందని ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటివరకు డీఎస్సీ పరీక్ష కేవలం సంబంధిత సబ్జెక్టుపైనే జరిగేది. కానీ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పలు ఉద్యోగపోటీ పరీక్షల్లో ఆంగ్ల భాషకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలోనే టీచర్‌పోస్టుల భర్తీ ప్రక్రియలో కూడా ఆంగ్ల భాషా ప్రావీణ్యంపై ప్రాథమిక స్థాయి పరీక్ష తప్పనిసరి చేయనున్నారు. ఈ మార్పుల వల్ల ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ మరింత పటిష్టంగా మారుతుందని భావిస్తున్నారు. ఈ కొత్త విధానాలు విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# సమాచార హక్కు కమిషనర్ల నియామకం

>> చంద్ర కల్యాణ చక్రవర్తి, గాజుల ఆదెన్న (అనంతపురం), ఒంటేరు రవిబాబు (కడప), పరవాడ సిం హాచలం నాయుడు (విశాఖపట్నం) ఉన్నా రు. నియమితులైన వారంతా న్యాయవాద వృత్తికి చెందిన వారు కావడం గమనార్హం. ఈ కొత్త కమిషనర్లు మూడేళ్ల పాటు లేదా వారికి 65 ఏళ్లు వచ్చే వరకు (ఏది ముందైతే అది) పదవిలో కొనసాగుతారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన, మంత్రులతో కూడిన సెలెక్షన్ కమిటీ చేసిన సిఫార్సులకు గవర్నర్ ఆమోదం తెలపడంతో ప్రభుత్వం ఈ నియామకాలను ఖరారు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం కమిషన్‌లో ముగ్గురు సభ్యులు ఉండగా, తాజా నియామకంతో కమిషన్ బలం గణనీయంగా పెరిగింది. ఈ నియామకాలతో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుల పరిష్కారం వేగవంతం అవుతుందని, ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత మరింత పెరుగుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## వారం - వర్జ్యం

19-01-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాషాఢ కార్తె
పాడ్యమి రా.2.12
ఉత్తరాషాఢ ఉ.11.50
వర్జ్యం : సా.4.02-5.43
దు.ము.12.41-1.26,
2) మ.2.56-3.41
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** వీసా, పాస్‌పోర్ట్ అంశాలు ఒకింత పురోభివృద్ధిలో ఉంటాయి. వృత్తి పరంగా అభివృద్ధి సాధిస్తారు.

**వృషభం:** మీ వారెవరో, మీకు అపకారం చేసేవారెవరో స్పష్టంగా తెలుస్తుంది. తనఖాలు విడిపిస్తారు.

**మిథునం:** ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టడంలో కాస్త జాప్యం జరుగుతుంది. మీ మేధస్సు నలుగురిలో ప్రశంసించబడుతుంది.

**కర్కాటకం:** నమ్మకాలకు తావివ్వకుండా రొటీన్ సంతకాల విషయంలో వ్యక్తిగత బంధుత్వాలకు అతీతంగా వుండండి.

**సింహం:** పలుకుబడి కలిగిన వ్యక్తులతో ఏర్పడిన పరిచయాలు మీకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తారు.

**కన్య:** అన్ని పనులు మీరే స్వయంగా చూసుకోవలసి వస్తుంది. సహచర వర్గం కరువవుతారు. ధనలాభం.

**తుల:** వాహనం నడిపేటప్పుడు, మధ్యవర్తిత్వము, వివాదాలు మొదలయిన వాటి విషయవ్యవహారాలలో జాగ్రత్త.

**వృశ్చికం:** అనుకూలాంశాలు ఉంటాయి. కుటుంబ పురోభివృద్ధి సంఘంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయి.

**ధనుస్సు:** ఇతరుల సలహాలు అతిగా స్వీకరిస్తారు. కానీ మీ మనస్సుకు తోచిన పనులనే చేసారు. వస్త్ర లాభం.

**మకరం:** ప్రయాణాలలో వస్తుభద్రత పట్ల విశేష జాగ్రత్తలు పాటించండి. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి.

**కుంభం:** సంబంధ బాంధవ్యాలు మెరుగ్గా ఉంటాయి. మిత్రులలో ఏర్పడిన విభేదాలు తొలుగుతాయి, సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్టి సాగిస్తారు.

**మీనం:** కాలానుగుణంగా పరిస్థితులను మార్చుకో గలుగుతారు. చేపట్టిన కార్యక్రమాలు నిదానంగా పూర్తి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# దుర్గమ్మ ఆలయంలో నేటి నుండి మాఘమాస పూజలు

**ఇంద్రకీలాద్రి, జనవరి 18, ప్రభాతవార్త :** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 19ను మాఘమాసం ప్రారంభం నుండి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈనెల 25, 28, ఫిబ్రవరి 1, 8, 13, 15వ తేదీలలో ప్రత్యేక సూర్య ఉపాసన పూజాదికాలు జరుగుతాయన్నారు. రు.1000ల ఉభయ రుసుము తో దంపతులు పాల్గొనవచ్చున్నారు. అలాగే ఈనెల 23 వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 7 గంటల వరకు యూనిఫారం, గుర్తింపు కార్డుతో వచ్చిన విద్యార్ధిని విద్యార్థులకు ఉచిత దర్శనం ఏర్పాటు చేశామన్నారు. అలాగే వారికి 6వ అంతస్థులో శ్రీ అమ్మవారి ప్రసాదంగా పెన్ను, లడ్డూ ప్రసాదం, శక్తికంకణం, శ్రీ అమ్మవారి ఫోటో అందిస్తామన్నారు. 6వ అంతస్థులో ఉచితంగా 500 మందికి అక్షరాభ్యాసం చేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా దుర్గమ్మవారు జ్ఞానప్రదాయిని శ్రీ సరస్వతి మాతగా దర్శనమిస్తారన్నారు. అలాగే సరస్వతి హోమం నిర్వహిస్తామన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం


కొండపై భక్తుల రద్దీ


పూజలు నిర్వహిస్తున్న పండితులు

అమావాస్య సందర్భంగా నిర్వహించిన చండీహోమం, సూర్య ఉపాసన సేవలో పెద్ద ఎద్దఎత్తున పాల్గొన్నారు. పూజల అనంతరం శ్రీ స్వామివారికి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

## సాల్మన్ హత్యపై వినతిపత్రం ఇస్తాం - వెంటనే అపాయింట్‌మెంట్ ఇవ్వండి

### డిజిపికి వైఎస్సార్సీపి లేఖ

**విజయవాడ.జనవరి 18.ప్రభాతవార్తప్రతినిధి:** పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లిలో వైయస్సార్‌సీపీకి చెందిన దళిత కార్యకర్త మంద సాల్మన్ దారుణహత్యపై రాష్ట్ర డీజీపీకి వినతిపత్రం సమర్పించాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు తమకు సోమవారం (19వ తేదీ)నాడు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ, వైయస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. ఊరు విడిచి ఎక్కడో తలదాచుకుంటూ, తన భార్యను చూసేందుకు వచ్చిన, వైయస్సార్‌సీపీ దళిత కార్యకర్త మంద సాల్మన్‌ను పిన్నెల్లిలో దారుణంగా ఐరన్ రాడ్లతో కొట్టి హత్య చేశారని, రాష్ట్రంలో పూర్తిగా దిగజారిన శాంతిభద్రతలకు ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలుస్తోందని లేళ్ల అప్పిరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి దళితులకు ఏ మాత్రం రక్షణ లేకుండా పోతోందని, ముఖ్యంగా వైయస్సార్‌సీపీ దళిత కార్యకర్తలు ప్రాణ భయంతో బిక్కుబిక్కు మంటున్నారని ఆయన తెలిపారు. సాల్మన్ హత్య కేసులో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి, బాధ్యులకు తగిన శిక్ష పడేలా చూడాలని డీజీపీని కోరనున్నామన్నారు.

## రాష్ట్ర పండుగగా కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినం

### - ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పారేపల్లి డూండీ రాకేశ్

**విజయవాడ,జనవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించి కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యుల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకుంది. ఈ నెల 20న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం అని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే సీఎం చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా పెనుగొండలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాన్ని సమర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 25 రాష్ట్ర పండుగలను ప్రకటిస్తే వాటిలో మూడు ఆర్యవైశ్యులకు చెందినవే ఉన్నాయి. ఇది కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ఇచ్చిన గౌరవం. పొట్టి శ్రీరాములు పేరుతో స్మృతివనం నిర్మించాలని సీఎంని కోరగా స్పందించి అమరావతి నడిబొడ్డున 6.8 ఎకరాలను కేటాయించారు. మార్చి 16న పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు ప్రతీకగా 58 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్నాం.

## సంక్రాంతికి రూ.877 కోట్లకు చేరిన మద్యం అమ్మకాలు

**విజయవాడ,జనవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో సంక్రాంతి పండుగ సందర్భంగా మద్యం అమ్మకాలు సరికొత్త రికార్డులు సృష్టించాయి. అనువ్యాంగా అమ్మకాలు సాగాయి. కోడిపందెల బరులు, గాన భజనా కార్యక్రమాలో బహిరంగంగానే అడ్డు అదుపు లేకుండా సాగిన నేపథ్యంలో పాన ప్రియులు ఫూల్ బాటిల్స్ కు మందు లాగించేసారు. దాంతో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో సాగాయి., జనవరి 9 నుండి 16 వరకు, కేవలం వారం రోజుల్లోనే రూ. 877 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. సాధారణ రోజుల్లో రోజుకు రూ. 85 కోట్ల అమ్మకాలు జరిగేవి, కానీ పండుగ సీజన్లో ఇవి రెట్టింపు అయ్యాయి.

# తిరుపతి దాహార్తి తీర్చిన మహానుభావుడు ఎన్టీఆర్

**తిరుమల,జనవరి 18 ప్రభాతవార్త:** తిరుపతిలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు. ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం అనంతరం ఘనంగా నివాళులు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 30 వ వర్ధంతి వేడుకలు ఆదివారం తిరుపతిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తిరుపతి టౌన్ క్లబ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు, ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకున్న నాయకులు విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలమాలలు వేసి ఎన్టీఆర్ అమర్ రహే జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవాన్ని దేశం గర్వించదగ్గ విధంగా చాటి చెప్పిన మహానుభావుడు నందమూరి తారక రామారావుని గతంలో తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెడితే తెలుగు వాడి గొప్పతనాన్ని దేశం నలుదిశల వ్యాప్తి చేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. అలాగే తిరుపతి దాహార్తిని తీర్చడానికి తెలుగు గంగను తీసుకొచ్చి తిరుపతి నా దత్త పుత్రిక అన్న మహానుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు అనంతరం శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనునిత్యం తపించే వ్యక్తి ఎన్టీఆర్ అని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆస్తిలో సమాన హక్కులు ఉండాలని కోరుకున్న మహాత్ముడు ఎన్టీఆర్ అని ఆయన అనునిత్యం

## టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ

తెలుగుజాతి గుండెల్లో ఉండిపోతాడని కొనియాడారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఓ క్రమశిక్షణ కలిగిన ఆదర్శమూర్తిని ఆయన చూపిన దారిలోని నేటి తెలుగుదేశం పార్టీ పయనిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ ఆ దిశలోనే పయనిస్తున్నారని రాష్ట్ర అభిటిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మవృద్ధి జ్యేయంగా తపిస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ ఓ వ్యక్తి కాదు అని ఓ శక్తి అని కొనియాడారు. అనంతరం యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహా యాదవ్ మాట్లాడుతూ రెండు రూపాయల కిలో బియ్యం తీసుకువచ్చి పేద బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి పథంలో నిలపడానికి తపించిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. పేదవాడి ఆకలి తీర్చడంతోపాటు కూడు గూడు గుడ్డ అని నినాదంతో ముందుకు సాగిన మహాత్ముడు ఎన్టీఆర్ అని ఎల్లవేళలా పేదవాడి గుండెల్లో నిలిచే ఉంటాడని అన్నారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ తెలుగు స్వాభిమానానికి ప్రతీక - ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళితెలుగు జాతికి గౌరవం, స్వాభిమానము, రాజకీయ చైతన్యం కలిగించిన మహానాయకుడు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా మనం శతశః వినమ్ర నివాళులు అర్పిస్తున్నాము. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తీసుకున్న ప్రజాహిత నిర్ణయాలు, పాలనలో నూతన దిశ


ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

చూపించాయి. ముఖ్యంగా:మండల వ్యవస్థ ప్రవేశపెట్టడంతెలుగు గంగ కాలువ ప్రాజెక్టుమహిళా విశ్వవిద్యాలయం స్థాపమహిళా మెడికల్ కళాశాల స్థాపఆరోగ్య విశ్వవిద్యాలయం మహిళలకు ఆస్థి హక్కు కల్పించడంమద్యపాన నిషేధం అమలురూ.2 కిలో అన్నపూర్ణ పథకం50+ మహిళలకు పింఛన్ పథకంకుడి-డమ కాలువల ఏకీకరజనతా వస్త్రాలు పంపిణీఈ పథకాలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో శాశ్వత మైలురాళ్లుగా నిలిచాయి. ప్రజల సంక్షేమం, తెలుగు సంస్కృతి మరియు రాజకీయ స్వరాజ్యానికి ఎన్టీఆర్ గారి చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వందలాదిగా ప్రజలు పాల్గొన్నారు.

# వేమన వారసత్వాన్ని గర్వంగా చాటుకుందాం

### - గోరంట్లలో జరిగే వేమారెడ్డి విగ్రహావిష్కరణ వేడుకల్లో కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి

**గోరంట్ల, జనవరి 18 ప్రభాతవార్త** యోగివేమన జయంతిని పురస్కరించుకొని గోరంట్ల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న యోగివేమన విగ్రహావిష్కరణ వేడుకలకు కర్ణాటక రాష్ట్ర రవాణా మరియు దేవాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి మొదటిరోజు కార్యక్రమాలకు ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్ణాటక మంత్రితో పాటు కర్ణాటక రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు వెంకటశివారెడ్డి, జనరల్ సెక్రెటరీ శేఖర్‌రెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ గిరీష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హరీష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ విగ్రహం వద్దకు వారు చేరుకోగానే మండల రెడ్డి సంఘం నాయకులు సాంప్రదాయబద్ధంగా మేళతాళాలతో వారికి ఘన స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో నూతన యోగివేమన విగ్రహానికి మంత్రి రామలింగారెడ్డి పూలు జల్లి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కర్ణాటక ప్రముఖులకు సంఘం నాయకులు రాగి మేకలపల్లి గంగాధర్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, పద్మనాభరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, గంపల రమణారెడ్డి, చింతా రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సమర, నాగభూషణ్‌రెడ్డి, రంగారెడ్డి, ధనుంజయరెడ్డి తదితరులు ముఖ్య అతిథులకు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి రామలింగారెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా రెడ్డి సమాజం ఏకమైతే అన్ని రంగాల్లో మనం అభివృద్ధి చెందుతామని కర్ణాటక రాష్ట్రంలో అక్కడి రెడ్డి సంఘం విద్యకు ప్రాధాన్యతనిస్తోందని, గత వంద సంవత్సరాలుగా ఎలాంటి ఎన్నికలు లేకుండా రాష్ట్ర కమిటీ ఏర్పడుతోందని ఇదే ఐక్యతకు నిదర్శనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.


వేమారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కర్ణాటక మంత్రి

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రధాని మోడీ దాసోహం కావడం సిగ్గు చేటు : సిపిఐ నారాయణ



**విజయవాడ,జనవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రధాని మోడీ దాసోహం కావడం సిగ్గుచేటని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ పేర్కొన్నారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచం ఇప్పుడు ఉద్రిక్త వాతావరణంలో ఉందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన వెనిజులా అధ్యక్షుడును, ఆయన భార్యను కిడ్నాప్ చేయడం అత్యంత బాధాకరమైన చర్యగా అభివర్ణించారు. డ్రగ్స్ సరఫరా నెపంతో వివిధ దేశాలపై అమెరికా దాడులకు తెగపడటం మంచి పరిణామం కాదన్నారు. ట్రంప్ సుంకాల పేరుతో భారీగా భారాలు మోపుతుంటే మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలను ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చుని సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. రాజధాని అమరావతి కోసం రెండోసారి భూ సమీకరణ మంచిది కాదన్నారు. తొలి విడత భూ సమీకరణలో భూములిచ్చిన రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రంలో రైతుల భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కొని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ వారి నోట్లో మన్ను కొడుతుందని చెప్పారు. తెలంగాణలోని ఖమ్మంలో పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు నేడు జరగనున్నాయని, ఈ కార్యక్రమానికి పార్టీ సానుభూతిపరులు అధిక సంఖ్యతో తరలిరానున్నట్లు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య మాట్లాడుతూ.. శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు తరలి వచ్చే కార్యకర్తలు, ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్ల ఏర్పాటు చేశామన్నారు. వందేళ్ల పార్టీ చరిత్రలో ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతోపాటు ప్రజల జీవన విధానాల్లో ప్రముఖ పాత్ర పోషించినట్లు చెప్పారు. శతాబ్ది ఉత్సవాలు ముగిసిన అనంతరం, మూడు రోజుల పాటు పార్టీ జాతీయ సమితి సమావేశాలు, ప్రపంచ స్థాయి సెమినార్ జరగనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు ఐదు వామపక్ష పార్టీలు, ఇతర దేశాల నుంచి వివిధ కమ్యూనిస్టు పార్టీల నాయకులు హాజరవుతారని వెల్లడించారు.



## తుని, పల్నాడు ఘటనల వెనుక వైసిపి గూండాలు

### - అధికారం కోసం జగన్ శవ రాజకీయాలు : మంత్రి సవిత

**పెనుకొండ, జనవరి 18 ప్రభాతవార్త:** జగన్ ప్రోద్బలంతోనే వైసిపి గూండాలు రెచ్చిపోతున్నారని, పండగపూట తుని, పల్నాడులో జరిగిన హత్యలకు ఆయన వ్యాఖ్యలే కారణమని రాష్ట్ర బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. సంక్రాంతి పండుగను ప్రజలంతా ఆనందోత్సవాలతో జరుపుకుంటుంటే, వైసిపి గూండాలు మాత్రం రప్పా... రప్పా... అంటూ రాష్ట్రంలో దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నా రన్నారు. పల్నాడులో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణను కూలాలకు ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. తుని నియోజక వర్గం కోట నందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు, బిసి నేత లాలం బంగారయ్యను అతి కిరాతికంగా హత్య చేశారన్నారు. దాడులకు, హత్యలకు పాల్పడే వారిని ఉక్కుపాదంతో అణిచివేస్తామని మంత్రి హెచ్చరించారు. ఆదివారం పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. అధికారం కోల్పోవడంతో జగన్ మతిభ్రమించిందన్నారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని, ప్రజలు ఆనందోత్సవాలతో సంక్రాంతి జరుపుకోవడాన్ని చూసి ఓర్వలేకపోతున్నాడన్నారు. హత్య రాజకీయాలకు, శవ రాజకీయాలకు తెర లేపి, వైసీపీ గూండాలతో రాష్ట్రంలో అలజడులు సృష్టించడానికి కుట్ర పన్నాడని జగన్ పై మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

# నేడే యోగి వేమన జయంతి వేడుకలు

### వేమన సమాధి ప్రాంతాన్ని టూరిజం సర్క్యూట్‌లో చేర్చాలి: పర్యాటకులు

**అనంతపురం, జనవరి 18, (ప్రభాతవార్త బ్యూరో)** ప్రముఖ సంఘ సంస్కర్త, విశ్వ కవి యోగివేమన జయంతి వేడుకలను ఈ నెల 19 వ తేదీన ప్రభుత్వపరంగా నిర్వహిస్తోంది. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం గాండ్ల పెంట మండలం కటారిపల్లెలో వేమన సమాధి ఉంది. కటారి పల్లెలో ఉన్న వేమన జీవ సమాధిని సందర్శించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు, అభిమానులు వస్తుంటారు. ఇటీవల శ్రీ సత్య సాయి బాబా శతజయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పరంగా అట్టహాసంగా నిర్వహించిన నేపథ్యంలో విశ్వ కవి యోగివేమన జయంతి వేడుకలను కూడా ప్రభుత్వపరంగా నిర్వహిస్తున్న విశేషం. కదిరి ప్రాంతంలో ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రం తిమ్మమ్మ మర్రిమాను, ప్రముఖ పుణ్యక్షేత్రం కదిరి లక్ష్మీనరసింహస్వామి, విశ్వకవి, సంఘసంస్కర్త అయిన యోగివేమన సమాధి ఉన్న ప్రాంతాలను ఒక టూరిజం సర్క్యూట్ లోకి చేర్చడంతో పాటు యోగివేమన జీవ సమాధి ఉన్న కటారి పల్లె ను అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పలువురు పర్యాటకులు కోరుకుంటున్నారు. గతంలో టూరిజం శాఖ తరపున పెద్ద భవనాలు, రూములు నిర్మించినప్పటికీ సరైన నిర్వహణ లేకపోవడం, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండడం తదితర కారణాలవల్ల అభివృద్ధికి నోచుకోలేదు. ఇటీవల కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకొని విశ్వ కవి యోగివేమన జయంతి నీ ప్రభుత్వపరంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ను ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తి చేయడంతో సీఎం స్పందించి ప్రభుత్వపరంగా వేడుకలు నిర్వహించేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

# తిరుమల సమాచారం

## అర్ధబ్రహ్మోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

### - 24 నుండి 26 వరకు ఎస్ఎస్‌డి టోకెన్లు రద్దు
### - 25న ప్రోటోకాల్ విఐపిలకే బ్రేక్ దర్శనం





**తిరుమల,జనవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** సరిగ్గా రానున్న ఆదివారం కలియుగవైకుంఠం ఏడుకొండలపై అర్ధబ్రహ్మోత్సవమ్ (రథసప్తమి) వేడుకలకు టిటిడి విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది. ఒకరోజు బ్రహ్మోత్సవమ్‌లో ఆలయ మాఢవీధుల్లో ఏడువాహనాల వీక్షణకు లక్షలాదిమంది తరలివచ్చే భక్తులకు అన్ని విభాగాలు, శాఖలు సమన్వయంతో స్నేహపూర్వక సేవలందించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈనెల 25వతేదీ ఆదివారం తిరుమలలో రథసప్తమివేడుకలు జరగనున్నాయి. ఆరోజు ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోబాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దుచేసింది. భక్తులను వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులను సమాయత్తం చేస్తున్నారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటుచేస్తున్నారు. ఆ రోజు భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో అదనపు ఏర్పాట్లు చేశారు. 24వతేదీ నుండి 26వరకు తిరుపతిలోని కౌంటర్లల్లో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేశారు.

**- ఉదయం నుండి రాత్రి వరకు వాహనసేవలు:** ఆదివారం ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం,

ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవలు నిర్వహిస్తారు.

## భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి: హైకోర్టు న్యాయమూర్తి

**తిరుమల,జనవరి 18 ప్రభాతవార్తప్రతినిధి :** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులందరిపై ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ వేడుకున్నారు. ఆదివారం ఉదయం న్యాయ మూర్తి దంపతులు ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## అందరి అభిమానంతో 'నారీనారీనడుమమురారీ' విజయవంతం

### - శ్రీవారి సేవలో నటుడు శర్వానంద్

**తిరుమల,జనవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని, నారీనారీనడుమమురారీ కథతో విడుదలైన చిత్రం విజయవంతం కావడం ఆనందంగా ఉందని సినీనటులు శర్వానంద్, సాక్షివైద్య తెలిపారు. చిత్రం హిట్ కావడంతో ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నా మన్నారు. ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చిన చిత్ర బృందం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాలు సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు చిత్ర బృందానికి స్వాగతం పలికి ప్రత్యేకదర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలోపల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన నటీనటులను చూడటానికి, ఫోటోలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. స్వయంగా నటుడు శర్వానంద్ ఆలయం ముందు శ్రీవారి సేవకులను పలకరించి వారి సేవలను అభినందించారు.



## తొమ్మిది జిల్లాల పరిధిలో విద్యుత్ సమస్యలపై నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి

**తిరుపతి,జనవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలోని తొమ్మిదిజిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమం" నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ సిఎండి సిఎండి శివశంకర్ లోతేటి స్వయంగా పాల్గొని వినియోగదారుల సమస్యలపై పరిష్కారం చూపుతారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 8712652679చిత్తూరు: 7993147979నెల్లూరు: 08612320427అన్నమయ్య: 9440817449కడప: 08562242457కర్నూలు: 7382614308నంద్యాల: 7382618976 అనంతపురం: 9154790350శ్రీసత్యసాయి: 9963707847 సదవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కొండపై అరకొర పార్కింగ్ స్థలాలు! రోడ్లపైనే భక్తుల వాహనాలు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగవైకుంఠం తిరుమలకు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి రోజుకు లక్షమంది వరకు భక్తులు...ఐదారు వేలకు పైగా యాత్రికుల వాహనాలు, ట్యాక్సీలు ఇలా తిరుమలకు వస్తున్నాయి. వచ్చిన వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలనేది భక్తులకు తలనొప్పివ్యవహారంగా మారింది. తిరుమలకొండపై ప్రస్తుతం సుమారుగా నాలుగువేల వరకు వాహనాలు పార్కింగ్‌కు అవకాశం ఉంది. ఆ పై వాహనాల సంఖ్య పెరిగితే ప్రధానంగా వరాహస్వామి విశ్రాంతి గృహాలు, పద్మావతి విచారణ కార్యాలయం, ఎంబిసి, వైకుంఠమ్ 2 ప్రాంతాల్లో రోడ్లపైనే భక్తులు వాహనాలను పార్కింగ్ చేయడం కనిపిస్తుంది. రోజువారీగా తిరుమలకు ఐదారువేలవరకు నాలుగుచక్రవాహనాలు వస్తున్నాయనేది టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసుల సమాచారం. ఇలా వస్తున్న వారిలో అధికశాతంమంది భక్తులు తమిళ నాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాలు, మహా రాష్ట్ర, ఒరిస్సా, కేరళ రాష్ట్రాల నుండి యాత్రికులు పుణ్యక్షేత్రాల సందర్శనపేరుతో తిరు మలకు చేరుకుంటున్నారు. తిరుమలలో ఏటిసి కార్‌పార్కింగ్, ముళ్ళగుంట, పాపవినాశనమ్ మార్గంలో, పాత డిటైప్ ప్రాంతం, కౌస్తుభం ,బాలాజీ నగర్ ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. ఇక ఏదేని ప్రత్యేక పర్వదినాలు, బ్రహ్మోత్సవాలు వంటి సమయాల్లో అదనంగాపార్కింగ్ స్థలాలు గుర్తించి వాహనాలను పార్కింగ్ చేయిస్తున్నారు.

వార్త

పైపై ఆకారాలు చూసి మంచి చెడ్డలు నిర్ణయించకండి. అలా చేసేవారు కేవలం సంకుచిత స్వభావులు.

-ఆస్కార్ వైల్డ్

## పులుల సంరక్షణ గణనతో సరి!

ప్రకృతిలో ఉన్న జీవ జాతులు పర్యావరణసమ తుల్యతకు దోహద పడతాయన్న విషయం తెలిసిందే. సంసార రీతిలో జీవించే జనాభా, ఎక్కువ దట్టమైన అడవుల్లో కనుమరు మేరకు చిక్క కుండా తప్పించుకునే జంతు జాతుల లెక్కలు తేల్చా లంటే మామూలుగా అంచనాకు అందే విషయంకాదు. దేశవ్యాప్తంగా అడవుల్లో సంచరించే పులుల సంఖ్య ఏ మేరకు ఉందో చెప్పలేకపోతున్నారు. పర్యావరణానికి పులులకు అవినాభావ సంబంధం ఉన్న విషయం తెలిసిందే. అడవులను రక్షించుకోవాలంటే జంతువుల మనుగడ సాగాలి. జంతువులను కాపాడుకుంటేనే అడవులు పచ్చగా ఉంటా యి. ప్రకృతి విధ్వంసంలో భాగంగా అడవులను, కొండ లను ధ్వంసం చేసే క్రమంలో అడవుల్లో దాక్కున్నపులులు నగరాల మీదకు వస్తున్నాయి. వాటిని చూసి వామ్మో పులి! అంటూ జనం పరుగులు పెడుతున్నారు. అడవులు చక్కగా ఉన్నంతకాలం అవి అక్కడే మనగుడ సాగించా యి. ఒక్క పులులే కాదు. సమస్త జంతుజాలం అడవులను వదిలిపెట్టి రాలేదు. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది. అవి ఉంటేనే అడవులు, ప్రకృతి పచ్చగా ఉంటాయి. అలాంటి అడవులను యథేచ్ఛగా నరికేస్తు న్నాం. కొండలను ధ్వంసం చేస్తున్నాం. దీంతో పులులు, చిరుతలు అడపాదడపా అడవుల శివారు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఆహారం, నీరుకోసం తంటాలు పడుతున్నా యి. ఇప్పటికే కోతులు మనుష్యులను మించి గ్రామాల్లో సంచరిస్తున్నాయి. వీటిని తరిమికొట్టే చర్యలు తీసుకోవ డం లేదు. దీంతో అవి ప్రజల ఆస్తులను, పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రజా జీవనాన్ని భయకంపితం చేస్తున్నాయి. కాగా ఇటీవల పులుల పాదముద్రల ఆచూకీ, లేదా పులులు మైదాన ప్రాంతాలలో తిరుగుతున్నాయ న్న జాడలు కన్పిస్తున్నాయి. అందువే ఎక్కడి పులులు ఎక్కడికి వస్తున్నాయో తెలియడం. ఇకపోతే తెలుగు రాష్ట్రా ల్లో ఈ మధ్య పులులు, చిరుతల సంచారం అడపాదడపా కనిపిస్తోంది. నల్లమల, తిరుమల కొండలతో పాటు తెలం గాణ జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో వీటి సంచారం బాగా పెరిగింది. అలా అటవీ అధికారుల లెక్కల ప్రకారంఉభయ రాష్ట్రాల్లో పులుల సంచారం ఎక్కువైంది. ఓ వైపు మహా రాష్ట్రలోని తాడోబా నుంచి, మరో వైపు నల్లమల నుంచి టైగర్లు కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ సరిహద్దుల్లోని పలు జిల్లాల్లో తిరుగుతున్నాయి. తాడో బాలో పులుల సంతతి పెరిగిపోవడం. అంతర్గత సంఘర్షణ వల్లే పులులు గోదావరి దాటి ఆసిఫాబాద్ జిల్లాలోకి అడుగు పెడుతున్నాయని అంచనా వేసింది. అక్కడి నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ మీదుగా ఇతర జిల్లాల్లోకి ప్రవేశిస్తు న్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మహా రాష్ట్ర లేదా ఛత్తీస్‌గఢ్ నుంచి ఓ పులి గోదావరి దాటి వచ్చినట్టు అనుమానిస్తున్నారు. సాధారణంగా వేసవి కాలం లో పులులు రిజర్వ్ ఫారెస్ట్ వైపు నుంచి ఆమ్రాబాద్ వైపు సంగమేశ్వర ప్రాంతం గుండా నదిని దాటుతుంటా యి. రెండురాష్ట్రాల సరిహద్దుల దగ్గరగుండటం, అక్కడ నీటి లోటు తక్కువగా ఉండటంతో పులులు కొల్లాపూర్ ఫారెస్ట్ లిమిట్స్ లోని మార్గాన్ని ఎంచుకుంటాయి. ఇప్పుడు పెద్దసంఖ్యలో వస్తున్న పులులను రక్షించడం పెను సవాల్‌గా మారింది. టైగర్ కారిడార్లోని అడవుల్లో జిల్లీవలి కాలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పులులను ట్రాక్ చేస్తున్నారు. వాటి కదలిక లను నిత్యం గమనించేందుకు టైగర్ ట్రాకర్లను సైతం నియమించారు. పులుల సంచా రం పెరగడంతోపాటు అప్రమత్తం అయ్యారు. ఇలా కంటి చూపుకందకుండా పారిపోయే పులుల సంగతి పసి కట్టా లన్నా అవి ఎక్కడ ఉన్నాయో, ఎన్నేసి ఉన్నాయో ఆచూకీ తెలియాల్సిందే. ఆ రోజులు రానేవచ్చాయి. ప్రతి నాలు గేళ్లకు జాతీయ పులుల సంరక్షణ అథారిటీ, వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో నిర్వహించే పులుల గణన కు వేళయింది. ఏదోకాకులు లెక్కలు మాదిరి కాకుండా నిర్దిష్టంగా ఎన్నిఉన్నాయో గుర్తించాలన్న లక్ష్యంతోపాటు వాటి ఆవాసాల గురించి కూడా సర్వేలోమినహాయిస్తారు. సాంకేతిక కతతో పాటు అడవుల్లో ఉన్న జీవజాలం వాటికి తగిన ఆహారం, దొరకుదల వంటి అంశాలన్నీ ఇప్పటి సర్వేలో తేలుతాయి. జంతుజాలానికి ఆహార భద్రత వంటి అంశాల ప్రాముఖ్యత తదితర గమనించదగిన అన్ని విష యాలు ఇందులో ఇమిడి ఉంటాయి. ఇప్పుడున్న కేవ లం పులుల గణాంక సేకరణకే పరిమితం కాదు. ఇది ఈ ప్రపంచం లోనే అతిపెద్ద వన్యప్రాణుల సర్వే భావించాలి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 36 నుంచి 45 వరకు పులులు ఉన్నాయని చెబుతున్నారు. పులులు సంచరిస్తు అటవీ ప్రాంతాల్లో ఎలాంటి ఉచ్చులు బిగించకూడదని, పులి కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రకృతిని పరిరక్షిం చుకునే క్రమంలో పులులనుకూడా కాపాడుకోవాల్సి ఉంది. ఈ జాతి మనుగడ సాగించేలా పరిస్థితులను కల్పించాలి. పులులను ఉచ్చులో పడేసేచంపడం, కరెంట్ తీగల పెట్ట డంలా చర్యలు తీవ్రంగా పరిగణించాలి. జాగ్రత్తలు తీసు కుంటున్నా వేటగాళ్ల రూపంలో ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ లోప్రత్యేక పరిస్థితులను ఆకళింపు చేసుకుని సర్వే ప్రారం భిస్తున్నారు. ప్రపంచంలోనే అడవుల్లో ఉన్నపులుల జనాభా లో ఎక్కువ భారత్‌లోనే ఉన్నాయని ఇప్పటికే అంచ నాలున్నాయి. 2022 నాటికి 3967 పులులుండగా తాజాసర్వేలో పులులసంఖ్య ఏపాటిదో తెలుస్తుంది. అప్పు డే పులుల సంరక్షణ, నివాస కల్పన వంటి అంశాలపై జాగ్రత్తలు తీసుకోదగిన అంశాలు తీసుకోవచ్చు.

పువ్వులోని సువాసన, మనిషిలోని ప్రతిభ ఎంత దాచినా దాగవు.



మెకాలే

మంచివాడు కావాలంటే మంచి మనసుండాలి. అది తనలో ఉండాలే తప్ప మరొకరు ఇచ్చేదికాదు.



సెయింట్ అగస్టిన్

# నైపుణ్యాల పోరులో యువత రాణించాలంటే!

**వికసిత్ భారత్ ప్రవేశపెట్టిన అధిష్టాన్ బిల్లు 2025 ప్రకారం ఉన్నత విద్యలో కొన్ని సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు, యూనివర్సిటీలు, టెక్నికల్ సంస్థలు, ఓపెన్ లేదా దూరవిద్యనందించే విశ్వవిద్యాలయాలు ఒకే గొడుగు క్రిందకుతెచ్చి వికసిత భారత్ అధిష్టాన్ పేరుతో వివిధవిద్యా కౌన్సిళ్లను ఒకే లక్ష్యంతో పనిచేసేలా ప్రతిపాదించింది. ఆయా విద్యా సంస్థలు స్వయంప్రతిపత్తితో వివిధ విభిన్న అంశాలను క్రోడీకరించి యువతకు ఉపకరిం చుకోర్సులను రూపొందించి అమలు చేయడం, పరిశోధనల కు పెద్ద పీట వేయడం, ప్రపంచంలో స్థానికంగా ఉన్న అత్యుత్తమ నమూనాలను ప్రదర్శించి తద్వారా గ్లోబల్, లోకల్ అనే వ్యత్యాసం లేకుండా అర్హులైన అందరికీ అనువైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్గించేలా ప్రణాళిక రచించింది. ఇది ఫలిస్తే భారత దేశం అన్ని రంగాలలోను రాణించి స్వయం సమృద్ధి దిశగా పయనించవచ్చు.**



మల్లాడి శ్రీనగేష్

సి.ఐ.ఐ నివేదిక ప్రకారం 23 దేశాలలో సుమారు 83 మిలియన్ మంది సమర్థత కలిగిన నిపుణుల కొరత ఉందని వెల్లడైంది. ఈ లోటును భర్తీ చేయగలిగితే 2028 సంవత్సరం నాటికి 11.5 ట్రిలియన్ డాలర్ల ఆదాయ వనరులను ప్రపంచ స్థూల స్థూల దేశీయోత్పత్తికి అందించే సామర్థ్యాన్ని సంతరించుకోవచ్చని నివేదిక అంచనా వేసింది. ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2025 ప్రకారం భారత దేశం ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశం. 65 శాతం దేశ జనాభా 35 సంవత్సరాల వయసు లోపు వారే. అలాగే దేశ ప్రగతికి, సంపతికి పునాదిరాళ్ళు. కానీ ఉన్న ఉద్యోగ మార్కెట్‌కు యువతకు కలిగియున్న నైపుణ్యాలకు పొంతన లేక సుమారు 45 శాతం మంది డిగ్రీ కలిగిన యువత నిరుద్యోగులుగా మిగిలిపోయారని నివేదికలు చెబుతున్నాయి. వికసిత భారత్ 2047 నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రధాన భూమిక దేశ యువత, వారి చదువు. నైపుణ్యాల ద్వారానే ఈ క్లిష్ట పరిస్థితులను అధిగమించవచ్చునని దీనికి ప్రభుత్వం వివిధ ప్రభుత్వ ప్రభుత్వేర, ఆయా రంగాలలో రాణించిన సంస్థల భాగస్వామ్యం తప్పనిసరి అనిని మేధావుల అభిప్రాయం. నైపుణ్యం కలిగిన యువత, సిబ్బంది కోసం ప్రపంచమంతా ఎదురు చూస్తోంది. మారుతున్న కాలంతో మెరుగైన విపణిలో పయనించడానికి ప్రస్తుత యువజనం ఉద్రుతలూగుతున్నప్పటికీ కృతిమమేథయే రాబోవు కాలానికి ప్రగతి సూచికయనే మీమాంసలోను, భయంలోనూ ఉండిపోతున్నారు. దేశానికే వెన్నెముక వలె నిలబడి యున్న యువతకు అనువైన, మానవ మేధస్సును మరింత పునరుజీవింపచేయడానికి ఉపకరించే తగిన నైపుణ్యాలను, శిక్షణలు అందించడానికి దోహదపడు సంస్థలను, వ్యవస్థను, కరికుల సంస్కరణలను త్వరిత గతిన ఏర్పరచకపోతే సమర్థవంతమైన శ్రామికశక్తిని సమకూర్చుకోవడం తక్షణ కరవ్యం. గోబల్ స్థాయిలో అవసరానికి కావలసిన సమర్థవంతమైన పనితనంతో నిండివున్న జన శాతం చాలా తక్కువగా కనిపిస్తోందని గోబల్ నివేదికలు వెలడిస్తున్నాయి. సి.ఐ.ఐ నివేదిక ప్రకారం 23 దేశాలలో సుమారు 83 మిలియన్ మంది నెపుణ్యం కలిగిన వ్యక్తుల కొరత ఉందని వెలడైంది. ఈ లోటు త్వరితగతిన నివృత్తి చేయగలిగితే 2028 సంవత్సరం నాటికి 11.5 ట్రిలియన్ డాలర్ల ఆదాయ వనరులను ప్రపంచ స్థూల దేశీయోత్పతికి అందించే సామర్థ్యాన్ని సంతరించుకోవచ్చని నివేదికఅంచనా వేసింది. అంతేకాక భారత్ లాంటి యువభరిత దేశానికి సంకేతాలను అందిస్తూనే వుంది. ఈ అవకాశాలు, ఆశించిన ఫలితాల దృష్ట్యా నైపుణ్యాల మెరుగుదలయనేది అతి అత్యవసరం. ప్రస్తుత తరుణంలో ఒక ప్రత్యామ్నాయం కాదు అనివార్యంగా గుర్తెరగాలి. దీనివల్ల కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడానికి పోటీని ఎదుర్కోవడానికి, వినూత్న ఆవిష్కరణలకు తెరతీయడానికి తద్వారా సుస్థిరాభివృద్ధి దిశగా



ప్రణాళికలు రచించుకోవడానికి మార్గం సుగమమవుతుంది. ఎందుకనగా యూరప్, జపాన్, సౌత్ కొరియా లాంటి దేశాలతో పోలిస్తే భారత దేశంలో యువత శాతం 35 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు సుమారు 65 శాతంగా చెప్పొచ్చు. అంటే దేశంలో యువత నూతన నైపుణ్యాలను అందిపుచ్చుకుంటే నైపుణ్యాలతో కూడిన అనుభవాత్మక విద్య మంచి సంభాషణా చాతుర్యం, సహకారం ప్రతిపాదికతో జట్టు కార్యక్రమాలు వంటి అంశాలను జోడించి వినూత్న విద్యా వ్యవస్థను ప్రోత్సహించాలి. నూతన విద్యా విధానం 2020 ఈ విషయాలకు వెసులుబాటు కల్పించినప్పటికీ ఆచరణలో, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల అధ్యాపకుల ఎంపికలో, మౌలిక వసతుల కల్పనలో, నిధుల కేటాయింపులో ప్రాధాన్యత లేకపోతే పోటీ ప్రపంచంలోయువత నెగ్గుకు రావడం కష్టతరమే. సాంప్రదాయ రీతి బోధనకు స్వస్తిపలికి కృత్యాధార, డిజిటల్ బోధన, పీర్ లెర్నింగ్, లైబ్రరీ వినియోగం, స్టెమ్ ఆధారిత అనుభవాత్మక విద్యను అందుబాటులో ఉంచడం తప్పనిసరి. ఈ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల పెంపుదలలో ప్రభుత్వాలు తగినన్ని నిధులను వెచ్చించి వారికీ వినూత్న బోధన విధానాలపై ప్రత్యేక శిక్షణలు, సేవ్ ది చిల్డ్రన్ (బాల్ రక్షా భారత్) వివిధ రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా సబ్జెక్టు ఉపాధ్యాయుల నైపుణ్యాలను పంచుకోవడానికి, పెంచుకోవడానికి, ప్రయోగాత్మక విద్యను బోధించడానికి ఏర్పరచిన పెడోగోజికల్ ఫోరంలు, స్టెమ్ ఆధారిత విద్య ప్రయోగ ఫలితాల ఆధారంగా ఏర్పరచిన ఉత్సాహవంతులైన సబ్జెక్టు ఆధారిత ఉపాధ్యాయుల పెడోగోజికల్ ఫోరమ్‌లను ఏర్పరచడం వారికి తగిన శిక్షణ, అదనపు కోర్సులను నేర్చుకొనే వెసులుబాటు కల్పించడం, క్షేత్ర స్థాయి. అవగాహన ద్వారా తద్వారా ఉపాధ్యాయులకు వృత్తిపరమైన నైపుణ్యాలను అందించి సంసిద్ధపరచడం తప్పనిసరి. మరొక కోణంలోపునాది నుండి నైపుణ్యాలకు తగిన కరికులం, అమలుకు కార్యాచరణ సరిపడినంత వసతుల, అధ్యాపకుల నియామకం, వారికి నిరంతర శిక్షణా తరగతులతో నైపుణ్యాల మెరుగుదల నిరంతర మూల్యాంకనం, పునఃశిక్షణ వంటి కార్యక్రమాలతో యువతకు జవసత్వాలు నింపే, గౌరవప్రదమైన ఉపాధి దొరికే అవకాశాలకు శీకారం చుట్టాలి. అంతేకాదు అందుబాటులో వున్న అవకాశాల గురించి పూర్తి సమాచారాన్ని అందించడానికి తగిన ఏర్పాట్లు చైతన్య కార్యక్రమాలతో యువతను మేల్కొల్పడం, కౌన్సిలింగ్ వంటి ప్రక్రియలతో మార్గదర్శకత్వాన్ని కూడా అందించడం ప్రభుత్వ ప్రధాన భూమికగా గుర్తించాలి. అందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రణాళికలు రచించి యువత భవితకు భరోసా కల్పించాలి. ఈ అంశాలనే పరిగణనలోకి తీసుకొని ఈమధ్యకాలంలో వికసిత్ భారత్ ప్రవేశపెట్టిన అధిష్టాన్ బిల్లు 2025ప్రకారం ఉన్నత విద్యలో కొన్ని సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు, యూనివర్సిటీలు, టెక్నికల్ సంస్థలు, ఓపెన్ లేదా దూరవిద్యనందించే విశ్వ విద్యాలయాలు ఒకే గొడుగు క్రిందకుతెచ్చి వికసిత భారత్ అధిష్టాన్ పేరుతో వివిధవిద్యా కౌన్సిళ్లను ఒకే లక్ష్యంతో పనిచేసేలా ప్రతిపాదించింది. ఆయా విద్యా సంస్థలు స్వయంప్రతిపత్తితో వివిధ విభిన్న అంశాలను క్రోడీకరించి యువతకు ఉపకరించుకోర్సులను రూపొందించి అమలు చేయడం, పరిశోధనలకు పెద్ద పీట వేయడం, ప్రపంచంలో స్థానికంగా ఉన్న అత్యుత్తమ నమూనాలను ప్రదర్శించి తద్వారా గ్లోబల్, లోకల్ అనే వ్యత్యాసం లేకుండా అర్హులైన అందరికీ అనువైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్గించేలా ప్రణాళిక రచించింది. ఇది ఫలిస్తే భారత దేశం అన్ని రంగాలలోను రాణించి స్వయం సమృద్ధి దిశగా పయనించవచ్చు. •

# నదుల ఒడ్డునే వర్ధిల్లుతున్న దేశ రాజధానులు

అన్నవరపు బ్రహ్మయ్య

ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల రాజధానులు నదుల ఒడ్డునే కొనసాగుతున్నాయి. బ్రిటన్ రాజధాని లండన్ నగరం థేమ్స్ నది ఒడ్డున, అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి. పొటమ్యాక్ నది ఒడ్డున, ఆస్ట్రేలియా రాజధాని నగరం డార్లింగ్ నది ఒడ్డున, బ్యాంకాక్ రాజధాని థాయ్‌లాండ్ దావో ఫరయా అనే నది ఒడ్డున, ఇరాక్ రాజధాని బాగ్దాద్ నగరం టిగ్రీస్ నదిఒడ్డున వున్నాయి. అంతెందుకు మనదేశ రాజధాని న్యూఢిల్లీ యుమునా నది ఒడ్డున, హైదరాబాద్ నగరం మూసీ నది ఒడ్డున వున్నాయి. ఒక చారిత్రికంగా చూస్తే నైలు నది నాగరికత, సింధూనది నాగరికత, అమెజాన్ నది ప్రవాహ ప్రాంతాలలో వర్ధిల్లిన నాగరికతలుఎంత ఉన్నతమైనవో చెప్పనవసరం లేదు. నిజం చెప్పాలంటేఅమరావతిలో ప్రస్తుతం సెక్రటేరియట్, హైకోర్టు భవనాలు కృష్ణా నదికి దాదాపు 8 నుంచి 10 కి.మీ. దూరంలో వున్నాయి. నదీగర్భం, నది ఒడ్డు. నదీ పరివాహక ప్రాంతం అనడానికి కూడా వీలులేదు. ఇంకా చెప్పాలంటే సెక్రటేరియట్ నిర్మిస్తున్న ప్రాంతంలో 20గ్రామాలలో ప్రజలు కొన్ని వందల సంవత్సరాలు జీవిస్తున్నారు. అసలు కాశీ నగరం గంగా నది ఒడ్డున, విజయవాడ నగరం కృష్ణానది ఒడ్డున, రాజమండ్రి గోదావరి నది ఒడ్డున వుంది. అసలు భారతదేశంలో గంగా, కృష్ణా, గోదావరి, పెన్నా వంటి నదుల పరివాహక ప్రాంతాలలో వేల గ్రామాలలో ప్రజలు జీవిస్తున్నారు. ఈస్థితిలో రాజధాని అమరావతిపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీ అధ్యక్షులుజగన్మోహన రెడ్డి 'నదీ గర్భంలో రాజధాని' అంటూ చేసిన వ్యాఖ్యాలు ఆయన అజ్ఞానాన్ని తెలియచేస్తోందా? లేక తాము బీడుపెట్టాలని భావించిన అమరావతి ప్రాంతం రోజుకో తీరుగా వృద్ధి చెందడాన్ని చూపి ఓర్వలేక చిత్తచాపల్యంతో వ్యవహరిస్తున్నట్టుగా వుంది. అయితే రాజధాని అమరావతికి జగన్మోహనరెడ్డి వ్యతిరేకం కాదంటూ ఆ పార్టీ నాయకులు ప్రజలను అమాయకులనుకొని తప్పును కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేయడం వింతగా వుంది. జగన్ రాజధానిగా అమరావతి పనికి రాదంటూ స్పష్టంగా ప్రకటించిన తర్వాత కూడా ప్రజల చెవిలో పూలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ స్థితిలో అసలు నదీ పరివాహక ప్రాంతం, నది ఒడ్డు, నది గర్భం అనే పదాలకు జగన్మోహనరెడ్డికి అవగాహన వుందో లేదో.. అర్థం కావడం లేదు. ఒకవేళ అవగాహవున్నా ప్రజలు తాను ఏదీమాట్లాడితే అదే నిజమనుకొంటారనే భావనతో వున్నారో అర్థం కావడం లేదు. ఒకవైపు జగన్మోహన్ రెడ్డి నదీ గర్భంలో నిర్మాణాలు చేయడం నిబంధనలకు విరుద్ధం, ఈ విషయంలలో సుప్రీమ్ కోర్టు కల్పించుకోవాలని, ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అక్కడే రాజధాని, అయినా రాజ్యాంగలో రాజధాని ప్రస్తావనే లేదంటూ ఆయన స్పష్టంగా చెప్పారు. అయితే జగన్ వ్యాఖ్యలతో వైఎస్ఆర్ కాంగ్రెస్పట్ల ప్రజలలో పెల్లుబికిన వ్యతిరేకత గుర్తించిన ఆ పార్టీ సర్వశాఖల మంత్రిగా చెలామణి అయిన నేత తాజాగా సమర్థించడం నూతన సంవత్సరం జోక్గాఅనిపిస్తోంది. రాష్ట్రవిభజన అనంతరం నూతన రాష్ట్రంలో తొలిగా 2014లో జరిగిన అసెంబ్లీ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అమరావతిలో రాజధానికి అంగీకరిస్తున్నామని, రాజధాని నిర్మాణానికి కనీసం 30 వేల ఎకరాలు కావాలని జగన్ స్వయంగా ప్రకటించారు. అంతేకాకుండా 2019లో జరిగిన ఎన్నికలకు ముందు కొందరు నేతలుతమ నాయకుడు జగన్మోహనరెడ్డి రాజధాని పరిధిలోనే ఇల్లు కట్టుకొన్నారని, తాము అధికారంలోకి వస్తే రాజధానికి భూములిచ్చిన రైతులకు మరింత మేలైన సదుపాయాలిస్తామని ప్రచారం చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాతఏడాది కూడా గడవకుండానే మూడు రాజధానులంటూ అసెంబ్లీలో తీర్మానం చేయడం, అమరావతి ఉసురు తీయడానికి చేసిన ప్రయత్నం, దాదాపు నాలుగేళ్లపాటు రాజధాని ప్రాంత రైతులుచేసిన ఉద్యమాలను తెలివిగా మరచిపోయినట్టుగాప్రవర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన భోగాపురం విమానాశ్రయానికి తానే శంకుస్థాపన చేశానని, విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ తన వల్లనే వచ్చిందని జగన్మోహనరెడ్డి చెప్పు కొంటున్న ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడంలేదు. తాజాగా వెలిగొండప్రాజెక్ట్ చంద్రబాబు నాయుడు కారణంగానే నిర్మాణంఆగిపోయిందని చెప్పిన కొన్ని గంటలలోనే తెలంగాణకు చెందిన బిఆర్ఎస్ నేత, మాజీమంత్రి మాట్లాడు తూ జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా వుండగా తామే కోర్టుకు వెళ్లి స్టేతీసుకు వచ్చామని ప్రకటించారు. దాంతో జగన్ అబద్ధాలు చెబుతున్నారనిసామాన్యులకు కూడా అర్థం అవుతోంది. అంతేకాకుండా కలియుగ వైకుంఠంగా భావించే తిరుమలేశుని లడ్డుప్రసాదంలోకృత్రిమ నెయ్యి వాడటం, పరకామణిలో చోరికి పాల్పడిన ఉద్యోగికి మద్దతు తెలియచేయడం వంటి కారణాలవల్ల తటస్థంగా వున్న హిందువులు వైఎస్ఆర్సీపికి దూరమయ్యారు, ఈ స్థితిలో పార్టీ బతికిబట్ట కట్టే అవకాశంలేదని భావిస్తున్నారు. ఇది చాలదన్నట్టుగా ప్రజారాజధాని అమరావతిపై మళ్లీవిషం కక్కడంతో ఓడిపోయిన దగ్గరనుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలు అధికారుల ను బెదిరించడమే విధానంగా పెట్టుకొన్నట్టు కనిపిస్తోంది. ఇదేసమయంలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలలో ప్రజావ్యతిరేకమైన నిర్ణయాలు వుంటే వాటిని అసెంబ్లీలో ప్రవేశపెట్టి రద్దుచేసే అధికారం సహజంగానే వుంటుంది. కానీ తాము అధికారంలోకి వస్తే అనుమతులు అన్ని రద్దుచేస్తామంటూ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చేవారిని కూడా బెదిరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. •

# సినిమా టిక్కెట్ ధరలు క్షేత్రస్థాయిలో దోపిడీలా?

దిడ్డి శ్రీకాంత్

సినిమా అంటే తెలుగు వారికి ఒక ఎమోషన్. ఆ ఎమోషన్‌ను క్యాష్ చేసుకునే క్రమంలో టిక్కెట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సినిమా ఇప్పుడు కేవలం వినోదం మాత్రమే కాదు, అదొక ఖరీదైన వ్యసనంగా మారిపోయింది. ఒకప్పుడు సామాన్యుడికి అతి తక్కువ ఖర్చుతో దొరికే ఏకైక ఉపశమనం సినిమా. కానీ నేడు, థియేటర్ గడప తొక్కాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో సినిమా టిక్కెట్ల ధరల పెంపు, ప్రభుత్వ జీవోలు (బిప్పీ), పైరసీ వెబ్‌సైట్ల పట్ల ప్రజల మొగ్గు వంటి అంశాలు సమాజంలో ఒక లోతైన చర్చకు దారితీస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగ అంటేనే థియేటర్ల వద్ద సందడి, స్టార్ హీరోల భారీ బడ్జెట్ సినిమాల జాతర అయితే ఈ ఏడాది వినోదం సామాన్యుడికి మరింత భారం అయింది. తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా తెలంగాణలో ఈ సమస్య తీవ్రరూపం దాల్చింది. గతంలో సినిమా టిక్కెట్ల ధరల పెంపును, బెనిఫిట్ షోలను అడ్డుకుంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై ఇటీవల డివిజన్ బెంచ్ స్టే విధించింది. ప్రభుత్వాలు కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సంక్రాంతి బరిలో ఉన్న భారీ చిత్రాల నిర్మాతలు టిక్కెట్ రేట్లు పెంచుకోవడానికి, స్పెషల్ షోలు వేసుకోవడానికి మార్గం సుగమమైంది. ఒక నలుగురు సభ్యులున్న మధ్య తరగతి కుటుంబం సినిమాకు వెళ్లాలంటే, టిక్కెట్ల కోసం కనీసం రెండు వేల రూపాయలు, మరి కొంత స్నాక్స్, పార్కింగ్ కోసం ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇంత మొత్తం ఖర్చును ఒక పూట వినోదం కోసం నెలవారీ బడ్జెట్‌లో కోత పెట్టాల్సి వస్తోంది. ఇది వారిపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపుతోంది. ఈ అధిక ధరల కారణంగా, చాలా కుటుంబాలు థియేటర్లకు వెళ్లడం మానేసి, పైరసీ సైట్లకు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు లేదా టీవీలకు పరిమితమవుతున్నాయి. ఓటీటీలు పైరసీ వైపు ప్రేక్షకులు మొగ్గు చూపడం వల్ల దీర్ఘకాలంలో చిత్ర పరిశ్రమకే నష్టం! ఈ బెనిఫిట్ షోల నిర్వహణ, టిక్కెట్ల ధరల వివాదానికి ఏడాది క్రితం హైదరాబాద్‌లోని ప్రముఖ థియేటర్‌వద్ద జరిగిన తొక్కిసలా ఘటన నిదర్శనంగా నిలిచింది. విడుదల సందర్భంగా నెలకొన్న పరిస్థితి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా ఉండే ధరలకు భిన్నంగా, అభిమానుల ఆనందాన్ని, హైప్‌ని సొమ్ము చేసుకునేలా టిక్కెట్ల ధరలను ఇష్టానుసారంగాపెంచేశారు. అభిమానుల అతి ఉత్సాహం, ఆనందం ఒకవైపు ఉంటే.. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని థియేటర్ యాజమాన్యాలు, డిస్ట్రిబ్యూటర్లు చేస్తున్న వ్యాపారంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఇష్టానుసారం ప్రదర్శించిన బెనిఫిట్



షో, స్టార్ల హైప్, అభిమానుల వెర్రి ఆనందం విపరీత పరిణామాల కారణంగా జరిగిన సినిమా తొక్కిసలాట ఘటనలో ఓ మహిళా అక్కడికక్కడే మృతి చెందగా, ఆవిడ కుమారుడు తీవ్ర అస్వస్థతతో ప్రాణాల నుండి బయటపడ్డాడు. ఈ సమస్య కేవలం సినిమా పరిశ్రమకే పరిమితం కాలేదు. దీని తీవ్రత ప్రభుత్వాన్ని కూడా కదిలించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ఈ అంశంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం తమ ప్రయోజనాల కోసం సినిమా టిక్కెట్ల రేట్లు పెంచి ప్రేక్షకులను దోచుకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ముఖ్యంగా టిక్కెట్ల పెంపు, బెనిఫిట్ షోల పేరిట జరుగుతున్న దోపిడీపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పిన మాటలు ఒక ఆశాజనక మార్పుగా కనిపించాయి. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఇంకా అలాగే ఉంది. ప్రభుత్వం గతంలో రేట్లు పెంచవద్దని అసెంబ్లీ సాక్షిగా హెచ్చరించినా, తాజాగా సినిమాలకు ఇచ్చిన ధరల పెంపు ఉత్తర్వులు ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనం! ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతులు పొంది రేట్లు పెంచుతున్న క్రమంలో, అది కేవలం బడా నిర్మాతలకే లాభం చేకూరుస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సగటు అభిమానిపైరసీ వైపు మొగ్గు చూపుతున్నారు. థియేటర్లలో టిక్కెట్ రేట్లు భరించలేనంతగా పెరగడం వల్లే సామాన్యులు ఉచితంగా సినిమాలు అందించే పైరసీ సైట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల ఉచితంగా సినిమాలు అందించే అడ్మినిస్ట్రేటర్ అరెస్ట్ అయినప్పుడు, సోషల్ మీడియాలో నెటిజన్లు అతనికి మద్దతు తెలపడం చర్చనీయాంశమైంది. 'వందల రూపాయల టిక్కెట్ కొనలేని మాకు ఉచిత వినోదం అందించిన వాడు నేరస్తుడా?' అనే ప్రశ్నే అక్కడ వినిపించింది. ఇది వ్యవస్థ వైఫల్యానికి ఒక సంకేతం. చట్టపరంగా పైరసీ తప్పు అయినప్పటికీ, అధిక ధరలు సామాన్యుడిని ఆ వైపు నెడుతున్నాయనేది నగ్న సత్యం. ఇది ఒక రకంగా సినిమా పరిశ్రమకు ప్రభుత్వాలకు చెంపపెట్టు. ప్రేక్షకుడు పైరసీని ప్రేమిస్తున్నాడంటే, దానర్థం సినిమా పరిశ్రమ సామాన్యుడికి దూరం అవుతోందనే కదా?! సినిమా బెనిఫిట్ షోలు, టిక్కెట్ల ధరల సమస్యకు తక్షణమే ఒక శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉంది. పెద్ద సినిమాలు వచ్చినప్పుడు ప్రభుత్వం జీవోలు ఇచ్చి రేట్లు పెంచడానికి సహకరించడం కాకుండా, కనీస ధరలను నియంత్రించాల్సిన బాధ్యత తీసుకోవాలి. అదే సమయంలో, సినిమా పరిశ్రమ కూడా సామాన్య ప్రేక్షకుడి జేబుకు చిల్లు పడకుండా, అందరికీ అందుబాటులో ఉండేలా టిక్కెట్ల ధరలను నిర్ణయించాలి. అప్పుడే సినిమా పరిశ్రమ మనుగడ సాగుతుంది, ప్రేక్షకుల ఆదరణ నిలబడుతుంది. కేవలం 'స్టార్‌డమ్' పేరుతో థియేటర్లలో దోపిడీ కొనసాగితే, భవిష్యత్తులో థియేటర్లు ఖాళీగా ఉండి, ప్రజలు పైరసీ వెబ్ సైట్ల వైపే చూస్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పరిశ్రమ కలిసి కూర్చుని, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుని, ఈ టిక్కెట్ల ధరల చిచ్చుకు శాశ్వత తెరదించాలి. •

# ప్రజావాక్కు



### ఇతర దేశాల జోక్యమెందుకు?

**ఇరాన్‌లో** కొన్ని సామాజిక సమస్యల మీద అంతర్యుద్ధం కొన్ని ఏళ్ళుగా జరుగుతున్నాఅదిఆదేశానికి సంబంధించిన విషయం. ఇతరదేశాల జోక్యం ఎంతవరకంటే శాంతి పునరుద్ధరణ చేయుమని సలహాయివ్వడం వరకే. ఇంకా ఇతర కారణాలు చెప్పి ఇరాన్‌మీద అమెరికా కాలుదువ్వుతోంది. అక్కడ పరిపాలకుల నిరకుశత్వానికి విసిగి వేసారి బహిరంగ ప్రదేశానికి వచ్చి నిరసన తెలుపుతున్న వందలాది మందినిసైనికులు తుపాకి బుల్లెట్లకు బలియివ్వడం ఘోరమైన నేరం. అమెరికాతో యుద్ధానికైనాచర్చలకైనా సిద్ధమని ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. నోబెల్ శాంతి బహుమతి కోసం తపించిపోతున్న ట్రంప్ రానురాను యుద్ధోన్మాదిగా రూపాంతరం చెందుతున్నారనిపిస్తోంది.

- ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

### చర్యలు చేపట్టాలి

**ఇటీవల** తాజాగా సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజల ప్రయాణాలు విపరీతంగా పెరిగిన కారణంగా, స్లీపర్ రిజర్వేషన్ దొరకని వారు ఆర్డినరీ బోగీలలో పూర్తిగా పెట్టే నిండి ఏమాత్రంకదిలే చోటులేని పరిస్థితి ఎదుర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే 12 జనసాధారణ అన్రెసర్వ్ రైళ్ళను విజయవాడ నుండి విశాఖకు నడిపారు. ఇది చాలా మంచిది. తాత్కాలికంగా పెట్టిన వీటిలో కొన్ని కొనసాగితే పాసింజర్ రైళ్లతో పాటు సాధారణ ప్రయాణీకులు తక్కువ ఖర్చుతో వారి గమ్యం చేరుకోవడానికి అదనపు అవకాశం దొరుకుతుంది. రైల్వే ఉన్నతాధికారులు వారి పరిధిలో చర్యలు చేపడితే సాధ్యం కావొచ్చు.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### స్టార్టప్ వ్యవస్థకు కొత్త దిశ

**ప్రభుత్వ** ప్రధానపారిశ్రామికోత్పత్తి ప్రోత్సాహక కార్యక్రమం పదేళ్ల మైలురాయిని చేరుకున్న ఈ సమయంలో, భారతదేశంలోని నూతన వ్యాపార వ్యవస్థను తిరిగి పరిశీలించాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. 2016లో కొన్నివందల నూతనసంస్థలతోమొదలైన ఈ ప్రయాణం, నేడు లక్షల సంఖ్యలో నూతన వ్యాపార యత్నాలకు విస్తరించింది. ఈవ్యవస్థ కోట్లాదిఉపాధి అవకాశాలను సృష్టించి, ప్రపంచంలో అగ్రగణ్య స్థానాన్ని సంపాదించింది. ఈ విజయంతోనే తృప్తిపడడం భవిష్యత్తుకు హానికరం.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### చలాన్.. ఖాతా ఖాళీ!

**ట్రాఫిక్** నియంత్రణ, రోడ్డు భద్రత అంశాలు చర్చకు వస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన ట్రాఫిక్ చలాన్ల ఆటోడెబిట్ విధానం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వెంటనే వాహన యజమాని బ్యాంకుఖాతా నుంచి జరిమానా స్వయంచాలకంగా డెబిట్ చేయాలన్నది ఈ ఆలోచన సారాంశం. ఈ విధానానికి మద్దతు ఇచ్చేవారు, ప్రస్తుతం చలాన్లు పడినా వాటిని పట్టించుకోని పరిస్థితి ఉందని, రాయితీలు-డిస్కౌంట్ల వల్ల నిబంధనలకు విలువ తగ్గిందని అంటున్నారు. ఆటో డెబిట్ అమలైతే ఉల్లంఘనలు తగ్గుతాయనీ, ట్రాఫిక్ క్రమశిక్షణ పెరుగుతుందనీ వారు భావిస్తున్నారు. సాంకేతికత ఆధారంగాపాలనను కఠినంగా చేయాలన్న ప్రభుత్వ ఉద్దేశంలో ఇది భాగమేనని కూడా చెబుతున్నారు. అయితే ఈ ప్రతిపాదనపై అభ్యంతరాలు కూడా లేకపోలేదు. ప్రజల అనుమతి లేకుండా బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు తీసుకోవడం సరైనదేనా?

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### సామాజిక రుగ్మతలను అరికట్టాలి

**జంతు** హింస నిరోధక చట్టం 1960, ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974 అమలులో ఉన్నప్పటి కోళ్ల కాళ్లకు పదునైన కత్తులు కట్టి సంక్రాంతి పండుగ దినాల్లో లక్షల్లో ఆ మాటకొస్తే కోట్లలో పందేలు కట్టి కోడి పందేలు ఆడటం కొన్ని దశాబ్దాలగా ముఖ్యంగా ఆంధ్రాజిల్లాలలో జరుగుతూ ఉంటాయి. ఈ జాడ్యం మొదట భీమవరంలో ప్రారంభమై దాదాపు అన్ని జిల్లాలకు వ్యాపించింది. ఇతర దక్షిణాది రాష్ట్రాలవారు కూడా ఆంధ్ర జిల్లాలకు చేరి ఈ క్రూరఆటలో పాల్గొంటారు. రాజకీయ నాయకులు పాల్గొనే ఈ ఆటలను పోలీసుల బందోబస్తుతో జరుగుతుండడం విశేషం. చట్టాలు మార్చినా అనేక సామాజిక రుగ్మతలను అరికట్టలేకపోవడం మిక్కిలి విచారకరం.

- డా.ఎన్.ఎస్.ఆర్.మూర్తి, సికింద్రాబాద్

### నూతన విద్యావిధానం అవసరం

**ప్రధాన** మంత్రి నరేంద్రమోడీమెకాలే విద్యా విధానాన్ని 2035 నాటికి భారతదేశం నుండి పూర్తిగా తొలగించాల నే సంకల్పం వ్యక్తం చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అని చెప్పవచ్చు. ఇదిభారతఆత్మగౌరవాన్నిపునరుద్ధరించేసాహసోపేతప్రయత్నం. ఇప్పటి ప్రపంచం టెక్నాలజీ ఆధారంగా వేగంగా మారిపోతోంది. అందువలన ప్రపంచధోరణికి అనుగుణంగా మన విద్యా విధానాన్ని మలచడం అవసరం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి

**ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ ఇక గద్దె దిగవలసిందే : ట్రంప్



**వాషింగ్టన్, జనవరి 18:** ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా ఇరాన్ ప్రజలపై దాడులు జరుగుతున్నాయన్నారు. అక్కడ కొనసాగుతోన్న హింసకు ఖమేనీనే కారణమని ఆరోపించారు. నాయకుడి స్థానంలో ఉన్న ఖమేనీ వేలాది మంది ప్రజలను చంపుతూ.. తన దేశాన్ని తనే నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు ఆయనకు నాయకత్వం కట్టబెట్టింది ఇటువంటి భయాలు, మరణాలు సృష్టించడానికి కాదని అన్నారు. ఇంతమంది ప్రాణాలు తీసిన సుప్రీం లీడర్ ఇరాన్‌ను పాలించడానికి అనర్హుడని పేర్కొన్నారు. ఇక ఆయన అధికారం నుంచి దిగిపోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇరాన్‌కు కొత్త నాయకుడిని ఎన్నుకోవాలని ఆ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇరాన్‌లో నెలకొన్న ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడే కారణమని ఖమేనీ ఆరోపించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. శనివారం ఖమేనీ మాట్లాడుతూ.. దేశంలో నిరసనలకు మద్దతిచ్చిన ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్నారు. నిరసనల్లో పాల్గొన్న వారు అమెరికా కోసం పనిచేసిన వారేనని తెలిపారు. ఇరాన్‌ను అణచివేయడం, ఆధిపత్యం చలాయించడమే లక్ష్యంగా ఈ కుట్ర పన్నుతున్నారని దుయ్యబట్టారు.

**ఆందోళనలు కొనసాగించండి : యువరాజు రెజా పహ్లావి**

ఇరాన్‌లో కొనసాగుతోన్న నిరసనలు మరింత తీవ్రం చేయాలని ప్రవాసంలో తలదాచుకున్న ఆ దేశ యువరాజు రెజా పహ్లావి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలంతా వీధుల్లోకి వచ్చి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయాలన్నారు. ఇరాన్ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అండగా ఉంటారని పేర్కొన్నారు. మరోవైపు ఆ దేశంలో కొనసాగుతోన్న హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు 3 వేలకుపైగా నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి.

# మహారాష్ట్రలో క్యాంపు రాజకీయాలు షురూ!

## కార్పొరేటర్లు అందరినీ హోటల్‌కు తరలించిన షిండేసేన



**ముంబై, జనవరి 17:** బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ముగిసి ఫలితాలు ఇలా వెలువడ్డాయో లేదో అలా ఫైవ్‌స్టార్ హోటల్ రాజకీయాలు మొదలయ్యాయి. కూటమిగా పోటీ చేసినా వెన్నుపోటు పొడుస్తారన్న భయం ఏర్పడటంతో దేశంలోనే అతి పెద్ద కార్పొరేషన్‌పై నాయకత్వ ఆధిపత్యం కోసం ప్రయత్నాలు పారంభమయ్యాయి. కొత్తగా ఎన్నికైన తమ పార్టీ కార్పొరేటర్లందరూ బాంద్రాలోని ఫైవ్‌స్టార్ హోటల్‌కు రావాలని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, శివసేన చీఫ్ ఏక్‌నాథ్ షిండే ఆదేశించారు. ఇతర పార్టీల వారు తమ కార్పొరేటర్లతో బేరసారాలు జరపకుండా, ప్రలోభాలకు గురి చేయకుండా వారందరినీ తన వద్ద ఉంచుకునేందుకు షిండే ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఎన్నికల్లో బిజెపి, శివసేన కలిసి మహాయుతి కూటమిగా పోటీ చేశాయి. అయితే కూటమిలో బిజెపి తర్వాత 29 సీట్లతో శివసేన అతిపెద్ద పార్టీగా నిలిచింది. తమ పార్టీ సహకారం లేకుండా బీఎంసీ మేయర్ స్థానం దక్కించుకునే అవకాశంబిజెపికి లేకపోవడంతో, ఆపార్టీ సహా ఇతర పార్టీల వారు ఎలాంటి అవకాశం తీసుకోకుండా ఆయన తన పార్టీ కార్పొరేటర్లందరినీ ఐక్యంగా ఉంచాలని ఫైవ్‌స్టార్ హోటల్‌కు వారిని తరలించారు. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి పాగా వేసింది. ముంబైలో మూడు దశాబ్దాల శివసేన ఆధిపత్యానికి గండిపడింది. రాష్ట్రంలోని 29 కార్పొరేషన్లలో 25 చోట్ల బిజెపి గెలుపొందింది. ఈ ఎన్నికల్లో ఎన్సీపీ కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. అజిత్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ, శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ) తొలిసారి ఈ ఎన్నికల్లో కలిసి పోటీచేశారు. సంప్రదాయంగా తమకు పట్టున్న ప్రాంతంలో కూడా వీరు ఈ ఎన్నికల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోలేకపోయారు. 24 మున్సిపాలిటీలలో ఎన్సీపీ (ఎస్పీ) కనీసం ఖాతా కూడా తెరవలేక పోయింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైనా స్వల్ప ఊరట లభించింది. రాష్ట్రంలోని నాలుగు మున్సిపాలిటీలలో ఏకైక అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించగా, ఐదు కార్పొరేషన్లలో రెండో అతిపెద్ద పార్టీగా నిలిచింది. మహారాష్ట్ర అంతటా మజ్లిస్ పార్టీకి 125 స్థానాలు లభించాయి. మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు జైలులోనుంచి గెలుపొందారు.

వీరు పుణె, షోలాపూర్, జల్గావ్, జాల్నా మున్సిపాలిటీల్లో పోటీచేశారు. గెలుపొందిన నేరచరితుల్లో గ్యాంగ్‌స్టర్ల బంధువులు, గౌరీలంకేశ్ హత్య కేసులో నిందితుడు కూడా ఉన్నారు. గ్యాంగ్‌స్టర్ సూర్యకాంత్ అలియాస్ బండు అందేకర్ కోడలు సోనాలి, మరదలు లక్ష్మి పుణె కార్పొరేషన్‌కు ఎన్నికయ్యారు. వీరిద్దరూ తమ మనవడి హత్య కేసులో జైలులో ఉన్నారు. జర్నలిస్ట్ గౌరీలంకేశ్ హత్య కేసులో నిందితుడు శ్రీకాంత్ పంగార్కర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.



# 23న తమిళనాడులో ప్రధాని పర్యటన

**- మదురాంతకం నుంచి ఎన్నికల శంఖారావం పూరించనున్న మోడీ**

**చెన్నై, జనవరి 18:** రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ జనవరి 23న మదురాంతకం నుంచి ప్రారంభించనున్నారు. ఈ సారి ఎలాగైనా తమిళనాడులో పాగా వేయాలని బిజెపి తహతహలాడుతోంది. అందులో భాగంగా ఇప్పటికే పలుమార్లు తమిళనాడులో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటించారు. అంతేగాక, ప్రతిపక్ష ఎఐఎడిఎంకెతో కలిసి ఎన్‌డిఎ కూటమిని ఏర్పాటు చేసింది. మరోవైపు సినీనటుడు విజయ్ నేతృత్వంలోని టివికెని కూడా ఎన్‌డిఎ కూటమిలోకి ఆహ్వానిస్తోంది. ఈ విషయమై పలుమార్లు ఆ పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహించింది. అయితే, ఇంకా ఓ కొలిక్కిరాలేదు. ఇదిలా ఉండగా తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ప్రారంభించాలని బిజెపి నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఈ నెల 23న మదురాంతకంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. ఈ సభకు ఎన్‌డిఎ మిత్రపక్షాల నేతలను ఆహ్వానించింది.

# నాటో నుంచి అమెరికా బయటకు!

## గ్రీన్‌లాండ్‌పై అంగీకరించకపోతే ఇదే పరిస్థితి

**వాషింగ్టన్, జనవరి 18:** నాటో నుంచి అమెరికా బయటకు వచ్చే అవకాశం ఉందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడానికి నాటో మిత్ర దేశాలు మద్దతివ్వకపోతే, ఈ పరిణామం జరుగుతుందని బెదరించారు. గ్రీన్‌లాండ్‌పై నాటో తమతో చర్చలు జరుపుతున్నదని, దేశ భద్రత కోసం గ్రీన్‌లాండ్ తమకు చాలా అవసరమని చెప్పారు. అది తమ ఆధీనంలో లేకపోతే, దేశ భద్రత, ముఖ్యంగా గోల్డెన్ డోమ్ విషయంలో, పెద్ద లోపం ఏర్పడుతుందని తెలిపారు. ఈ విషయంలో తనకు మద్దతివ్వని దేశాలపై టారిఫ్‌లు విధిస్తానని ఇటీవల హెచ్చరించారు.

**గ్రీన్‌లాండ్‌పై మద్దతివ్వనందుకు 10 శాతం సుంకాలు : ట్రంప్**

గ్రీన్‌లాండ్‌ను తమకు అప్పగించడంలో సహకరించనందుకు డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, నెదర్లాండ్స్, ఫిన్లాండ్ వంటి యూరోపియన్ దేశాలపై 10 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం ప్రకటించారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ పెంపు అమలులోకి వస్తుందని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. గ్రీన్‌లాండ్‌పై ఎటువంటి ఒప్పందం కుదరకపోతే ఈ యేడాది జూన్ 1 నుంచి ఈ సుంకాలను 25 శాతానికి పెంచుతానని ఆయన హెచ్చరించారు. గ్రీన్‌లాండ్‌పై అమెరికా నియంత్రణ కోసం తాను చేస్తున్న ప్రయత్నానికి మద్దతు ఇవ్వని దేశాలపై సుంకాలు విధిస్తానని హెచ్చరించిన మరుసటి రోజే తన మిత్రులైన యూరోపియన్ దేశాలపై ట్రంప్ సుంకాల మోత మోగించారు.

# సామాజిక రుగ్మతగా మారిన కులవ్యవస్థ అంతం కావాలి

## ముందు మన మనసులు సంస్కరించుకోవాలి: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భగవత్

**ముంబయి,జనవరి 18:** సమాజంలో పాతుకుపోయిన కులవివక్ష వ్యవస్థను ప్రక్షాళన చేయాలని, భారతీయులు ముందు తమ మనస్సుల్లోంచి కులభావాన్ని నిర్మూలించాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ కోరారు. అవిరళ కృషిచేస్తే పది పన్నెండేళ్లలో ఈ వ్యవస్థకు ముగింపు లభిస్తుందని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది జనసంగోష్టి సందర్భంగా ఆర్ఎస్ఎస్‌చీఫ్ కీలక ఉపన్యాసం ఇచ్చారు. సమావేశంలో ప్రాంత్ సంఘ్‌చాలక్ అనిల్‌భలేరావు కూడా పాల్గొన్నారు. కులవ్యవస్థ పరిణామాలు, సంఘ సామాజికదృక్పధాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. వృత్తులనుంచి వర్గాలవైపుగా మారుతోందని, కుల మూలాలనను వృత్తిపరంగా మాత్రమే గుర్తించారని, తర్వాత రానురాను సామాజిక విభజనలుగా మారిపోయి పక్షపాతాన్ని పెంచుతున్నదని ఆందోళన వ్యక్తంచేసారు. ఈ వివక్ష అంతానికి మనస్సులనుంచి ముందు కులాన్ని పారద్రోలాలని ఆయన పిలుపునిచ్చారు. ఆచారాలపై మానసిక నిర్మూలన అవసరాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్ఎస్ఎస్ లక్ష్యం పోటీ కాదని, వ్యక్తిత్వంద్వారా జాతినిర్మాణమని మోహనభగవత్ పేర్కొన్నారు. సామాజిక బలంకోసం వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడంతో దేశ కీర్తిని మరింత ఇనుమడింపచేయడమే



ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. ధర్మం అనేది ప్రతిజీవిలోను విస్తరించి ఉందని, లౌకిక రాజ్యాలు ఉన్నప్పటికీ ఏ మానవుడు కూడా సృష్టిధర్మంనుంచి తప్పించుకోలేడని, పూర్వీకుల వారసత్వం ప్రపంచ నాయకత్వం నిర్ధారిస్తుందని కూడా ఆయన చెప్పారు. ధర్మం భారత దేశాన్ని నడిపించినంతకాలం విశ్వగురు హోదా నిలిచి ఉంటుందని, ఈ విశ్వక్రమాన్ని కొనసాగించేందుకు ఇదే ఒక కీలక మలుపు వంటిదని ఆయన హిందూ మతంగురించి ప్రస్తావించారు.

# గాజా బోర్డ్ ఆఫ్‌పీస్ సభ్యత్వానికి రూ.9087కోట్ల ఫీజు!

**వాషింగ్టన్, జనవరి 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసిన గాజా బోర్డ్ ఆఫ్ పీస్‌లో సభ్యత్వం పొందాలంటే దేశాలు 1 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ. 9,087 కోట్లు) చెల్లించాల్సి ఉంటుందంటూ వచ్చిన వార్తలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే ఈ ఆరోపణలను వైట్ హౌస్ తీవ్రంగా ఖండించింది. ఈ నివేదికలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, బోర్డులో చేరడానికి ఎలాంటి కనీస సభ్యత్వ రుసుము లేదని స్పష్టం చేసింది. ఈ బోర్డుకు సంబంధించిన ముసాయిదా చార్టర్‌లో ఈ విషయం ప్రస్తావించారు. బోర్డుకు తొలి ఛైర్మన్‌గా ట్రంప్ వ్యవహరిస్తారని, సభ్యులను ఆహ్వానించే అంశంపై ఆయనే తుది నిర్ణయం తీసుకుంటారని అందులో ఉంది. చార్టర్ అమల్లోకి వచ్చిన మొదటి సంవత్సరంలోగా 1 బిలియన్ డాలర్లకు పైగా నగదు నిధులను అందించే దేశాలకు మూడేళ్ల సభ్యత్వ కాలపరిమితి వర్తించదని, వారికి శాశ్వత సభ్యత్వం లభిస్తుందని ఆ ముసాయిదాలో పేర్కొన్నట్టు బ్లూమ్‌బెర్గ్ తెలిపింది. ఈప్రచారంపై స్పందించిన వైట్ హౌస్ "ఇది తప్పుదోవ పట్టించేది. శాంతి బోర్డులో చేరడానికి కనీస సభ్యత్వ రుసుము లేదు" అని పేర్కొంది. "శాంతి, భద్రత, శ్రేయస్సు పట్ల లోతైన నిబద్ధతను ప్రదర్శించే భాగస్వామ్య దేశాలకు శాశ్వత సభ్యత్వం అందించేందుకే ఈ నిబంధన" అని వివరణ ఇచ్చింది. ట్రంప్ ఈ బోర్డు సభ్యుల వివరాలను ప్రకటించారు. ఇందులో తన అల్లుడు జారెడ్ కుష్నర్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, వ్యాపార భాగస్వామి స్టీవ్ విట్కాఫ్ వంటి అత్యంత సన్నిహితులకు చోటు కల్పించారు. గాజాలో భద్రతను పర్యవేక్షించి, హమాస్ స్థానంలో కొత్త పోలీస్ దళాన్ని ఏర్పాటు చేసేందుకు ఖిఅంతర్జాతీయ స్థిరీకరణ దళం ఏర్పాటు చేసి, దానికి యూఎస్ మేజర్ జనరల్ జాస్పర్ జెఫర్స్‌ను అధిపతిగా నియమించారు. దీంతో పాటు ఈజిప్ట్, ఖతార్, యూఏఈ, టర్కీ ప్రతినిధులతో కూడిన ఒక ప్రత్యేక సలహా మండలిని కూడా ఏర్పాటు చేశారు.



# అమెరికా పప్పుదినుసులపై భారత్ 30% ట్యారిఫ్‌లా?

## అమెరికా సెనేటర్లు ట్రంప్‌కు లేఖ

**వాషింగ్టన్, జనవరి 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపు ధోరణిలో భారత్‌పై టారిఫ్‌ల గురించి మాట్లాడుతూ ఉంటే, భారత్ అందుకు నిశ్శబ్దంగా ప్రతిస్పందిస్తోంది. అమెరికా నుంచి భారతదేశానికి దిగుమతి అవుతున్న పప్పు దినుసులపై భారత్ 30 శాతం టారిఫ్ విధించిందని, దీనిని తొలగించేవిధంగా భారత్‌పై ఒత్తిడి తేవాలని అమెరికన్ సెనెటర్లు ఇద్దరు ఇటీవల ట్రంప్‌ను కోరారు. ఈ టారిఫ్ అనుచితమని వీరు పేర్కొన్నారు. నార్త్ డకోటా సెనెటర్ కెవిన్ క్రామర్, మొంటానా సెనెటర్ స్టీవ్ డైనెస్ ఈ లేఖను ట్రంప్‌నకు రాశారు. గత ఏడాది అక్టోబర్ 30న అమెరికన్ యెల్లో పీస్ (పప్పు)పై భారత్ 30 శాతం టారిఫ్ విధించిందని, అది నిరుడు నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపారు.

# ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్.. - ఇయు అమెరికా వాణిజ్య ఒప్పందం నిలిపివేత!

**వాషింగ్టన్, జనవరి 18:** గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకోవాలన్న పంతంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. గ్రీన్‌లాండ్ విషయంలో తమకు సమర్థించని యూరప్ దేశాలపై 10 శాతం సుంకం విధిస్తామని చేసిన ట్రంప్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో యూరోపియన్ యూనియన్ కీలక నిర్ణయం తీసుకుంది. గత ఏడాది జూలైలో ప్రకటించిన యూఎస్ - ఈయూ వాణిజ్య ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని యూరోపియన్ పీపుల్స్ పార్టీ ఉపాధ్యక్షుడు సిగ్‌ఫ్రిడ్ మురెసాన్ సోషల్‌మీడియాలో వెల్లడించారు. గత ఏడాది జూలైలో కుదిరిన యూఎస్‌ఈయూ వాణిజ్య ఒప్పందాన్ని త్వరలోనే రాటిఫై చేయాల్సి ఉంది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా నుంచి ఈయూకు వచ్చే దిగుమతులపై సుంకాలను సున్నాకు తగ్గించే అవకాశం ఉండేది. కానీ తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ప్రక్రియను కొంతకాలం వాయిదా వేయాల్సి వస్తుందని సిగ్‌ఫ్రిడ్ మురెసాన్ తెలిపారు. గత ఏడాది అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం ద్వారా లభించే ఏకైక లాభం స్థిరత్వం మాత్రమేనని పేర్కొన్నారు. కానీ ట్రంప్ తాజా ప్రకటనతో ఆ స్థిరత్వం దెబ్బతిన్నదని అన్నారు. అందుకే ఈ వాణిజ్య ఒప్పంద రాటిఫికేషన్‌ను వాయిదా వేయడం సమంజసమని స్పష్టం చేశారు. అంతకుముందు గ్రీన్‌లాండ్‌పై అమెరికా నియంత్రణకు వ్యతిరేకిస్తున్న 8 దేశాలపై భారీగా సుంకాలు విధించనున్నట్లు డోనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్ ద్వారా ప్రకటించారు. డెన్మార్క్, బ్రిటన్, ఫ్రాన్స్, నార్వే, స్వీడన్, జర్మనీ, నెదర్లాండ్స్, ఫిన్లాండ్ దేశాల ఉత్పత్తులపై 10 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఇవి అమలులోకి వస్తాయని వెల్లడించారు. గ్రీన్‌లాండ్ కొనుగోలు వ్యవహారంలో సహకరించకపోయినా జూన్ 1వ తేదీ నాటికి కొనుగోలు ఒప్పందం పూర్తి కాకపోయినా ఈ 8 దేశాలపై టారిఫ్‌ను 25 శాతానికి పెంచుతామని ట్రంప్ హెచ్చరించారు. అమెరికా, యూరోపియన్ యూనియన్ (27 సభ్య దేశాలు) మధ్య గత ఏడాది జూలై భారీ వాణిజ్య ఒప్పందం కుదరింది. ఈ ఒప్పందం ద్వారా యూఎస్, ఈయూ మధ్య ఉన్న పలు టారిఫ్‌లు, వాణిజ్య వివాదాలకు పరిష్కారం లభిస్తుందని అంతా భావించారు. కానీ గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకోవాలన్న పంతంతో ట్రంప్ విధించిన టారిఫ్‌ల నేపథ్యంలో యూఎస్ - ఈయూ వాణిజ్య ఒప్పందంలో అనిశ్చిత్తి నెలకొంది.



## సంక్షిప్తంగా..

### బంగ్లాలో హిందూ వ్యాపారి లిటన్‌దాస్ హత్య




**ఢాకా, జనవరి 18:** బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై దాడులు ఆగడం లేదు. ఆ దేశంలో మరో హిందువును దారుణంగా కొట్టి చంపారు. కాళిగంజ్ ప్రాంతంలో హోటల్, స్వీట్ షాప్ పడిపే లిటన్ చంద్ర దాస్ అనే హిందూ వ్యాపారిని హత్య చేశారు. ఒక చిన్న వాగ్వాదం తీవ్రంగా మారి, ఆయనపై వినియోగదారుల గుంపు దాడి చేయడంతో మరణించారు. ఈ సంఘటన శనివారం ఉదయం జరిగింది. మొదట ఒక కస్టమర్ లిటన్ దాస్ షాపులో పనిచేసే అనంత్ దాస్‌తో వాగ్వాదానికి దిగాడు. పరిస్థితిని తీవ్రం కావడంతో తన ఉద్యోగిని రక్షించేందుకు లిటన్ జోక్యం చేసుకున్నాడు. అయితే, ఆయన టార్గెట్‌గా దాడికి పాల్పడటంతో ప్రాణాలు విడిచారు.

### ఇరాన్ అంతర్యుద్ధంలో 16,500 మంది మృతి



**టెహ్రాన్, జనవరి 18:** అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న ఇరాన్ లో పౌరుల ప్రాణాలు వేల సంఖ్యలో గాలిలో కలిసిపోతున్నాయి. గత మూడు వారాలుగా జరుగుతున్న ఘర్షణల్లో దాదాపు 16,500 మందికి పైగా ప్రజలు మరణించినట్లు మానవహక్కుల నివేదికలు చెపుతున్నాయి. 3.30 లక్షల మందికిపైగా ఈ ఘర్షణల్లో గాయపడ్డారు. డిసెంబర్ చివరి వారంలో ఇరాన్ లో ఘర్షణలు మొదలయ్యాయి. అక్కడ ఆర్థిక పరిస్తితి దిగజారడం, నిత్యావసరాల ధరలు పెరగడం, మరోవైపు తీవ్రమైన ఆంక్షలను వ్యతిరేకిస్తూ ప్రజలు నిరసనలు మొదలెట్టారు. నిరసనకారుల్ని అణచివేసేందుకు ప్రభుత్వం తీవ్ర చర్యలకు దిగింది. కాల్పులు, శిక్షలతో వేలాదిమంది ప్రాణాలు తీసింది.

### ఇండిగో విమానానికి బాంబు బెదరింపు - అత్యవసర ల్యాండింగ్

**న్యూఢిల్లీ జనవరి 18:** ఢిల్లీ నుంచి బాగ్డోగ్రా (పశ్చిమ బెంగాల్) ప్రయాణిస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో లక్నోలో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సివచ్చింది. ఈ ఘటన ఆదివారం జరిగింది. ఈ బాంబు బెదిరింపు విమానంలో ఒక నోట్ ద్వారా వచ్చింది. విమానంలో ఒక టిష్యూ పేపర్ పై గుర్తు తెలియని వ్యక్తి చేతితో ఈ బెదిరింపు పత్రం రాసినట్లు ఏసీపీ రజనీష్ వర్మ తెలిపారు. ఇండిగో విమానం ఉదయం ఢిల్లీ నుంచి బాగ్డోగ్రా వెళ్తుండగా విమానంలో బాంబు ఉందని ఆ విమానంలోని టాయిలెట్ లో ఉన్న ఒక టిష్యూ పేపర్ పై చేతి రాతతో రాసి ఉండగా సిబ్బంది గుర్తించారు. దీంతో విమానంలోని పైలట్లు ఏటీసీకి సమాచారం అందించారు. అనంతరం ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసేందుకు అనుమతి తీసుకున్నారు.

### నీటిగుంతలో పడిన కారు.. టెకీ మృతి

**లక్నో, జనవరి 18:** అదుపుతప్పిన కారు లోతైన నీటి గుంతలోకి దూసుకెళ్లింది. ఆ కారులో ఉన్న టెకీ తన తండ్రికి ఫోన్ చేసి కాపాడాలని కోరాడు. అక్కడకు చేరుకున్న ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సహాయక చర్యల్లో ఆలస్యం జరిగి ఆ టెకీ నీట మునిగి మరణించాడు. దేశ రాజధాని ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఈ సంఘటన జరిగింది. బీహార్‌లోని సీతామర్హికి చెందిన 27 ఏళ్ల యువరాజ్ మెహతా, గురుగ్రామ్‌లోని డన్‌హంబీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల కిందట తల్లి మరణించింది. దీంతో తండ్రితో కలిసి నోయిడాలో నివసిస్తున్నాడు. ఈనెల 16న రాత్రి వేళ పని తర్వాత యువరాజ్ తన కారులో ఇంటికి బయలుదేరాడు. నోయిడాలోని సెక్టార్ 150 వద్ద కారును మలుపు తిప్పేందుకు ప్రయత్నించాడు. పొగమంచు కారణంగా ముందు ఏమున్నది అన్నది యువరాజ్‌కు కనిపించలేదు. దీంతో ఆ కారు చిన్న గోడను ఢీకొట్టింది. 70 అడుగుల లోతైన నీటి గుంతలోకి కారు దూసుకెళ్లింది.

### జల్లికట్టు యోధులకు ప్రభుత్వ ఉద్యోగాలిస్తాం:సిఎం స్టాలిన్

**చెన్నై,జనవరి 18:** తమిళనాడులో నిర్వహించిన జల్లికట్టుపోటీల్లో అత్యధిక సంఖ్యలో ఎద్దులను నిలువరించిన యోధులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. అళంగనల్లూరు జల్లికట్టును సందర్శించిన తర్వాత ఆయన ఈ ప్రకటన చేసారు. ఉదయం ఏడు గంటలనుంచి ప్రారంభించి, జల్లికట్టుపోటీలు ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా ఆకట్టుకుంటాయి. సాంప్రదాయబద్ధంగా వస్తున్న ఈ క్రీడను తిలకించేందుకు ముఖ్యమంత్రి వేదికవద్దకు చేరుకుని విజేతలకు అత్యధిక సంఖ్యలో ఎద్దులను నిలువరించిన యోధులకు బహుమతులు పంపిణీచేసారు. అలాగే ఎద్దుల యజమానులను కూడా ఆయన సత్కరించారు. వారందరికీ పసిడితో చేసిన ఉంగరాలను బహూకరించారు. సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ పశుసంవర్ధక ఆసుపత్రిని ఏర్పాటుచేస్తామన్నారు.

# ఓర్సా లోయలోపడిన బస్సు

## ఐదుగురు మృతి, 25 మందికి తీవ్ర గాయాలు




**మహువాధర్(జార్ఖండ్), జనవరి 18:** జార్ఖండ్‌లోని లతేహార్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివాహ బృందం ప్రయాణిస్తున్న బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, 25 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని బలరాంపూర్ జిల్లా నుండి మహువాదర్‌కు వెళ్తున్న బస్సు మహువాదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓర్సా లోయ వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారని, సహాయక చర్యలు ప్రారంభించామని, గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు జార్ఖండ్ పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమేమిటో స్పష్టంగా తెలియదని, దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బాధితులకు తక్షణ సహాయం అందించాలని లతేహార్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గత 24 గంటల్లో జార్ఖండ్‌లో జరిగిన మూడవ పెద్ద ప్రమాదం ఇది. శనివారం రాత్రి, డియోరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘాసిదిహ్ గ్రామం సమీపంలో కారులో ప్రయాణిస్తున్న ట్రక్కును ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు మరణించగా, మరొకరు గాయపడ్డారు. వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

# మణికర్ణిక ఘాట్‌పై డీప్‌ఫేక్ చిత్రాలు!

## సోషల్ మీడియా యూజర్లు 8 మందిపై కేసులు



**వారణాసి, జనవరి 18:** ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న ప్రఖ్యాత మణికర్ణిక ఘాట్ అభివృద్ధి పనులకు సంబంధించి సోషల్ మీడియాలో కృత్రిమ మేధతో సృష్టించిన ఫేక్ చిత్రాలతో తప్పుడు ప్రచారం చేసినందుకు 8 మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మణికర్ణిక ఘాట్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులకు సంబంధించి వాస్తవాలకు విరుద్ధంగా, కల్పిత చిత్రాలను సోషల్‌మీడియా వేదికగా కొందరు ప్రచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ చిత్రాలలో హిందూ దేవతలను అవమానకరంగా చూపించారని, తద్వారా మత విశ్వాసాలను దెబ్బతీసి, ప్రజల్లో ఆగ్రహం రెచ్చగొట్టేందుకు, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నించారని అధికారులు ఆరోపించారు. ఏసీపీ అతుల్ అంజన్ మాట్లాడుతూ మణికర్ణిక ఘాట్‌లో జరుగుతున్న పనులకు సంబంధించి అనేక తప్పుడు పోస్టులు, చిత్రాలు సర్క్యులేట్ అయ్యాయి. భవిష్యత్తులో ఇలాంటివి పోస్ట్ చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వారిలో కాంగ్రెస్,

ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన నేతలు కూడా ఉన్నారని ఆయన వెల్లడించారు. ఘాట్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్న సంస్థ ప్రతినిధి చౌక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2025 నవంబర్ 15 నుంచి తాము పనులు చేస్తున్నామని, జనవరి 16న రాత్రి ఒక నెటిజన్ ఏఐ జనరేటెడ్ చిత్రాలను షేర్ చేసి, ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పోస్టులకు అభ్యంతరకరమైన కామెంట్లు, రీపోస్టులు రావడంతో ఉద్రిక్తతలు పెరిగాయని పోలీసులు గుర్తించారు. వదంతులు వ్యాప్తి చేసేవారిపై చర్యలు కొనసాగుతాయని, పోస్టులు పెట్టిన వారితో పాటు వాటిని రీపోస్ట్ చేసి, కామెంట్లు చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు స్పష్టం చేశారు.



# దావోస్‌కు కేంద్ర మంత్రి రామ్మోహన్

## - సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లతో కలసి సదస్సులో పాల్గొననున్న రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, జనవరి 18 ప్రభాతవార్త: స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సుకు మరోసారి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. దేశం తరపున కేవలం ముగ్గురు కేంద్ర మంత్రులు మాత్రమే ఈ ప్రతిష్టాత్మక సదస్సులో పాల్గొనే అవకాశం ఉండగా ఇదివరకే ఈ సదస్సుకు హాజరైన రామ్మోహన్ నాయుడుకు మరోసారి అవకాశం కల్పించారు ప్రధాని మోడీ. ఈ నేపథ్యంలో ఆదివారం స్విట్జర్లాండ్‌లోని మోరీచ్‌లో జరుగుతున్న సదస్సుకు ఆయన హాజరయ్యారు. జనవరి 19 నుండి 23 వరకు ఈ సదస్సు జరగనుండగా మొత్తంగా 130 దేశాల నుండి 3000 మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ సదస్సుకు భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు. భారత ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా, దేశీయ విమానయాన వ్యవస్థను మరింత వృద్ధిలోకి తీసుకువచ్చే విధంగా కీలక వ్యక్తులను కలవడం, సదస్సులో భారత దేశ వృద్ధిని, భవిష్యత్ ఆలోచనలను తెలియపరచడంలో ప్రస్తుతం రామ్మోహన్ నాయుడు కీలకంగా వ్యవహరించనున్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌తో కలసి దావోస్‌లోని తెలుగు కమ్యూనిటీతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. విమానయాన రంగంలో, రాష్ట్రంలో పెట్టుబడుల విషయంలో కీలక సంస్కరణలు సాధించే దిశగా రామ్మోహన్ నాయుడు కీలక ప్రసంగం చేయడంతో పాటు ముఖ్యమైన వ్యక్తులతో భేటీ కానున్నారు.

### అపూర్వ స్వాగతం.. అడుగడుగునా ఆత్మీయం

ఆదివారం స్విట్జర్లాండ్‌లోని జురిచ్ ప్రాంతానికి సహచర కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో కలసి రామ్మోహన్ నాయుడు చేరుకున్నారు. వారికి స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్ కుమార్ ఘన స్వాగతం పలికారు. ప్రపంచ ఆర్థిక రాజధాని అయిన దావోస్‌లో ఈ సదస్సు 19 నుంచి 23 వరకు సాగనుంది. ఈ ఏడాది 'ఏ స్పిరిట్ ఆఫ్ డైలాగ్' థీమ్‌తో వరల్డ్ ఎకనామిక్ ఫోరం జరగనుంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పోటీ ప్రపంచంలో సహకారం, ఆవిష్కరణల ఆధారిత వృద్ధి, సమ్మిళిత అభివృద్ధిపై చర్చలు జరగనున్నాయి.

# వాడవాడలా ఎన్టీఆర్‌కు నివాళి



విజయవాడ, జనవరి 18 ప్రభాతవార్త ప్రతినిధి: టిడిపి వ్యవస్థాపకుడు, విశ్వ విఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్టీఆర్ అభిమానులు, తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు నివాళి అర్పించారు. ఇక ఏపి, తెలంగాణ రాష్ట్రాల్లోని ఊరువాడల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి.. సినీ హీరోగా, ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఎన్టీఆర్ జిల్లాలో బీసీలకు మొట్టమొదటిసారిగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెట్టిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వెల్లడించారు. రాయలసీమకు తాగునీరు సాగునీరు అందించిన భగీరథుడు ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. ఏపిలో సిఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధితోపాటు పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం పనుల్లో పురోగతితోపాటు పరిశ్రమ ఏర్పాటుతో ఏపి.. దేశంలోనే నెంబర్ వన్‌గా ఎదుగుతుందన్నారు. గొల్లపూడి, గుంటుపల్లి, కొండపల్లిలో.. ఎన్టీఆర్ 30వ వర్ధంతిని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ నిర్వహించారు. నందిగామ, జగ్గయ్యపేటల్లో ప్రభుత్వ విప్‌లు తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్యల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గుంటూరు జిల్లా టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్య రావు, స్థానిక ఎమ్మెల్యే నసీర్, ఏపిఐడిసి ఛైర్మన్ దేగల ప్రభాకర్, ఏపిటిఐఎస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణతో పాటు పలువురు పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భీమవరంలో జిల్లా టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఏపిఐఐసి ఛైర్మన్, టిడిపి జిల్లాధ్యక్షుడు మంతెన రామరాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. విశాఖపట్నంలో స్వర్గీయ ఎన్టీఆర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలు పాలనలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయని విశాఖ ఎంపి శ్రీభరత్ స్పష్టం చేశారు. అధికారం శాశ్వతం కాదు, దానిని సద్వినియోగం చేసుకొని ప్రజలకు మేలు జరగాలని ఎన్టీఆర్ ఆకాంక్షించారు. ఆయన స్థాపించిన టిడిపిలో తాను ఎంపీగా సేవలందించడం గర్వంగా ఉందన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పని చేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు నగరంలోని బీచ్ రోడ్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి విశాఖ ఎంపీ భరత్‌తోపాటు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణ, ఎమ్మెల్సీ చిరంజీవి రావు, జిల్లా అధ్యక్షుడు పట్టాభితోపాటు భారీగా కార్యకర్తలు హాజరయ్యారు. చిలకలూరిపేటలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా.. ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఎడ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కరిముల్లా, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎంపి పురందేశ్వరి, సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నివాళి అర్పించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకుని ఆయన సమాధిపై పూలమాలలు ఉంచి అంజలి ఘటించారు. లోకేశ్‌తో పాటు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నేతలు, అభిమానులు అక్కడికి తరలివచ్చారు. ఎన్టీఆర్ ఘాట్ వద్దకు సినీనటుడు కళ్యాణ్‌రామ్ చేరుకుని నివాళి అర్పించారు. మాజీమంత్రులు మోత్కుపల్లి నర్సింహులు, బాబుమోహన్ ఎన్టీఆర్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబసభ్యులతో పాటు అభిమానులు భారీ ఎత్తున ఘాట్ వద్దకు చేరుకొని పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘాట్‌ను పూలతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవిత విశేషాలతో చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 30వ వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అభిమాని తురగా సూర్యారావు మాట్లాడుతూ ఒక్క తెలుగు వారే కాకుండా జాతీయస్థాయిలో భారతీయుల ఆదరణ పొంది స్థిరమైన కీర్తిని అర్జించిన నటుడు, రాజకీయ నేత నందమూరి తారక రామారావు అని అన్నారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు వడ్డెల్లి సాంబశివరావు నందిగామలో ఎన్టీఆర్ అరుదైన ఛాయా చిత్రాల ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ప్రదర్శనను ప్రారంభించారు. నందమూరి తారక రామారావు అసాధారణ జీవితం, వారసత్వానికి గుర్తింపుగా, ఆయన దార్శనిక నాయకత్వం, కళా ప్రతిభ, తెలుగు ప్రజల పట్ల అచంచలమైన అంకితభావం ఆంధ్రప్రదేశ్‌పై చెరగని ముద్ర వేశారని అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉదయం గుంటూరులోని అమరావతి రోడ్డులో చిల్లీస్ దాబా వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ తెలుగు జాతికి గర్వకారణమైన ఎన్.టి. రామారావు, తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలు సినిమా రంగానికి చేసిన సేవలు అజరామమన్నారు. రాముడు ఎలా ఉంటాడో కృష్ణుడు ఎలా ఉంటాడో ప్రజలకు తన నటన ద్వారా చాటిచెప్పిన ధీరుడు అన్నారు. ప్రజల హృదయాలలో ఎప్పటికీ చెరగని ముద్ర వేశారన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అనిత

# చరిత్రపుటల్లో ఎన్టీఆర్‌ది చెరగని స్థానం

విజయవాడ, జనవరి 18 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజలు మెచ్చిన ముఖ్యమంత్రిగా, పేదల సంక్షేమం కోసం అంకితభావంతో కృషి చేసిన మహానాయకుడిగా ఎన్టీఆర్ చరిత్రపుటల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) వర్ధంతి సందర్భంగా విజయవాడ క్యాంప్ కార్యాలయంలో హోంమంత్రి వంగలపూడి అనిత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడిగా వెండితెరను ఏలిన కథానాయకుడిగానే కాకుండా, తిరుగులేని నేత ఆయన అన్నారు. ప్రభుత్వం అంటే ప్రజలను భయపెట్టే యంత్రం కాదని, ప్రజలకు అండగా నిలిచే వ్యవస్థ అనే భావనను నాటిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. అలాంటి మహానాయకుడ్ని చూస్తూ తాను ఎదిగానని, ఈ రోజు ఆయన స్థాపించిన తెలుగుదేశం పార్టీలో హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహించే అవకాశం లభించడం తన జీవితంలో దక్కిన గొప్ప గౌరవమని మంత్రి అనిత పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాల సాధన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. తెలుగు ప్రజల కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి అనిత స్పష్టం చేశారు.

# ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తాం

## - టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

## - ఎన్టీఆర్‌కు నివాళి... రక్తదాన శిబిరం నిర్వహణ



విజయవాడ, జనవరి 18 ప్రభాతవార్త ప్రతినిధి: తెలుగు జాతి ఆత్మగౌరవ పతాకం, మహానాయకుడు నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన తెలుగు తేజోమూర్తికి నివాళులు" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఎన్టీఆర్‌కు తమ సేవా నివాళులు అర్పించారు. రక్తదానం చేసిన ప్రతి కార్యకర్తను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించి, వారి తన చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఎన్టీఆర్ తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానాయకుడు అని అన్నారు. తెలుగువారికి ఆత్మవిశ్వాసం, రాజకీయ చైతన్యం ఇచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. "తెలుగుదేశం పార్టీలో ఉన్నామంటే ఒక ధైర్యం, ఒక నమ్మకం.. ఆ నమ్మకానికి పునాది వేసింది ఎన్టీఆరే" అని స్పష్టం చేశారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని దశదిశలా వ్యాప్తి చేయాలనే లక్ష్యంతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి, సంక్షేమం, అభివృద్ధి అంటే ఏమిటో దేశానికి చూపించిన నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఢిల్లీ పెద్దలను వణికించిన ధైర్యశాలి ఎన్టీఆర్ అని కొనియాడారు. రెండు రూపా యల కిలో బియ్యం పథకం ద్వారా పేదవాడి కడుపు నింపిన నాయకుడు ఎన్టీఆర్ అని, కూడు-గుడ్డ-నీడను పేదలకు హక్కుగా అందించిన మహనుభావుడని అన్నారు. స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించి సామాజిక విప్లవానికి నాంది పలికిన నాయకుడు ఎన్టీఆర్ అని, బడుగు బలహీన వర్గాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించి రాజకీయ చైతన్యం తెచ్చిన గొప్ప నేతగా ఎన్టీఆర్‌ను గుర్తు చేశారు.

రాజకీయ, సామాజిక, సంక్షేమ రంగాల్లో ఎన్టీఆర్ తీసుకొచ్చిన సంస్కరణలు పేదల జీవితాలను మార్చాయని తెలిపారు. గురుకుల పాఠశాలల స్థాపనతో విద్యలో సమానత్వానికి దారి చూపిన నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. పేదవాడికి రాజకీయ భిక్ష కాదు - రాజకీయ హక్కు కల్పించిన నాయకుడు ఎన్టీఆర్ అని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ తర్వాత రాష్ట్ర పాలక పగ్గాలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు తనదైన మార్క్ పాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలను ఆచరణలో కొనసాగిస్తూ, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి శిఖరాలకు తీసుకెళ్లడమే తెలుగుదేశం పార్టీ కర్తవ్యమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.



# శ్రీకాళహస్తీశ్వరాలయానికి పోటెత్తిన భక్తజనం

శ్రీకాళహస్తి, జనవరి 18 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం తై అమావాస్య సందర్భంగా భక్తజనులు కడలి తరంగాల్లా కదలి వచ్చారు. ఏడాదిలో ఒకసారి వచ్చే ఆరోజు భక్తులు భోళాశంకరుని దర్శనానికి తహతహలాడారు. రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకునేందుకు భక్తులు గంటల కొద్ది నిరీక్షించారు. తై అమావాస్య ఆదివారం రావటమే అరుదు. అలాంటి పవిత్రమైన రోజు శ్రీకాళహస్తీరాలయంలో ఎటు చూసినా భక్త జనసందోహం చోటుచేసుకుంది. ఉదయం 3గంటల నుంచి స్థానికులతో పాటు తమిళనాడు, కేరళ, కర్నాటకల నుంచి వచ్చిన భక్తులు శనీశ్వరుని విగ్రహానికి అభిషేకాలు జరుపుకొనుటకు పోటీలు పడ్డారు. భక్తుల హార నామస్మరణతో దద్దరిల్లింది.



లోబావిలో షోడషాభిషేకాలు జరుపుతున్న దృశ్యం

# కన్నుల పండువగా కైలాసనాధుని లోబావి ఉత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 18 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంలో వెలసిన భోళాశంకరుని లోబావి ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను చక్కగా అలంకరించారు. మేళతాళాలు మంగళవాయిద్యాలతో సన్నిధివీధి, శివయ్యసదన్‌ల మీదుగా స్వామి అమ్మవార్లను వేలాది మంది భక్తులు వెంటరాగా లోబావి (భరద్వాజ తీర్థం) వద్దకు చేర్చారు. అక్కడ భరద్వాజేశ్వరుని ఆలయం ఎదురుగా ఉత్సవర్లను ప్రతిష్టించి వేద పండితులు వేదమంత్రాల్ని ఘోషిస్తుండగా శాస్త్రోక్తంగా ఆలయ ఆర్చకులు షోడషాభిషేకాలు నిర్వహించారు. భక్తులు తనివి తీరా స్వామి అమ్మవార్ల షోడషాభిషేకాలు తిలకించారు. అనంతరం అక్కడ నుంచి స్వామి అమ్మవార్లకు ప్రత్యేకాలంకారం జరిపి బ్రహ్మగుడి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ బూడిదమిట్ట వాసులు స్వామి అమ్మవార్లను దర్శించుకొని హారతులిచ్చారు. అక్కడ నుంచి సాయంత్రం ఆలయానికి చేర్చారు. ఈ ఉత్సవంతో పాటు అనంతరం భరద్వాజ తీర్థంలో స్వామి అమ్మవార్ల ఊరేగింపు పచ్చటి పచ్చికలు, చెట్లు మధ్య గల భరద్వాజ తీర్థంలో కైలాసనాధుడు విహరించారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు పగడాల మురళి, దండి రాఘవయ్య, వాకచర్ల గుర్రప్పశెట్టి, గోపినాధ్, ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, ప్రధానార్చకులు కరుణాగురుకుల్, వేదపండితులు అర్ధగిరి అర్చకులు గోవింద్‌శర్మ, పట్టణ ప్రముఖులు బొజ్జల బృందమ్మ సారధ్యంలో తెలుగుదేశం నాయకులు మార్కెటింగ్ కమిటి చైర్మన్ చెంచయ్య నాయుడు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# గణనాధుని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



కాణిపాకం, జనవరి 18 ప్రభాతవార్త: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.కిరణ్మయి ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఎఇఒ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట సూపరింటెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవి, స్థానిక ఎస్‌ఐ నరసింహులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# వరసిద్ధుని సేవలో సినీ హీరో శర్వానంద్



కాణిపాకం, జనవరి 18 ప్రభాతవార్త: ప్రముఖ సిని హీరో శర్వానంద్ ఇటీవల తాను నటించి విడుదలైన నారీ నారీ నడుమ మురారీ చిత్రబృందంతో కలసి ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఈమేరకు నారీనారీ నడుమ మురారీ హీరోయిన్ సాక్షి వైద్య, దర్శకుడు రామ్ అబ్బరాజులతో కలసి కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే కుటుంబసమేతంగా స్వామివారి ప్రత్యేక అభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

# అరసవల్లిలో రథసప్తమికి ముమ్మర ఏర్పాట్లు

## - ఉత్సవాల నిర్వహణలో లోటుపాట్లు ఉండకూడదు

## - దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్



శ్రీకాకుళం, జనవరి 18 ప్రభాత వార్త: అరసవల్లి రథసప్తమి ఉత్సవాల్లో స్వామివారి దర్శనం కోసం సామాన్య భక్తులకు అగ్ర తాంబూలం ఇస్తున్నామని గర్భ గుడి ఎదుట నాలుగు వరుసల్లో దర్శనం కల్పించడం ద్వారా భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండే సమయాన్ని గణనీయంగా తగ్గిస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన రథసప్తమి ఉత్సవాల నిర్వహణపై డీఎస్పీ వివేకానందతో కలసి ఏర్పాట్లు స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో కమిషనర్‌కు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ వేడుకల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదని, ప్రతి సెక్టార్‌లో కీలక శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లు పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దర్శన ఏర్పాట్లపై ప్రత్యేక దిశానిర్దేశం చేస్తూ ప్రముఖుల (వీఐపీ) రాక వల్ల సామాన్య భక్తుల క్యూ లైన్లకు ఎక్కడా అంతరాయం కలగకుండా ప్రత్యేక మార్గాలను ఏర్పాట్లు చేయాలని ఇది ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. దాతల పాస్‌లు ఉన్నవారికి నేరుగా ప్రవేశం ఉంటుందన్నారు. భక్తులకు ఆహారం పంపిణీ చేసే దాతల కోసం (ఫుడ్ డోనర్స్) ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల విషయంలో రాజీ పడకూడదని దేవాదాయ శాఖ తరపున 70 ట్యాంకులు మరియు 30 వేల వాటర్ బాటిల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు 300 రూపాయలు 100 రూపాయల టికెట్లను రేపటి నుండి ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. క్షీరాభిషేకం టికెట్స్ ఆన్‌లైన్ ద్వారా 24వ తేదీ నుండి బుక్ చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ విధానం ద్వారా భక్తులకు సమయం కలిసి వస్తోందని అన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా టిక్కెట్ పైనే దర్శన సమయాన్ని కూడా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. రథసప్తమి ఏర్పాట్లలో భాగంగా దేవాదాయ శాఖ నుండి 100 మంది సిబ్బంది, 500 మంది వాలంటీర్లు పాల్గొంటారని తెలిపారు. క్యూ లైన్ల వద్ద భక్తులకు ఎండ తగలకుండా షేడ్ నెట్లు, చల్లని మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పర్యవేక్షణలో డీఎస్పీ వివేకానంద, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరామప్రసాద్ (హరి), ప్రత్యేక అధికారి శోభారాణి, సింహాచలం దేవస్థానం సూపరింటెంట్ కంచమూర్తి, దేవస్థానం ఈ.వో. ప్రసాదరావు, అరసవల్లి ఆలయ సిబ్బంది, వివిధ స్థాయిల అధికారులు పాల్గొన్నారు.

# శవరాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసిపి

## మంత్రి అనగాని సత్యప్రసాద్



విజయవాడ, జనవరి 18 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు సంక్రాంతి పండగను వైభవంగా జరుపుకున్నారని, కానీ వైసిపి నేతలు మాత్రం ఇంకా సైకో ఆలోచనల్లోనే ఉన్నారని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాజధాని అమరావతిలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

చిత్రసీమతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా ఎన్టీఆర్ చేసిన సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. ఈ సందన్భంగా మాట్లాడుతూ.. వైసిపి నేతల వైఖరిని ఎండగట్టారు. శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా వైసిపి మారిందంటూ ఆ పార్టీపై నిప్పులు చెరిగారు. సిఎం చంద్రబాబు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని వివరించారు. సిఎం చంద్రబాబు ఆలోచనలు ఎపుడు రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమంపైనే ఉంటాయని అనగాని అన్నారు. వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా.. జంతు బలులు చేశారని మంత్రి విమర్శించారు.

నాయకుడికి ఏది నచ్చుతుందో అదే వైసిపి వాళ్లు చేశారని.. అది వారి నైజమని అభివర్ణించారు. గత ప్రభుత్వంలో సబ్ ప్లాన్ నిధులు తీసివేశారన్నారు. బలహీనవర్గాల వారిని నాశనం చేశాడంటూ జగన్‌పై నిప్పులు చెరిగారు.

మహిళలను జగన్ ప్రభుత్వం కించపరిచిందంటూ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తోందని కుండబద్దలు కొట్టారు. పల్నాడులో రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదాన్ని పార్టీకి అంటగట్టేందుకు వైసిపి పాకులాడిందని చెప్పారు. తప్పుచేసిన వారిని కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదని స్పష్టం చేశారు.

# పద్మశ్రీ డా. ఆదినారాయణ రావు మరణం తీరని లోటు

## మాజీ సిఎం వైఎస్ జగన్



విజయవాడ, జనవరి 18 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. సుంకర వెంకట ఆదినారాయణ రావు (విశాఖపట్నం) మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు వైయస్ జగన్ సంతాపం వ్యక్తంచేశారు. పోలియో రోగులకు లక్షలాది శస్త్రచికిత్సలు చేసి, వేలాది మందికి నడక నేర్పిన ఆయన సేవలకు గుర్తింపుగా 2022లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. పోలియో బాధితులు, వికలాంగుల కోసం లక్షకు పైగా ఉచిత శస్త్రచికిత్సలు చేశారు, దేశవ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. అలాంటి గొప్ప వైద్యుడి మరణం తీరని లోటు అన్నారు. ఆదినారాయణ రావు పోలియో రహిత భారత దేశం కలలను సాకారం చేయడం లక్ష్యంగా ఆయన వైద్యరంగంలో సేవలందించారని వైయస్ జగన్ కొనియాడారు. ఆదినారాయణ రావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వైయస్ జగన్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు వైయస్ జగన్ తెలియజేశారు.




## సెలవు దినాలు ప్రపంచవ్యాప్తంగా

# భారత్‌లోనే ఎక్కువ

### యేడాదిలో 42 రోజులు సెలవులే

**న్యూఢిల్లీ, జనవరి 18:** ప్రభుత్వ రంగంలో పనిచేసే వారికైనా ప్రైవేట్ రం గంలో పనిచేసే వారికైనా సెలవులు తప్పనిసరిగా ఆయా శాఖలు, సంస్థలు కేటా యిస్తాయి. కార్మిక శాఖ నిబంధనలను అనుసరించి నిర్దేశిం చిన తేదీల్లో సెలవులు ఉంటాయి. ఇవికాకుండా ప్రభుత్వం పూర్తి హాలిడేలు కూడా ప్రకటిస్తుంది. ఈ జాబితాలో. కొన్ని దేశాలు ఏటా ఎక్కువ సెలవులను ప్రకటిస్తుంటే మరికొన్ని పరిమిత సెలవులే ప్రకటిస్తాయి. ఈ సెలవులు జాతీయ కార్యక్రమాలు, సాంస్కృతిక వైవిధ్యం, మత పరమైన సంప్రదా యాలపై ఆధారపడి ఉంటాయి. అత్య ధిక సెలవులున్నదేశాల జాబితాలో భారతదేశం అగ్రస్థా నంలో ఉంది. అన్ని రకాల సెలవులు (జాతీయ, గెజిటెడ్, రిస్ట్రిక్ టెడ్, మతపరమైన, ప్రాంతీయ) కలిపి, భారతదేశం ప్రపంచంలోనే 42 అత్యధిక సెలవులను కలిగి ఉంది. ఇది భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని, భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తిని ప్రతిబిం బిస్తుంది. భారతదేశం మల్టీ రెలిజియస్ స్ట్రక్చర్ పండుగల పట్ల గౌరవాన్ని ప్రతి బింబిస్తుంది. తర్వాతి స్థానంలో నేపాల్ 35 సెలవులు ఇస్తోంది. క్యాలెండర్ కూడా మతపరమైన పండుగలతో నిండి ఉంది. ప్రధాన పండుగల సమయంలో లేదా వాటి చుట్టూ దీర్ఘ సెలవులు వస్తాయి. ఇరాన్ 26 సెలవులతో మూడవ స్థానంలో ఉంది. ఇక్కడ సెలవులు ఇస్లామిక్ క్యాలెండర్ ఆధారంగా ఉంటాయి. వీటిలో నౌరూజ్ (ఇరానియన్ నూతన సంవత్సరం), ఇతర మతపరమైన సెలవులు ఉన్నాయి. మయన్మార్‌లో ఇరాన్‌తో సమాన మైన సెలవులు ఉన్నాయి 26. ఇవి ప్రధానంగా బౌద్ధ మతపరమైన పండుగలతో ముడిపడి ఉన్నాయి. థింగ్యాన్ నూతన సంవత్సరం, నీటి ఉత్సవం వంటి ప్రధాన పండుగల సమయంలో ఎక్కువ సెలవులు ఉంటాయి. శ్రీలంక 25 సెలవులతో ఐదవ స్థానంలో ఉంది. దీపావళి, ఈద్, క్రిస్మస్ వంటి పండుగలతో సహా మతపరమైన, పౌర సెలవుల సమతుల్యత ఉంది. అతి తక్కువ సెలవులు ఉన్న దేశాల గురించి ప్రస్తావిస్తే బ్రిటన్‌లో 10, నెదర్లాండ్స్‌లో 9, సెర్బియాలో 9, మెక్సికోలో 8, వియత్నాంలో 6 సెలవులు మాత్రమే ప్రభుత్వాలు అధికారికంగా ప్రకటిస్తాయి.

# ఒత్తిడి నిండిన జీవితానికి 'హాస్యం' దివ్యౌషధం

### 'కాసేపు నవ్వుకుందాం' పుస్తకావిష్కరణలో పద్మవిభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి వెల్లడి




తరిమెల అమర్నాథ్‌రెడ్డి రచించిన కాసేపు నవ్వుకుందాం పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం, జనవరి 18 ప్రభాతవార్త బ్యూరో: ఒత్తిడితో నిండిన జీవితాన్ని ఆరోగ్యంగా మార్చుకోవడానికి నవ్వడమే దివ్య ఔషధమని, అది తెలియని చాలా మంది కృత్రిమ మందుల వెంట పడు తుండడం ఆశ్చర్యం కలిగిస్తోందని ప్రముఖ ఔషధ కంపెనీ శాంతా బయోటిక్ అధినేత, పద్మవిభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రతి మనిషి హాయిగా నవ్వుకుని ఆరోగ్యాన్ని పెంచుకోవాలని దానిని పోగొట్టుకొని అనారోగ్యం పాలుకావద్దని ఆయన ప్రజలకు సూచించారు. అనంతపురంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో ఆదివారం జరిగిన మానవతా రక్తదాతల బృందం కన్వీనర్ తరిమెల అమర్నాథ్‌రెడ్డి రచించిన "కాసేపు నవ్వుకుందాం" పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్ఎఫ్ ఎకాలజి సెంటర్ డైరెక్టర్ వై.వి. మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యుపిపిహెచ్‌సి మాజీ సభ్యులు డాక్టర్ వై.వెంకటరామిరెడ్డి, మానవతా కో కన్వీనర్ సలీంమాలిక్, కవి ఏలూరు ఎంగన్న, విరసం కవయిత్రి శశికళ, విశ్రాంత అధ్యాపకులు అయూబ్‌ఖాన్, తెలుగు వెలుగు సంస్థ వ్యవస్థాపకులు పి.వి రెడ్డి, సీనియర్ జర్నలిస్టు గుంటి మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. సభలో పద్మ విభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ "కాసేపు నవ్వుకుందాం" పుస్తకాన్ని రచించిన తరిమెల అమర్నాథ్‌రెడ్డి విలక్షణ వ్యక్తిత్వం ఎందరికో ఆదర్శ మన్నారు. తరిమెల అమర్నాథ్‌రెడ్డి రచనలకు జిల్లాలోనే కాకుండా చాలా ప్రాంతాల్లో అభిమానులు వున్నారని కొనియడారు. తరిమెల అమర్నాథ్‌రెడ్డి ఈ మధ్యకాలంలోనే తనకు స్నేహితుడు అయ్యాడని ఆయనతో మాట్లాడుతుంటే కాలం ఇట్లే గడిచిపో తుందని ఆయన పుస్తకాలను అందరూ చదవాల న్నారు. అనంత వాసులతో కలిగివున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ మరొకసారి ప్రత్యేకంగా జిల్లాలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటానని వరప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా నిత్య జీవితంలో వుండాల్సి న హాస్యం ప్రాధాన్యతను వివరిస్తూ సందర్భోచిత జోకులతో ఆయన కడుపుబ్బా నవ్వించారు. ఆరోగ్యం కోసం నవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సభలో ఆర్ఎఫ్ ఎకాలజి డైరెక్టర్ మల్లారెడ్డి, యుపిపిహెచ్‌సి మాజీ సభ్యులు వెంకటరామిరెడ్డి, కవి వేలూరు ఎంగన్న, మురళీకృష్ణ, పివి రెడ్డి, తదితరులు తమ ప్రసంగాల్లో "కాసేపు నవ్వు కుందాం" పుస్తకం రచయిత తరిమెల అమర్నాథ్‌రెడ్డి తన జీవితంలో సమాజం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రక్తదాన ఉద్యమంలో నిరంతరం కృషి చేస్తూనే సమాజంలో మూఢనమ్మకాలను పార ద్రోలేందుకు పాఠశాలలు, కళాశాలల్లో ఎన్నో చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. ఇప్పటికే 13 పుస్తకాలను అమర్నాథ్‌రెడ్డి రచించారని "కాసేపు నవ్వుకుందాం" పుస్తకం 14వదని అందరూ చదవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సాయిబాబా కళాశాల కరస్పాండెంట్ బిఎల్ఎన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, డాక్టర్ నిర్మలారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్స్ రమేష్‌నారాయణ, వెంకటరెడ్డి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి రమణ, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నరసింహప్ప, రిటైర్డ్ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటి మేయర్ విజయభాస్కర్‌రెడ్డి, మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ఎం బాష, డాక్టర్ ప్రసూన, ఇంటాక్ చైర్మన్ రాంకుమార్‌రెడ్డి, జనవిజ్ఞానవేదిక నాయకులు ప్రేమ్‌కుమార్, వివేకానంద యోగా కేంద్రం ముఖ్యులు రాజశేఖర్‌రెడ్డి, శాంతినారాయణ, వెంకటేశులు, జూటూరు తులసిదాసు, శ్యాంసుందర్‌శాస్త్రి, ఆశ్రయ అనాథాశ్రమం నిర్వాహకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# లక్షమంది క్వాంటం కంప్యూటింగ్ నిపుణుల తయారీ లక్ష్యం

### అడ్వాన్స్‌డ్ క్వాంటం స్కిల్లింగ్ కోర్సుకు 50 వేల మంది నమోదు

### ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు



విజయవాడ, జనవరి 18 ప్రభాత వార్త ప్రతినిధి: అడ్వాన్స్‌డ్ క్వాంటం స్కిల్లింగ్ కోర్సుకు అనూహ్య స్పందన వస్తుండటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్ష వ్యక్తం చేశారు. ఇప్పటి వరకూ ఈ కోర్సు నేర్చుకునేందుకు 50 వేల మంది నమోదు చేసుకోవటంపై సిఎం ఎక్స్ వేదికగా స్పందించారు. ఎపిలో లక్ష మంది క్వాంటం నిపుణుల్ని తయారు చేసేలా సంకల్పం చేశామని పేర్కొన్నారు. ఐఐటి మద్రాస్, ఐబిఎం రీసెర్చ్ కేంద్రం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎన్‌పిటిఇఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అడ్వాన్స్‌డ్ క్వాంటం స్కిల్లింగ్ కోర్సు నేర్చుకునేందుకు ఇంత పెద్ద సంఖ్యలో నమోదు కావటం ఆనందాన్ని ఇస్తోందని సిఎం స్పష్టం చేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన లక్ష మంది అత్యుత్తమ క్వాంటం కంప్యూటింగ్ నిపుణుల్ని తయారు చేయాలన్న లక్ష్యాన్ని ఇది సాకారం చేస్తోందని సిఎం స్పష్టం చేశారు. క్వాంటం రంగంలో దీర్ఘకాలిక పెట్టుబడులు, ఆవిష్కరణలు, పరిశోధనలకు ఎపిని గమ్య స్థానంగా ఇది మారుస్తుందని ఆయన ఆకాంక్షించారు. క్వాంటం కంప్యూటింగ్ స్కిల్లింగ్ కోర్సులో బంగారు, వెండి పతకాలు సాధించే నిపుణులను స్వయంగా సత్కరించేందుకు ఎదురు చూస్తుంటానని స్పష్టం చేశారు. భవిష్యత్తులో క్వాంటం రంగంలో వారే గ్లోబల్ లీడర్లుగా ఎదిగేందుకు ఆస్కారముందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు.

# వారిదంతా ఓట్ల రాజకీయం




### అధికారం కోసం చొరబాటుదారులను ప్రోత్సహిస్తున్నారు..

### అసోంలో వలసదారులతో స్థానికుల అస్తిత్వానికి ప్రమాదం

### కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించిన ప్రధాని మోడీ

**గువహటి, జనవరి 18:** కాంగ్రెస్ పార్టీ అంటే వార సత్వం.. ఓట్ల రాజకీయం.. ఆ పార్టీ ప్రతికూల రాజకీయాలను దేశ ప్రజలు తిరస్క రిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. అసోంలో అధికారం కోసం ఆ పార్టీ చొరబాటు దారులను ప్రోత్సహించిందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నో ఏళ్ల కాంగ్రెస్ పార్టీలో అసోంలో వారికి ఆశ్రయమిచ్చిందన్నారు. ఆ పార్టీ హయాంలో పెద్ద మొత్తంలో చొరబాటుదారులు రాష్ట్రంలోకి వచ్చారని, స్థానికుల భూములు ఆక్రమించుకున్నారు. అసోమీల సంస్కృతిపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో అసోం ప్రజల అస్థిత్వం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని తెలి పారు.

ఆదివారం అసోంలో కజిరంగ ఎలివేటెడ్ కారిడార్‌కు ప్రధాని మోడీ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బిజెపికి ప్రజల్లో మద్దతు పెరుగు తోందన్నారు. ప్రజల మొదటి ఎంపికగా తమ పార్టీ మారిందని తెలి పారు. ఓటర్లు సుపరి పాలన, అభివృద్ధిని కోరు కుంటున్నారని, బీహార్ ఎన్నికలు.. తిరువ నంతపురం, ముంబై స్థానిక ఎన్నికల్లో ఈ విషయం స్పష్టమైందని చెప్పారు.

దేశాన్ని ఎన్నో ఏళ్ల పాలించినప్పటికీ కాంగ్రెస్‌కు అభివృద్ధి అజెండా లేదని, అందువల్లే ఆ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టిందని ఆరోపించారు. అలాగే గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అసోంలో రైల్వే నెట్‌వర్క్‌లకు 'తక్కువ బడ్జెట్' కేటాయించడాన్ని తీవ్రంగా విమర్శించారు. "కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు, అసోం రైల్వే బడ్జెట్‌లో కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే పొందిందని, బిజెపి ప్రభుత్వం హయాంలో దీనిని ఏటా దాదాపు రూ. 10,000 కోట్లకు పెంచిందని, ఐదు రెట్లు ఎక్కువ" అని ఆయన అన్నారు. ఈ మెరుగైన పెట్టుబడి కొత్త రైలు మార్గాలు, డబ్లింగ్, విద్యుదీకరణ, రైల్వే సామర్థ్యం, ప్రయాణీకుల సౌకర్యాల పెరుగుదలతో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల అభివృద్ధికి దారితీసిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

కాలిబోర్ నుండి మూడు కొత్త రైలు సేవలను ప్రారంభించినట్లు ప్రధాని ప్రకటించారు, ఇది అసోం రైలు కనెక్టివిటీలో గణనీయమైన విస్తరణను సూచిస్తుందన్నారు.

వందే భారత్ స్లీపర్ రైలు గౌహతిని కోల్‌కతాకు అనుసంధానిస్తుందని, ఇది సుదూర ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా చేస్తుందని, రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లోని ముఖ్యమైన స్టేషన్లను కవర్ చేస్తాయని, లక్షలాది మంది ప్రయాణికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తుందని వివరించారు. రోడ్లు, రైల్వేలు, వాయుమార్గాలు, జలమార్గాల ద్వారా అసోంను అనుసం ధానించడానికి ఒకేసారి పనులు ప్రారంభమ య్యాయని ఆయన గుర్తించారు.



# ట్రంప్ తీరుపై యూరోప్ దేశాల అత్యవసర భేటీ

**బ్రస్సెల్స్, జనవరి 18:** గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో కలిపేసు కోవాలన్న తమ అభీష్టాన్ని వ్యతిరేకిస్తున్నాయని ఈయూ కూటమిలోని 8 దేశాలపై డొనాల్డ్ ట్రంప్ 10 శాతం టారిఫ్‌లు విధించారు. ఈ నిర్ణయాన్ని ఈయూ చీఫ్ లు తప్పుబట్టారు. ట్రంప్ బెదిరింపు సుంకాలపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తాజా పరిణామాల నేపథ్యం లో యురోపియన్ యూనియన్ (ఈయూ) దేశాల అత్య వసర భేటీకి పిలుపునిచ్చారు. ఈ మేరకు యురోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాండెర్ లాన్, యురో పియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా సం యుక్తంగా ఓ ప్రకటన జారీ చేశారు. ట్రంప్ ప్రతిపాదిత సుంకాలు సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈయూ- యూఎస్ సంబంధాలకు తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఇందులో వారు హెచ్చరించారు. పరస్పర సహకారం తప్పనిసరిగా మారిన పరిస్థితుల్లో ఈ ధోరణి ఇరువైపులా నష్టం చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాలు ట్రాన్స్ అట్లాంటిక్ సంబం ధాలను దెబ్బతీస్తాయని, వాణిజ్య అడ్డంకులకు ఊత మిస్తాయని చెప్పారు. యూరప్ ఐక్యంగా, సమన్వయంతో మరియు దాని సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవడానికి కట్టుబడి ఉంటుందంటూ ఈయూ చీఫ్ లు ట్వీట్ చేశారు. మిత్రదేశాలతో కలిసి డెన్మార్క్ ఇటీవల గ్రీన్‌ల్యాండ్‌లో నిర్వహించిన సైనిక విన్యాసాలను కూడా వారు సమర్థించారు. ఆర్కిటిక్ ప్రాంతంలో భద్రతను పెంచడమే ఈ విన్యాసం ఉద్దేశమని స్పష్టం చేశారు. ఇది ఏ దేశానికీ వ్యతిరేకం కాదని తెలిపారు. డెన్మార్క్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ చర్చల ప్రాముఖ్యతను ఈయూ గుర్తుచేసింది. ఈ విషయంపై ఉర్సులా వాండెర్ లాన్ ఎక్స్ లో స్పందిస్తూ ప్రాదేశిక సమగ్రత మరియు సార్వభౌమాధికారం అంతర్జాతీయ చట్టం యొక్క ప్రాథమిక సూత్రాలని చెప్పారు. ఇవి యూరప్ తో పాటు మొత్తం అంతర్జాతీయ సమాజానికి అవసరమన్నారు. నాటో ద్వారా ఆర్కిటిక్‌లో శాంతి మరియు భద్రతపై మా ఉమ్మడి అట్లాంటిక్ ఆసక్తిని మేము నిరంతరం నొక్కిచెప్పామని వాండెర్ లాన్ పేర్కొన్నారు.

# అప్పుల ఊబిలో విద్యుత్ సంస్థలు

### రూ.1,02,328 కోట్లకు చేరిన రుణాలు

### పంపిణీ సంస్థల నష్టాలు రూ.69,741 కోట్లు

### దేశంలోనే 6వ స్థానంలో రాష్ట్ర డిస్కంలు

హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త : తెలంగాణ విద్యుత్ సంస్థలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆర్థిక సంక్షోభంలో కొట్టు మిట్టాడు తున్నాయి. ముఖ్యంగా విద్యుత్తు పంపిణీ సంస్థల ఆర్థిక పరిస్థితి దయ నీయంగా తయారైంది. రాష్ట్ర విద్యుత్ సంస్థలు మొత్తం రూ.1,02,328 కోట్ల మేర రుణాలు చేశాయి. రుణాల్లో దేశంలోనే రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఆరో స్థానానికి చేరుకున్నాయి. ఈ రుణాల్లో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ వద్ద రూ.45,373 కోట్లు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.43,802 కోట్లు తీసుకోగా, బ్యాంకుల నుంచి రూ.13,153 కోట్లు చొప్పున రుణాలు తీసుకున్నాయి. ఇక దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్), ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్)లు విద్యుత్ కొనుగోలు నిమిత్తం రూ.53,101 కోట్ల రుణం తీసుకోగా, ప్రాజెక్టుల నిర్మాణాల కోసం తెలంగాణ జెన్‌కో 9.3 శాతం నుంచి 11.5 శాతం వార్షిక వడ్డీకి రూ.13,582.99 కోట్ల పీఎఫ్‌సీ టర్మ్‌లోన్, 9.311.15 శాతం వార్షిక వడ్డీతో ఆర్ఈసీ నుంచి రూ.17,010.95 కోట్ల రుణం తీసుకుంది. బ్యాంకుల నుంచి రూ.930.58 కోట్లు తీసుకుంది. ఈ విధంగా డిస్కమ్‌లు తీసుకున్న రుణాలను 2034-35 ఆర్థిక సంవత్సరానికి తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు రూ.59,230 కోట్ల అప్పుల్లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయంలో రూ.35,239 కోట్లు రుణాలు ఉండగా, 2024-25 నాటికి అవి రూ.59,230 కోట్లకు చేరుకున్నాయి. అలాగే నష్టాలను చూస్తే తెలంగాణలో విద్యుత్ పంపిణీ సంస్థలకు ఏటేటా నష్టాలు పెరుగుతున్నాయి. ఈ విధంగా 2024-25లో రూ. 69,741 కోట్లకు ఈ నష్టాలు చేరాయి.

మరోపక్క ప్రభుత్వ శాఖల నుండి విద్యుత్ పంపిణీ సంస్థలకు దాదాపు రూ.48 వేల కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. ఇలా అప్పులతోపాటు రావాల్సి న బకాయిలు కూడా పెరుగుతుండటంతో పంపిణీ సంస్థల్లో ఆర్థిక సంక్షోభం తలెత్తుతోంది.

# కోర్టు తీర్పు వచ్చాకే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి

### లేకుంటే సహించం, పెద్దఎత్తున ఉద్యమం

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక



అభివాదం తెలుపుతున్న ఆర్.కృష్ణయ్య, ర్యాగ అరుణ్‌కుమార్, నీల వెంకటేష్, సతీష్, రాజేందర్ తదితరులు

హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 18, ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల విషయంలో కోర్టులో తీర్పు రాకముందే మున్సి పల్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామ పంచాయితీ ఎన్నికలు జరపకపోతే కేంద్రం నుంచి వచ్చే మూడు వేల కోట్ల నిధుల గ్రాంట్ రాదని ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిందని, ఇప్పుడు మున్సి పల్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు నిర్వహించడానికి సన్నహాలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో 14 బిసి సంఘాల ఆధ్వర్యంలో సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. కోర్టు తీర్పు రాకుండా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తే సహించేది లేదని, రాష్ట్ర వ్యాపంగా ఆందోళనలు చేపడతామని, రాష్ట్రాన్ని స్తంభింప జేస్తామని, నిత్యావసరాలైన నీరు, విద్యుత్, రైళ్ళు, బస్‌లు బంద్ చేస్తామని ఆయన హెచ్చరించారు. న్యాయపరంగా, చట్టపరంగా, రాజ్యాంగ బద్దంగా కోర్టులో కేసు బిసిలకే బలంగా ఉందని, గెలవడానికి సర్వశక్తులతో పోరాడుతున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కేసును గెలిపించడానికి గట్టిగా ప్రయత్నం చేయకుండా ఎన్నికలకు తొందరపడటం ఎందుకని నీలదీశారు. అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్‌లు కల్పించినప్పుడు లేని సీలింగ్ బిసిలకు ఎందుకనా న్నరు. బిసిలకు 68 మున్సి పాలిటీలు రావాల్సి ఉండగా కేవలం 38 మాత్రమే కేటాయించి చేతులు దులుపుకునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నదని ఆరోపించారు. దీనిపైన ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ర్యాగ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలపై చిన్న చూపు చూస్తున్నదని, ఇప్పటి వరకు బిసిలకు కేటాయించిన నిధులు, పథకాలపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయించకపోతే మరోక ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి నేతలు నీల వెంకటేష్, పగిళ్ళ సతీష్, సి.రాజేందర్, అనంతయ్య, మోదీ రాందేవ్, మొగిలి కృష్ణయ్య, మొకపిక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌స్టా మోసాలు.. ఇద్దరు వ్లాగర్లపై కేసు నమోదు

### రూ. 399లకే కార్లు, ఐఫోన్లంటూ టిటిడి ఆలయం ముందు ప్రచారం

### పంజాగుట్ట పోలీసులకు కరాటే కళ్యాణి ఫిర్యాదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 18, ప్రభాతవార్త:** ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అక్రమ లాటరీలు, లక్కీ డ్రాల పేరుతో మోసానికి పాల్పడుతున్న ఇద్దరు వ్లాగర్లపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీఅదిభట్ల శ్రీ కళాపీఠం వ్యవస్థాపకురాలు, అధ్యక్షురాలు పదాల కళ్యాణి అలియాస్ కరాటే కళ్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 12న ఎల్లారెడ్డి గూడకు చెందిన కొందరు యువకులు క్రేజీబాయ్ నరేందర్, ప్రవీణ్ క్యాస పేరుతో ఉన్న ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల ద్వారా ప్రజలను మోసం చేస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. ఎల్లారెడ్డిగూడకు చెందిన పాషం మహేష్‌యాదవ్ అనే యువకుడు క్రేజీ బాయ్ నరేందర్ ఖాతాకు రూ. 399 చెల్లించారు. ప్రవీణ్ క్యాస, నరేందర్‌లు బిగ్గెస్ట్ లక్కీడ్రా పేరుతో రూ. 249 ఎంట్రీ ఫీజు వసూలు చేయడంతోపాటు ఫ్రిజ్, టీవీ, నాలుగు ఎలక్ట్రిక్ బైకులు, రూ. 5వేల నగదు బహుమతులు, గ్రాండ్ ప్రైజ్‌గా హ్యుందాయ్ కారు ఇవ్వనున్నట్లు ప్రచారం చేశారు. అతని ఇన్‌స్టా ఖాతాకు దాదాపు 1.22 లక్షల ఫాలోవర్లు సైతం ఉన్నారు. సిద్దమోని నరేందర్ తిరుమల టీటీడీ ఆలయం ముందు వీడియోలు తీసి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశాడు. అతను ఒక్కో వ్యక్తి నుంచి రూ. 399 వసూలు చేస్తూ ఫార్చ్యూనర్ కారు, ఐఫోన్ ఇస్తానంటూ మోసాలకు పాల్పడుతున్నాడు. ఈ వ్యవహారలను గుర్తించిన కళ్యాణి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఇద్దరిపై 318(4), ఐటీ చట్టంతోపాటు తెలంగాణ లాటరీల చట్టం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

# మౌని అమావాస్య రోజున భారీగా భక్తుల పవిత్రస్నానాలు



**ప్రయాగరాజ్, జనవరి 18:** మౌని అమావాస్య సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని త్రివేణి సంగమంలో లక్షలాదిగా భక్తులు పవిత్ర స్నానాలుచేసారు. ఆదివారం సెలవు కలిసి రావడంతో భక్తులు సుమారుగా 3.15 కోట్లమంది

## యుపిలోనే 3.15 కోట్లమంది భక్తుల రాక

వరకూ వచ్చినట్లు యుపి ప్రభుత్వం వెల్లడించింది. శనివారం అర్ధరాత్రి దాటినతర్వాతనుంచే భక్తులు ఘాట్‌లకు చేరుకోవడం కనిపించింది. దట్టమైన మంచు కప్పుకున్నప్పటికీ భక్తులు మాత్రం ఉదయం వేళల్లోనే ఎక్కువ స్నానాలు ఆచరించేందుకు చేరుకున్నారు. మాఘమేళా 2026 పేరిట జరిగిన ఈ రోజు పవిత్ర స్నానాలతో భక్తులు తమకు ఎంతో పుణ్యం లభిస్తుందని, పితృదేవతలకు క్రతువులు కూడా నిర్వహిస్తారు. యుపిలోని ప్రయాగరాజ్‌లో ఉన్న ఘాట్‌లు 3.5 కిలోమీటర్ల పొడవుతో ఉన్నాయి. భద్రతకోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సిసిటివి కెమేరాలు, డ్రోన్లసాయంతో నిఘాను కట్టుదిట్టంగా అమలుచేసారు. కాగా మౌని అమావాస్యకు ముందురోజే సుమారు 1.5 కోట్లమంది భక్తులు త్రివేణి సంగమంలో స్నానాలు చేసినట్లు తేలింది. అదేవిధంగా యుపిలోని గంగాఘాట్ లన్నింటివద్ద కూడా వేలాదిగా భక్తులు స్నానాలుచేసి మహాశివుని దర్శించుకుని తరించారు. మణికర్ణిక ఘాట్‌లో కూడా పితృదేవతలకు సత్కార్యాలు నిర్వహించడం కనిపించింది. అదేవిధంగా హర్యానా, ఉత్తరాఖండ్‌లోని దైవక్షేత్రాల ప్రాంతాల్లోని నదీఘాట్ల వద్ద కూడా భారీ ఎత్తున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. 45 రోజుల మాఘమేళాలో మౌని అమావాస్య అత్యంత పవిత్రమైన రోజుగా భక్తులుపరిగణించి పవిత్ర స్నానాలు ఆచరించేందుకు వస్తారు. సోమవారం తెల్లవారుఝాము రాత్రి 1.22 గంటలవరకూ కూడా భక్తులు స్నానాలకు తరలివస్తుంటారని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాల్లో కూడా భక్తులు నదీఘాట్‌ల వద్ద స్నానమాచరించి పితృదేవతలను స్మరించుకున్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సిద్ధం

### ఎన్నికల సంఘానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ

హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి: రాష్ట్రంలో మున్సి పల్ ఎన్నికల ప్రక్రియకు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. మున్సి పల్ ఎన్నికల నిర్వహణకు అనుమతి తెలుపుతూ స్పష్టతను ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, రిజర్వేషన్ల నివేదికను కూడా ఖరారు చేసి పంపినట్లు పేర్కొంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపిన నివేదికలో 121 మున్సి పాలిటీలు, 10 కార్పొరేషన్ల రిజర్వేషన్లు ఖరారు చేసిన వివరాలు ఉన్నాయి. ఈ రిజర్వేషన్ల ప్రకారం మున్సి పల్ ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థలలో మహిళలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు 50శాతం రిజర్వే షన్లు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయని, ఇకపై ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం మాత్రమే మిగిలిందని అధికార వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం 2,3 రోజుల్లోనే మున్సి పల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనుంది.



ఆదివారం ఎన్టీఆర్ వర్థంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఎపి మంత్రి నారా లోకేశ్ తదితరులు

## ఎన్టీఆర్‌కు ప్రముఖుల నివాళులు

### ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించిన ఎపి మంత్రి లోకేశ్, భువనేశ్వరి, బాలకృష్ణ, పురందేశ్వరి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 18:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎంపి పురందేశ్వరి, ఏపి సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకుని ఆయన సమాధిపై పూలమాలలు ఉంచి అంజలి ఘటించారు. లోకేశ్‌తోపాటు పెద్దఎత్తున తెలుగుదేశం పార్టీ నేతలు, అభిమానులు అక్కడికి తరలివచ్చారు. ఎన్టీఆర్ ఘాట్ వద్దకు సినీనటుడు కల్యాణ్‌రామ్ చేరుకుని నివాళులర్పించారు. మాజీమంత్రులు మోత్కుపల్లి నర్సింహులు, బాబూమోహన్ ఎన్టీఆర్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబసభ్యులతో పాటు అభిమానులు భారీఎత్తున ఘాట్ వద్దకు చేరుకొని పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘాట్‌ను పూలతో తీర్చి దిద్దారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవిత విశేషాలతో చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ సినీ, రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. మహానుభావులు కావాలంటే ఎంతో శ్రమ, దీక్ష అవసరమని అవి ఎన్టీఆర్‌లో ఉండేవన్నారు. సూర్యచంద్రులు ఉన్నన్నాళ్లూ ఆయన బతికే ఉంటారన్నారు. సినిమాల్లో ఎవరూ చేయని పాత్రలు ఎన్టీఆర్ చేశారని, ప్రతిపాత్రలోనూ పరకాయ ప్రవేశంతో నటనలో ఎన్నో ప్రయోగాలు చేశారని తెలిపారు. నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ తెలుగువారి గుండెచప్పుడు, కళామతల్లి ముద్దుబిడ్డ ఎన్టీఆర్ అని కొనియాడారు. సినీ, రాజకీయ రంగాల్లో ఆయన ఎన్నో సేవలు అందించారన్నారు. తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటారని చెప్పారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ఆ మహనీయుడికి ఘన నివాళులర్పించారు. పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు, బడుగుబలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించిన సమతావాది, స్త్రీలకు సాధికారతనిచ్చిన సంస్కర్త ఎన్టీఆర్ అని అచ్చెన్నాయుడు కొనియాడారు. ఎన్టీఆర్ ఆశించిన సమసమాజాన్ని సాధించుకుందామని ఆశాభావం వ్యక్తం చేశారు. నందమూరి లక్ష్మీపార్వతి ఎన్టీఆర్ ఘాట్‌కు వచ్చి నివాళులు అర్పించారు.

### బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

### నివాళులు అర్పించిన నందమూరి బాలకృష్ణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 18, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లోని బసవ తారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి, పరిశోధన సంస్థ (బీఐఏసి హెచ్ అండ్ ఆర్ఐ)లో ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలోని బసవతారకం దంపతుల విగ్రహాలకు ఆస్పత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం ఆరోగ్యశ్రీ వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కేన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులకు ఆట వస్తువులతోపాటు పుస్తకాలను అందించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి స్థాపనలో తన తండ్రి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని, మరింత ఎక్కువమంది కేన్సర్ బాధితులకు సేవలందించేలా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు జెఎస్ఆర్ ప్రసాద్, సిఇఒ డాక్టర్ కె. కృష్ణయ్య, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి.ఎస్.రావు, హెచ్ఒడి సెంథిల్ రాజప్ప, మెడికల్ అంకాలజీ విభాగ వైద్యులతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలల పనివేళలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి

### టిజి ఎస్ఎల్‌టిఎ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పనివేళలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎస్ఎల్‌టిఏ) డిమాండ్ చేసింది. పని వేళలను మార్చేలా చూడాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కె గౌరీ శంకర్ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వివిధ కాలాల్లో వాతావరణ ప్రభావం భిన్నంగా ఉండటమే కాక, వివిధ ప్రకృతి వైపరీత్యాల వలన ప్రతి ఒక్కరూ వత్తిడికి లోనవుతున్నారని అన్నారు. పాఠశాలలకు వెళ్ళే ఉపాధ్యాయులు ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయురాళ్లు ఇంటి పని చేసి, వారి కుటుంబ బాధ్యతలు నిర్వర్తించి వెళ్లే అంశాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లయితే ఉదయం పూట అరగంట వెసులుబాటు ఇస్తే వారికి మానసిక ఒత్తిడి నుండి వెసులుబాటు కలిగిస్తుందన్నారు. ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉంటేనే విద్యాప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. కాబట్టి ఉదయం పూట ప్రారంభ సమయంలో అరగంట పొడిగించి 9.30 లకు పాఠశాల ప్రారంభం అయ్యేలా చూడాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతుందన్నారు.

### వానకాలం మార్కెటింగ్ సీజన్ ముగిసినా

## పెండింగ్‌లోనే గత రబీ బోనస్

### రైతులకు రూ.1,159.64 కోట్లు బకాయిలు

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజను ముగుస్తుండగా, ప్రస్తుతం రబీ (యాసంగి) సీజన్ సాగు జోరుగా జరుగుతున్నా, 2025 రబీకి సంబంధించి ధాన్యం అమ్మిన అన్నదాతలకు బోనస్ సొమ్ము ఇంత వరకూ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించ లేదు. ఈ బోనస్ సొమ్ముల కోసం రాష్ట్రంలోని రైతాంగం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసి దాదాపు 10 నెలలు అయినా ఇంత వరకూ క్వింటాలుకు 500 రూపాయలు చొప్పున బోనస్‌ను రైతులకు చెల్లించకుండా పెండింగ్ పెట్టింది. యాసంగి సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా 74.23 లక్షల టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. ఇందులో సన్న రకానికి చెందిన ధాన్యం దాదాపు 23.20 లక్షల టన్నులను సేకరించింది. ఇందుకు సంబంధించి 4.09 లక్షల మంది రైతులకు రూ.1159.64 కోట్లు బోనస్ కింద చెల్లించాల్సి ఉన్నా, ఇప్పటికీ నయాపైసా ఇవ్వలేదు. మరోపక్క ప్రస్తుత ఖరీఫ్ సీజను ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కాగా, గత యాసంగిలో అమ్మిన ధాన్యానికే దిక్కులేదని పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజనులో 67.33 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడగా, తద్వారా 80 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా. ఇందులో 62 శాతం మేర సన్న రకాలను రైతులు సాగు చేశారు. ఈ నేపథ్యంలో వానాకాలం సీజనులో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతుల నుండి 70.82 లక్షల టన్నులను కొనుగోలు చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ ధాన్యాన్ని = 8,448 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించింది. ఇందులో అత్యధికంగా సన్న రకాలకు చెందిన ధాన్యం కావడం విశేషం. ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల టన్నుల ధాన్యంలో 32.45 లక్షల టన్నుల ధాన్యం దొడ్డు రకానికి చెందినవే ఉన్నాయి. మిగిలిన 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలు కొనుగోలు చేయడం జరిగింది. ఇందుకు గాను క్వింటాలుకు రూ.500 బోనస్ నిమిత్తం రైతాంగాం ఖాతాలో ఇప్పటి వరకు 1,425 కోట్లు జమ చేసినట్లు తెలిపాయి. అయితే గత రబీ సీజనుకు సంబంధించిన సన్నాల బోనస్‌ను ఇంత వరకూ ఖాతాల్లో జమ చేయకుండా పెండింగ్‌లో పెట్టడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

### ఇప్పటి వరకూ 6.45 లక్షల ఎకరాల్లో సాగు

## యాసంగిలో భారీగా మొక్కజొన్న

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత యాసంగి సీజనులో మొక్కజొన్న పంట విస్తీర్ణం భారీగా పెరుగుతోంది. యాసంగి సీజన్‌లో తెలంగాణలో 6.45 లక్షల ఎకరాల సాధారణ విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకూ 6.70 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. ప్రధానంగా రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో 1.34 లక్షల ఎకరాల్లో, నాగర్‌కర్నూల్ 68 వేల ఎకరాలు, వరంగల్ 61వేల ఎకరాలు, కొత్తగూడెం 50 వేల ఎకరాలు, మహబూబాబాద్ 49 వేల ఎకరాలు, నిర్మల్ 43 వేల ఎకరాలు, నిజామాబాద్ 32 వేల ఎకరాలు, జగిత్యాల 30 వేల ఎకరాలు, గద్వాల 29 వేల ఎకరాలు, కామారెడ్డి జిల్లాలో 27 వేల ఎకరాల్లో రైతాంగం మొక్కజొన్న సాగు నమోదైంది. ఈ విధంగా పెరిగితే సీజను ముగిసే నాటికి ఈ విస్తీర్ణం 10 లక్షల ఎకరాలు దాటే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు వల్ల మార్కెట్లో శనగలు, అపరాలు, కందుల ధరలు పడిపోయాయి. మరోపక్క పొగాకు సాగుపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో యాసంగిలో ఏ పైరు వేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. కష్టపడి పంటలు పండించినా గిట్టుబాటు ధర లభిస్తుందా లేదా అనేదానిపై భయపడుతున్నారు. మొక్కజొన్నకు మాత్రమే గత ఏడాది మద్దతు ధర లభించింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగు చేస్తుండగా, అందరూ ఈ ఒక్క పంటే ఎక్కువగా పండించడంతో పంట మార్కెట్‌లోకి వచ్చే సమయానికి మద్దతు ధర ఏ విధంగా ఉంటుందనేదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వేరుశనగ సాగు చేద్దామనుకున్నా ఈ పంటకూ మార్కెట్లో ధర లేదు. మినుములు, పెసర సాగు చేసినా పంట చేతికి వచ్చిన తర్వాత కనీస మద్దతు ధర దక్కుతుందా అన్న సందేహం వ్యక్తం అవుతోంది. దీంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టిసారించారు. యాసంగి సీజన్ ప్రారంభంలోనే ఇంత పెద్ద ఎత్తున మక్కల సాగు షురూ కావడంతో సీజన్ ముగిసే నాటికి ఈయేడు మక్కల సాగు రికార్డులు సృష్టించనుందని ప్రభుత్వ గణాంకాలతో స్పష్టమవుతోంది.

## ఒటిఆర్‌లో అదనపు సమాచారాన్ని అప్‌లోడ్ చేసుకోవాలి

### ఎస్సీ వర్గీకరణను అభ్యర్థులు అప్‌డేట్ చేయాలి
### లేటెస్ట్ కలర్‌ఫొటో కూడా ఇవ్వాలి
### నేటి నుంచి ఫిబ్రవరి 9 వరకు అవకాశం
### వెబ్ నోటిఫికేషన్ జారీ చేసిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి)లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్(ఒటిఆర్)లో మార్పులు చేర్పులు ఉంటే వెంటనే కమిషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ నిరుద్యోగ అభ్యర్థులకు సూచించింది. ఒటిఆర్ అప్‌డేట్‌ను నేటి(సోమవారం) నుంచి వచ్చే నెల ఫిబ్రవరి 9వరకు చేసుకోవాలని వెబ్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అమలు చేస్తున్నందున.. ఎస్సీ అభ్యర్థులు తమ ఎస్సీ వర్గీకరణ వివరాలను తప్పకుండా ఒటిఆర్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది.

అలాగే అభ్యర్థులు గత ఒటిఆర్ తరువాత వారి విద్యార్హత(క్వాలిఫికేషన్) పెరిగి ఉంటే అందుకు సంబంధించిన క్వాలిఫికేషన్‌ను అప్‌డేట్ చేసి వాటికి సంబంధించిన పత్రాలను అప్‌లోడ్ చేయాలని సూచించింది.

దీంతోపాటు అభ్యర్థులు తమ లేటెస్ట్ కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫోటోను అప్‌లోడ్ చేయాలని పేర్కొంది. రాబోయే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ల నేపథ్యంలో అభ్యర్థుల వివరాలను సరిచూసుకోవడానికి ఈ అవకాశం కల్పించినట్టు కమిషన్ కార్యదర్శి వెబ్ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. అభ్యర్థికి సంబంధించిన చిరునామాలో మార్పు ఉన్నా, ఈడబ్ల్యూఎస్ వివరాలు, నాన్ క్రీమిలేయర్ వివరాలు, మొబైల్ నంబర్ మార్పు, ఈ-మెయిల్ ఐడీలో మార్పు ఉంటే వాటిని సరిచేసుకోడానికి ఒటిఆర్‌ను ఉపయోగించుకోవాలని కమిషన్ వెబ్ నోటిఫికేషన్‌లో సూచించింది. ఇవి కాకుండా ఇతర వివరాలను మార్చడానికి ఒటిఆర్‌లో అవకాశం లేదని కమిసన్ స్పష్టం చేసింది.

అభ్యర్థులు ఇపుడు సమర్పించే ఒటిఆర్ వివరాలనే భవిష్యత్తులో ఉద్యోగ దరఖాస్తులకు ప్రాథమిక సమాచారంగా పరిగణిస్తారని.. కాబట్టి ఒటిఆర్‌లో వివరాలను జాగ్రత్తగా పూర్తి చేయాలని కమిషన్ వెబ్ నోటిఫికేషన్‌లో సూచించింది.

### విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా..

## దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలి

### అఖిల భారత విద్యుత్ ఇంజనీర్ల సమాఖ్య

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని అఖిల భారత విద్యుత్ ఇంజనీర్ల సమాఖ్య పిలుపునిచ్చింది. విద్యుత్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమాఖ్య విజ్ఞప్తి చేసింది. కోల్‌కతాలో చైర్మన్ శైలేంద్ర దూబే అధ్యక్షత ఆదివారం జరిగిన సమాఖ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రైతులు, పేద వినియోగదారుల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ఆపి, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ ప్రయోజనం కోసం, విద్యుత్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన విద్యుత్ (సవరణ) బిల్లు 2025ను తక్షణమే ఉపసంహరించుకోవడం అత్యవసరమని తీర్మానించింది. రైతులు మరియు వినియోగదారులతో కలిసి సంయుక్త వేదికను ఏర్పాటు చేసి, విద్యుత్ కార్మికులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విస్తృత ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. తమ సొంత ప్రయోజనాల దృష్ట్యా విద్యుత్ కార్మికుల ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని మరియు ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపడంలో విద్యుత్ ఉద్యోగులకు అండగా నిలవాలని సమాఖ్య సాధారణ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. సీనియర్ కార్యనిర్వాహక అధికారులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఐదుసార్లు విద్యుత్ (సవరణ) బిల్లును ప్రవేశపెట్టిందని సమాఖ్య పేర్కొంది. విద్యుత్ ఇంజనీర్లు, విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారుల నుండి బలమైన ప్రతిఘటన కారణంగా దానిని ఆమోదించలేకపోయారని తెలిపింది.

## కెజిబివి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

### కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి
### ప్రభుత్వానికి టిఎస్ యుటిఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని టిఎస్ యుటిఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రెండు దశాబ్దాలుగా నామమాత్రపు వేతనాలతో కేజీబీవీల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్ధాంతరంగా మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్రాంతి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమైన శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి వద్ద జరిగిన కారు ప్రమాదంలో జిల్లా పరిషత్ హై స్కూలు ప్రధానోపాధ్యాయిని గీతారెడ్డితోపాటు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కల్పన మరణించారు.

వారి మరణం పట్ల టిఎస్ యుటిఎఫ్ తీవ్రసంతాపం ప్రకటిస్తుందన్నారు. మరణించిన ఇరువురు ఒకేరకమైన విధులు నిర్వహిస్తున్నారని, మరణం ఒకటే అయినా కుటుంబాలకు అందే మరణానంతర ప్రయోజనాల్లో మాత్రం తీవ్రవ్యత్యాసం ఉందన్నారు. కేజీబీవీల్లో పనిచేసే ఉద్యోగులు ఎంతకాలం పనిచేసినా వారికి నెలవారీ ఇచ్చే వేతనం మినహా ఏరకమైన ప్రయోజనాలు లేవని, ఆ వేతనం కూడా పనికి సమానమైన వేతనం కాదన్నారు. అనారోగ్యానికి గురైనా, అర్థాంతరంగా మరణించినా ఎటువంటి పరిహారం చెల్లించడం లేదని, కనీసం మట్టి ఖర్చులు కూడా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. శనివారం రోడ్డు ప్రమాదంలో మరణించిన కల్పన కుటుంబం కడు పేదరికంలో ఉన్నదని, పిల్లలు చదువుకుంటున్నారని, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, పిల్లల చదువులకు ఆటంకం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి సర్వీసులో ఉండగా మరణించిన కేజీబీవీ ఉద్యోగి కుటుంబానికి కనీసం రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో అర్హులైన ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలన్నారు. కేజీబీవీ ఉద్యోగుల ఉద్యోగానికి భద్రత కల్పించాలని, సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని చావ రవి, ఎ వెంకట్ ఆదివారం డిమాండ్ చేశారు.



ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి

## ప్రజాభిప్రాయం మేరకే మున్సిపాలిటీల విభజనపై నిర్ణయం తీసుకోవాలి

### రంగారెడ్డి జిల్లాను ఎంఐఎంకు అప్పజెప్పేలా కాంగ్రెస్ కుట్ర: ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 18:** రంగారెడ్డి జిల్లాను సగం ఎంఐఎంకు అప్పజెప్పేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బిజెపి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అందులో భాగంగానే ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా మున్సిపాలిటీల విభజన చేస్తున్నారని ఎంపీ మండిపడ్డారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రంగారెడ్డి చుట్టు పక్కల ఉన్న గ్రామాలను చార్మినార్‌లో కలపడం వెనక పెద్ద కుట్ర దాగుందని చెప్పుకొచ్చారు. పాత బస్తీలో ఎవరూ కరెంట్ బిల్లులు, వాటర్ బిల్లులు కట్టరని.. అలాంటి వారితో రంగారెడ్డి ప్రజలను ఎందుకు కలుపుతున్నారంటూ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి సంపద మొత్తం గతంలో కేసీఆర్ గల్లాపెట్టెలోకి వెళ్లిందని.. ఇప్పుడు ఎంఐఎం ఇలాకాలోకి వెళ్తుందని చెప్పుకొచ్చారు. రంగారెడ్డి జిల్లాను ముక్కలు చేయొద్దని.. చార్మినార్‌లో రంగారెడ్డిని కలిపితే ఇక్కడి ప్రజల జీవితాలు ఆగమవుతాయంటూ పేర్కొన్నారు. హైదరాబాద్‌కు ఆర్థిక వనరు రంగారెడ్డి జిల్లా ఖజానా అంతా నాడు కెసిఆర్ ఫామ్ హౌస్‌కు తరలిపోయింది. నేడు ఎంఐఎం ఇలాకాలోకి పంపేందుకు ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో వచ్చే నెల నుండి అల్పాహారం

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఉదయం పౌష్టికరమైన అల్పాహార పథకాన్ని ప్రారంభించేందుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. బాలల ఆరోగ్యమే ప్రధానంగా ఈ అల్పాహార కార్యక్రమాన్ని అమలు చేయనుంది. ఆ శాఖ అధికారవర్గాల వివరాలు ప్రకారం ఈ పథకాన్ని తొలుత హైదరాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించనుంది. ముఖ్యంగా సికింద్రాబాద్, ఖైరతాబాద్, నాంపల్లి, చార్మినార్, గోల్కొండ ప్రాంతాల పరిధిలోని 970 అంగన్వాడీ కేంద్రాల్లో ఈ అల్పాహార పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ కేంద్రాల్లోని 15 వేల మంది పిల్లలకు ప్రతి రోజూ పౌష్టికాహారాన్ని అల్పాహారం రూపంలో అందిస్తారు. వీటి ఫలితాలు ఆధారంగా తదుపరి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 35,781 అంగన్వాడీ కేంద్రాల్లోని దాదాపు 8లక్షల మంది పిల్లలకు ఈ పథకాన్ని విస్తరించనున్నారు.

## మేధావులు, విద్యావంతులు బిజెపిలో చేరాలి

### పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పిలుపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 18:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సమక్షంలో ప్రముఖ డాక్టర్ సాయిచంద్ భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో చదువుకున్నవారు, మేధావులు, విద్యావంతులు ముందుకు రావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. గతంలో రాజకీయాలంటే కేవలం డబ్బున్నవారో, అంగబలం లేదా క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారో మాత్రమే వస్తారని భావించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోందన్నారు. దేశాన్ని కాపాడగల నాయకుడు ఎవరు? దేశ సమస్యలను పరిష్కరించగల పార్టీ ఏది? దేశద్రోహ శక్తులు ఎందుకు పెరుగుతున్నాయి? వాటిని ఎలా ఎదుర్కోవాలి? ఈ ప్రశ్నలపై యువతలో స్పష్టమైన ఆలోచన పెరిగిందని ఆయన అన్నారు. దేశవిరోధి శక్తులను ఎదుర్కోవాలంటే దేశాన్ని ప్రేమించే, సమాజం పట్ల బాధ్యత కలిగిన చదువుకున్నవారు కూడా ఒక సంఘటిత శక్తిగా మారాల్సిన అవసరం ఉంది. అందుకే నేడు మేధావులు, విద్యావంతులు రాజకీయాల్లోకి రావడం ఒక సానుకూలమైన, ఆశాజనకమైన పరిణామంగా దేశం చూస్తోందన్నారు. ఇటీవలి కాలంలో యువ నాయకులు, విద్యావంతులు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా భారతీయ జనతా పార్టీలో చేరుతూ దేశసేవలో భాగస్వాములు అవుతున్నారని పేర్కొన్నారు. బీహార్‌లో అతి తక్కువ వయసులో ఎమ్మెల్యేగా గెలిచిన యువ నాయకులు కూడా బీజేపీలో చేరడం..రాజకీయాల్లోకి వస్తున్న నూతన తరానికి స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న రెండు ప్రధాన పార్టీలు ప్రజలకు విధానాలు చూపించలేక, బూతుల రాజకీయాలతోనే కాలం గడుపుతున్నాయి. ఒకరు ప్యాంట్ విప్పుతా అంటారు, మరొకరు తోలు తీస్తా అంటారు. ఈ రకమైన భాష, ఈ రకమైన రాజకీయాలు రాబోయే తరానికి తీవ్రంగా ప్రమాదకరమైనవన్నారు. రాజకీయాలు అంటే వ్యక్తిగత దూషణలు కాదు, కొట్టుకోవడాలు కాదు. రాజకీయాలకు ఒక గౌరవం ఉండాలి, ఒక విలువ ఉండాలి. ప్రజల సమస్యలపై మాట్లాడే పరిపక్వత ఉండాలి. ఆ మార్పు రావాలంటే మేధావులు, చదువుకున్నవారు రాజకీయాల్లోకి రావాల్సిందే అని పిలుపునిచ్చారు. రాజకీయాల్లోకి రావడం అంటే అందరికీ టికెట్లు ఇవ్వడమే కాదు. దేశం పట్ల, సమాజం పట్ల బాధ్యత, సామాజిక స్పృహ, రాజకీయ అవగాహన ఉంటే అటువంటి వారి భాగస్వామ్యం దేశ నిర్మాణానికి తప్పకుండా ఉపయోగ పడుతుందన్నారు. దేశాన్ని శక్తివంతంగా చేయాలంటే, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే, భారత్‌ను ఒక జాతీయ శక్తిగా నిలబెట్టాలంటే మేధావులు భారతీయ జనతా పార్టీకి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కర్ణాటకలో కూడా బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తుంది. దేశం మొత్తం క్రమంగా కాషాయం వైపు సాగుతోంది. ఈ మార్పునకు నాంది పలకాల్సింది మేధావులే. తెలంగాణ రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు తీసుకురావాల్సిన బాధ్యత మీ అందరిదే అని చెప్పారు. చేరిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు బిజెపి రంగా రెడ్డి(పట్టణ) జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాసరెడ్డి, మేడ్చల్(పట్టణ) జిల్లా కన్వీనర్ డాక్టర్ మల్లారెడ్డి, మాధవరం కాంతారావు, డా. రాజశేఖర్ రెడ్డి,, మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజ్ గారు, తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులు ఏకం కావాలి

### ఎంసిపిఐ(యు) పొలిట్‌బ్యూరో విస్తృత సమావేశం పిలుపు




సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంసిపిఐ (యు) జాతీయ నేతలు మద్దికాయల అశోక్ ఓంకార్, కుల్దీప్‌సింగ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జనవరి 18, ప్రభాతవార్త :** అంతర్జాతీయ, జాతీయ పరిస్థితుల నేపథ్యంలో నేడు ప్రపంచ వ్యాప్తంగా, దేశంలో కమ్యూనిస్టు వామపక్ష శక్తుల ఏకీకరణ కావాల్సిన చారిత్రక నేపథ్యం ఏర్పడింది అని యంసిపిఐ (యు) జాతీయ నేతలు మద్దికాయల అశోక్ ఓంకార్. కుల్దీప్‌సింగ్ పిలుపునిచ్చారు. బాగ్ లింగంపల్లి ఓంకార్ భవన్‌లో రెండు రోజులపాటు ఎంసిపిఐ (యు) పొలిట్ బ్యూరో విస్తృత సమావేశం కుల్దీప్ సింగ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. 2018 నుంచి కొన్ని స్వల్ప భిన్నాభిప్రాయాలు కలిగి వేరువేరు ఆర్గనైజేషన్‌గా పనిచేసిన పార్టీ ఈ సమావేశంలో ఒకే ఆర్గనైజేషన్‌గా ఏర్పడాలని, ఇందులో భాగంగా ఫిబ్రవరి 23 ,24 తేదీలలో రాజస్థాన్ రాష్ట్రం జోద్ పూర్ లో ఆలిండియా ఐక్య కన్వెన్షన్ నిర్వహించాలని ఈ కన్వెన్షన్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బీహార్ పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, రాజస్తాన్, కేరళ, తమిళ నాడు రాష్ట్రాల నుంచి 200 మంది ప్రతినిధులను సమావేశం ఎంపిక చేసింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టు వామపక్ష శక్తులను ఏకీకరణ చేసే పనిని వేగవంతం చేయాలని వర్గ, సామాజిక ప్రజా పోరాటాల ను బలోపేతం చేయడం ద్వారా దేశంలో మనువాద ఫాసిస్టు కార్పోరేట్ ఆర్థిక నియంతృత్వ శక్తులను ఓడించాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు వామపక్ష శక్తుల ఐక్యత ఏకైక మార్గం అని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశం లో యంసిపిఐ (యు) జాతీయ నేతలు గాదగోని రవి వల్లెపు ఉపెందర్ రెడ్డి,తెలంగాణ, కిరణ్ జిత్ సింగ్ షెఖాన్, ప్రేం సింగ్ భంగ్ పంజాబ్, కాటం నాగభూషణం ఆంధ్రప్రదేశ్, అనుభవ్‌దాస్, ఉత్తర ప్రదేశ్, రాంపాల్ షైనీ, మహేందర్ నేహా, నదీం ఖాన్ రాజస్థాన్, భూప్ నారాయణసింగ్, మనో రంజన్ ఠాకూర్ బీహార్, డెన్నిస్, దామోదర్ ఉన్ని కృష్ణన్ పొట్టి కేరళ పాల్గొన్నారు.

## దివ్యాంగుడైన కొడుకు గొంతుకోసి చంపి తండ్రి ఆత్మహత్య

**జన్నారం, జనవరి 18, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రాంపూర్‌లో కొడుకుని చంపి తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామానికి చెందిన పాలగాని భూమయ్య (45) ఆర్థిక ఇబ్బందులకు తోడు కొడుకు అనారోగ్యంతో మనస్తాపం చెంది కొడుకు కార్తిక్ (10)ను కత్తితో గొంతుకోసి అనంతరం అదే కత్తితో తన గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జన్నారం మండలం రాంపూర్‌కు చెందిన పాలగాని భూమయ్య కు భార్య స్వరూప, ఇద్దరు కూతుళ్లు వర్షిత, లాస్య, కుమారుడు కార్తీక్ ఉన్నారు. భూమయ్య వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.



భూమయ్య (ఫైల్)

కుమారుడు కార్తీక్ పుట్టుకతో అంగవైకల్యంతో (వికలాంగుడు, మూగ, చెవుడు) జన్మించాడు. అలాగే భూమయ్య కూడా రెండేళ్లుగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడు తున్నారు. ఇటు తన ఆరోగ్యం, అంగవైకల్యంతో ఉన్న కుమారుడిని చూసుకోవడం భారంగా భావించి మానసిక ఒత్తిడికి గురయ్యారు. ఆదివారం భార్య స్వరూప పొలంపనికి వెళ్లడంతో ఇంట్లో ఇద్దరు కూతుళ్లు, కుమారుడు, తల్లి మాత్రమే ఉన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు తన కుమారుడి గొంతు కోసి అదే కత్తితో తన గొంతు కోసుకుని ఆత్మహత్య చేసు కున్నారు. మృతుడి పెద్ద కుమార్తె వర్ష ఈ ఘటనను గమనించి తల్లికి సమాచారం అందించింది. భార్య స్వరూప ఇంటికి వచ్చి చూడగా ఇద్దరూ రక్తపు మడుగులో మరణించి ఉన్నారు. భర్త అనారోగ్యం, అలాగే కుటుంబ పరిస్థితుల వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య ఇచ్చిన వివరాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపారు.



## ఉన్నట్టుండి ఏడుస్తున్నారా?

పసిపిల్లలు విద్రలో ఉన్నట్టుండి ఏడుస్తుంటారు. అసలు వాళ్లు ఎందుకు ఏడుస్తున్నారో తెలియక కొత్తగా తల్లైనవారు కంగారు పడుతుంటారు. అయితే నెలలు నిండుతున్న పిల్లలు రాత్రుళ్లు ఏడవడానికి సెపరేషన్ యాంగ్జైట్ ఒక కారణమంటు న్నారు నిపుణులు. అదేంటి? దాన్ని ఎలా అధిగమించాలంటే... 6 నుంచీ 10 నెలల వయసున్న పిల్లలు నెమ్మదిగా చుట్టూ ఉన్న వాతావరణాన్నీ మనుషుల్నీ గుర్తుపట్టడం ప్రారంభిస్తారు. వాళ్ల అలనాపాలనా చూసుకునే తల్లిని అంటిపెట్టుకుని ఉండాలను కుంటారు. వాళ్లు కనపడకపోతే ఏడుస్తారు. అదే రాత్రుళ్లు నిద్రలోనూ గుర్తొస్తుందట. అందుకే ఉన్నట్టుండి ఉలిక్కిపడటం, ఏడవడం చేస్తుంటారు. దీన్నే సెపరేషన్ యాంగ్జైటీ అంటారు. అయితే ఇది పసిపిల్లల్లో సర్వసాధారణం. కంగారుపడ కుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల్ని పెద్దవాళ్లకు నెమ్మదిగా అలవాటు చేయాలి. రోజులో కాసేపైనా కనిపించకుండా ఉండాలి. బయటకు వెళ్లొస్తుండాలి. అలాఅని వాళ్లు నిద్రపోయేట ప్పుడో, మిమ్మల్ని గమనించకుండా ఆడుకునేటప్పుడో కాదు. అలా చేయడం వల్ల నిద్రలేచేటప్పటికి మీరు లేకపోతే వారిలో ప్రతికూల భావాలు ఏర్పడతాయి. అవే వాళ్లలో భయాన్నీ పెంచుతాయి. మీరు బయటకు వెళ్తున్నారు. తిరిగి వచ్చేప్పటికి కొంత సమయం పడుతుంది అన్న భావన వాళ్లలో కలిగేలా బయలుదేరాలి. అప్పుడే వారికి ఆ పరిస్థితి అర్థమవుతుంది. ఈ ఆందోళనా దూరమవుతుంది. అయితే ఇది నెలల పిల్లల్లోనే కాదు మూడేళ్ల వయసు వచ్చేవరకూ ఉంటుంది. అందుకే గృహిణులైనా, ఉద్యోగినులైనా పిల్లలతో కాసేపయినా ఎడబాటుగా ఉండటం మంచిదంటున్నారు నిపుణులు. □

## పరిశుభ్రతకు పండ్ల తొక్కలు !



విటమిన్లు పుష్కలంగా ఉండే పండ్లు ఆరోగ్య పరిరక్షణకే కాదు, ఇంటి పరిశుభ్రతనే. పనిచేస్తాయని తెలుసా అయితే ఈ మాయ చేసేది మాత్రం వాటి తొక్కలు, సాధా రణంగా ఇంటి క్రిమింగ్‌లో రసాయనాల ద్రావణా లను వినియోగించి రకరకాల అలర్జీలకు గురి అవు తుంటాం. ఇవి వాటి నుంచి మనల్ని కాపాడటమే కాదు... పర్యావరణానికి హాని కలిగించవు. అదెలాంటే...

నిమ్మ, నారింజ పండ్లలో సిట్రిక్ యాసిడ్ పుష్కలం. దీంతో వీటి తొక్కలు క్లీనింగ్ ఏజెంట్‌గా మురికిని ఇట్టే పోగడతాయి. ఈ పండ్ల తొక్కలను గుప్పెడు తీసుకుని ఓ ప్లాస్టిక్ పాత్రలో వేయాలి. ఇందులో అయిదారు చెంచాల వైట్ వెనిగర్ వేసి బాగా కలిపి మూత పెట్టాలి. ఈ మిశ్రమాన్ని రెండు లేదా మూడువారాలు నాననివ్వాలి. ఆ తర్వాత దీన్ని వడకట్టి సమపాళ్లలో నీటిని కలిపితే అల్ర్పర్సస్ క్లీన సిద్ధమవు తుంది. దీన్ని స్ప్రేబాటిల్లో నింపి తలుపులు, కిటికీలు, టీపాయి అద్దాలు, పొయ్యి చుట్టుపక్కల దిమ్మ వంటింట్లోని సింక్ వంటివాటిపై స్ప్రేచేసి పదినిమిషాల తర్వాతతుడిస్తే చాలు. మురికి దూరమవుతుంది.

**అద్దాలకు ప్రత్యేకం...** అరటిపండు తొక్క అద్దాలకు ప్రత్యేక క్లీనర్గా పనిచేస్తుంది. మురికి ఉన్న చోట ఈ పండు తొక్క లోపలివైపుతో మృదువుగా రుద్దాలి. ఆ తర్వాత మెత్తని వస్త్రంతో తుడిస్తే చాలు. ఈ తొక్కలోని స్టార్చ్ మురికిని, మచ్చలను తొలగిస్తుంది.

**మైక్రోవేవ్ అవెన్‌ను..** ఇందులో ఆహారపదార్థాల అవశేషాలు ఉండిపోయి వేడికి ఎండిపోతాయి. వాటిని సాధారణంగా క్లీన్ చేయడం కష్టమవుతుంది. గుప్పెడు నిమ్మతొక్కల ముక్కలను నీటిని నింపిన బౌల్లో వేసి అయిదు నిమిషాలపాటు మైక్రోవేవ్లో ఉంచి వేడి చేయాలి. నిమ్మరసం ఆవిరి లోపలంతా వ్యాప్తి చెందుతుంది. ఆపై మెత్తని వస్త్రంతో తుడిస్తే చాలు ఎండిపోయి అవెన్కి పట్టేసిన పదార్థాలన్నింటినీ తేలికగా తుడిచేయొచ్చు.

**ఫర్నిచర్ :** సోఫా, టీపాయి, డైనింగ్ టేబుల్‌వంటి చెక్క ఫర్నిచర్‌పై దుమ్ము ఎక్కువగా పేరుకుంటుంది. క్రమేణా ఇది మరకలుగా మారుతుంది. కొన్నిసార్లు నూనె జిడ్డు అంటుకుని ఎంత శుభ్రం చేసినా పోదు. ఇటువంటి మరకలను దూరం చేయడానికి పండ్ల తొక్కలు చాలు. నారింజ, నిమ్మ లేదా అరటి పండు తొక్క లోపలివైపుతో మరకలున్న చోట మృదువుగా రుద్ది, ఆపై మెత్తని వస్త్రంతో తుడిస్తే చాఉ. ఆ ప్రాంత మంతా క్షణాల్లో శుభ్రపడు తుంది. □



మినాతి

## కేన్సర్ బాధితులకు సేవలు అందిస్తూ..

విధి, అనారోగ్యం... ఈ విష యంలో అడుగడుగునా పోరాడు తూనే ఉన్నారామె. అయినా వెనుదిరగ లేదు. పైగా దేశవిదేశాల్లో తనలాంటి వాళ్లలో స్ఫూర్తినీ ధైర్యాన్నీ నింపుతున్నారు... మినతి బోర్రా కూర్! ఇంతకీ ఎవరీమె? ఆమె ప్రయాణమేంటో తెలుసుకుందాం..

కడుపులో నొప్పి. మొదట మామూలుగానే మొదలైంది. తరవాత తీవ్రమైంది. కానీ రిసెర్చ్ కారణంగా చికిత్సకు సమ యం కేటాయించలేని పరిస్థితి. ఒకానొకరోజు తట్టుకోలేక పోయారు. అప్పుడు ఆసుపత్రికి వెళ్తే... క్యాన్సర్ అని తేలింది. అది కాలేయం, ఊపిరితిత్తులు, పాంక్రియాస్, పాకింది. దీంతో ముంబయి లోని టాటా హాస్పిటల్‌లో చేర్చారు. బతక డం కష్టమే అన్నారు వైద్యులు. కానీ ఆమె మనసు లో ఒకే ప్రశ్న 'ఇలా వదిలేసి ఊరుకోవడమేనా!' అని, తనవంతుగా బతకడానికే ప్రయ త్నించాలి అనుకున్నారామె. దానికితోడు భర్త నికుంజ్ బిహారి బోర్రాకూర్ కూడా ఆమెతో క్యాన్సర్‌ని జయించిన వారి జీవితాల పుస్తకాలను చదివేవారు. వాళ్ల స్ఫూర్తితో పట్టుదలగా ప్రయత్నించారామె. సర్జరీ, రేడియేషన్ల కారణంగా జుట్టు ఊడిపోయింది. రోజంతా వాంతులు, విరేచనాలు... బక్కచిక్కి పోయారు. అయినా పోషకాహారం తీసుకుంటూ యోగా, ప్రాణాయా మం కొనసాగిస్తూ మానసికంగా దృఢంగా మారారు. ఆమె ధైర్యానికి క్యాన్సర్ తలవంచక తప్పలేదు. ఇదంతా 1994 నాటి మాట.

**పిల్లలను కోల్పోయి...** మినతిది అసోంలోని గువాహటి. విధితో పోరాటం ఆమెకు కొత్తేమీ కాదు. చిన్న వయసులోనే పెళ్లి, ముగ్గురు పిల్లలు. కానీ ఆర్హైచ్ డిసీజ్ కారణంగా వెంటవెంటనే చనిపోయారు. ఆ బాధ తట్టుకోవ డం ఆమెకు చాలా కష్టమైంది. దాన్నుంచి బయటపడటానికి చదువు మీద దృష్టిపెట్టారు. చదువుకున్న కాటన్ కాలేజీలోనే ప్రొఫెసర్‌గా చేసి, ఫిలాసఫీ ఉన్నత స్థాయికి ఎదిగారు. ఈ క్రమంలోనే ఎన్నో రిసెర్చ్ పేపర్లు రాశారామె. ఉద్యోగం కొనసాగిస్తూనే క్యాన్సర్ బాధితులకు ఉచితంగా కౌన్సెలింగ్, ఇతర సాయాలు చేయడం మొదలుపెట్టారు. కౌన్సెలింగ్, మెడిటేషన్ సెంటర్‌ని ఏర్పాటు చేశారు. తన ఏడాది క్యాన్సర్ చికిత్స అను భవాలను మోర్ ఒషూకోర్ ఎబోసర్: ఎజోన్ క్యాన్సర్ రోగి ఒబిగోటా (రోగిగా ఏడాది క్యాన్సర్ బాదితురాలిగా నా అను భవాలు) అంటే పుస్తక రూపంలో తీసుకొచ్చారు.

**రెండో యుద్ధం...** 2009... అనారోగ్యానికి గురైన భర్తకి సేవలు అందిస్తూ మినతి విపరీతమైననొప్పి. పరీక్ష చేయించుకుంటే క్యాన్సర్ తిరగబెట్టింది... ఈసారి పెల్విక్, వెన్నెముక ప్రాంతాల్లో వచ్చింది. మినతి భయపడలేదు. కానీ ఆమె భర్త ఒత్తిడికి గురయ్యారు. దాంతో గుండెపోటుకు గురై మరణిం చారు. అప్పుడు డీలాపడ్డారు మినతి. ఆయన లేని లోటును తట్టుకోలేకపోయారు. తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యారు. అప్పుడు తనలాంటి వాళ్ల గురించి ఆలోచించిన మినాతి తిరిగి పోరాటం మొదలుపెట్టారు. ఈసారీ గెలిచారు. ఆ ప్రయాణాన్ని 'కొలిజా కైతే బిందిలే ఇ చోరాయే గాన్ గాయే' (హృదయానికి ముల్లు గుచ్చుకున్న పక్షి పాడే పాట) పేరుతో పుస్తకంగా తీసుకొచ్చారు. కేన్సర్ బాధితులకు డైట్, న్యూటిషన్, ప్రాణాయామం, ధైర్యంగా సమస్యతో పోరాడటం.. ఇలా ఎన్నో అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు. తన సేవల్ని శ్రీలంక, అమెరికా, ఆస్ట్రేలియా సహా24 దేశాలకు విస్తరించారు. □

## శివ నామం

రామకోటి కోటిసార్లు 'శ్రీరామ' అని రాస్తే ఎంతో పుణ్యమని, మోక్షం లభిస్తుందని విష్ణు భక్తులు ,శివకేశవులను సమానంగా చూసేవారు నమ్ముతారు . శైవులు కైవల్యాన్ని పొందడానికి రామకోటికిబదులుగా శివకోటిని రాస్తారు . రామ నామం తరింపజేసేదని కాశీలో మరణించేవారి చెవిలో శివుడు ఆ తారక మంత్రాన్ని వినిపిస్తాడని చెబుతూ ఉంటారు . ఆ రామ నామానికి ఎటు వంటి శక్తి ఉందో శివనామానికి కూడా అంత మహిమ ఉందంటారు .శివనామం అంటే ఒక్క 'శివ'అనే నామం ఒక్కటే కాదు . శివునికి చాలా నామాలున్నాయి. వాటిల్లో



దేనిని ఉచ్చరించినా పాపాలు నశిస్తాయని చెబుతారు . సామాన్య పాపాలేకాదు మహాపాపాలు కూడా నశిసా యంటారు . శివనామ మహిమ అంత గొప్పది. నిశ్చలమైన మనస్సుతో దేవదేవు డైన పరమేశ్వరుడిని స్తుతిస్తూ , స్మరిం చేవారికి ఎలాంటి ఆపదలు రావని, తన భక్తుల రక్షణ ఆయనేచూసు కుంటాడని భక్తుల విశ్వాసం .

-కాయల నాగేంద్ర,

## చాడీలు వద్దు !



ఎంత ప్రాణ స్నేహితులైనా.. అప్పుడప్పుడూ వారి మధ్యా చిన్న చిన్న అపార్థాలు చోటుచేసు కుంటాయి. అయితే ఈ క్రమంలో కొంతమంది ఈ గొడవలు గురించి ఇతర స్నేహితులతో పంచు కోవడం, వారి గురించి నెగెటివ్‌గా చెప్పడం, లేనిపోని చాడీలు చెప్పడం.. వంటివిచేస్తుంటారు. గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకోవడమంటే ఇదే అంటున్నారు నిపుణులు. దీనివల్ల మీ గురించి, మీ స్నేహం గురించి అవతలి వారికి నెగెటివ్ అభిప్రాయం ఏర్పడుతుంది. అలాగే మీ ప్రాణ స్నేహితురాలికీ మీపై ఉన్న సదభిప్రాయం దెబ్బతింటుంది. ఫలితంగా గొడవలు మరింత పెద్దవవుతాయి. మీ మధ్య స్నేహబంధమూ సన్నగిల్లుతుంది. ఇన్ని సమస్యలు కొనితెచ్చు కోవడం కంటే ఓపికతో మీరిద్దరే గొడవల్ని సామరస్యంగా పరిష్కరించుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. తద్వారా మీ స్నేహబంధమూ మరింత దృఢమవు తుందని చెబుతున్నారు. □

## ఒత్తిడిని తరిమే గులాబీ టీ !



పనిఒత్తిడి తీవ్రంగా ఉన్నప్పుడు ఉపశమనాన్ని అందిస్తుందీ గులాబీరేకల టీ. తయారీకి మూడు కప్పుల పాలు, మూడు స్పూన్ల చొప్పున టీపొడి, చక్కెర, మూడు యాలకులు, ఒక అనాసపువ్వు, సమానపాళ్లలో నీటిలో నానబెట్టి మెత్తగా చేసిన జీడిపప్పు, బాదంపప్పు పేస్టు పావుకప్పు, అలాగే రెండు టేబుల్ స్పూన్లు నీటిలో నానబెట్టి చేసిన గులాబీరేకల పేస్టు.రెండు కప్పుల నీటిలో టీపొడి, గులాబీరేకుల పేస్టు కలపాలి. ఆపై అనాసపువ్వు, యాలకులు వేసి చిక్కగా మరిగించి డికాక్షన్‌ను వడకట్టాలి. మరొక గిన్నెలో పాలు, చక్కెర కలిపి మరిగిస్తూ బాదం, జీడిపప్పుల పేస్టు కలపాలి. ఇందులో డికాక్షన్ వేసి అయిదు నిమిషాలపాటు మరిగిస్తే చాలు. పోషకాలతో కూడిన రుచికరమైన ఛాయ్ సిద్ధం. గులాబీ రేకల్లో పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్స్ శరీరంలోని ఫ్రీ ఆక్సిజన్ రాడికల్స్‌ను తొలగిం చడంలో సహాయపడు తుంది. దీన్లోని ఎ,సి విటమిన్లు వ్యాధి నిరోధకశక్తిని పెంచు తాయి. వీటిలో ఉండే ఫ్లేవనాయిడ్స్ నాడీవ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. దీనితో ఒత్తిడి, ఆందోళనలను దూరం చేసి సుఖనిద్రనిస్తాయి. □

# తెర

## 'పెద్ది' 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పాన్ఇండియా మూవీ 'పెద్ది' త్వరలోనే బిగ్ షెడ్యూల్ ప్రారంభం మార్చి 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ మోస్ట్ ఎవైటెడ్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే ఈ చిత్రం బిగ్ షెడ్యూల్ ప్రారంభం కాబోతోంది. ఈ షెడ్యూల్ కోసం రామ్ చరణ్ ప్రత్యేకంగా సిద్ధమవుతున్నారు. తాజాగా విడుదలైన స్టిల్‌లో రామ్ చరణ్ బీస్ట్ మోడ్ లో కనిపించడం అదిరిపోయింది. రాక్ సాలిడ్ మసిల్స్, ఇంటెన్స్‌గా కనిపించిన లుక్ క్షణాల్లో వైరల్ అయ్యింది. పెద్ది ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి ఐదు భాషలలో 200 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టింది. ఎఆర్ రెహమాన్ మ్యూజిక్, రామ్‌చరణ్ వైరల్ డ్యాన్స్‌తో ఈ సాంగ్ గ్లోబల్ మూమెంట్‌గా మారింది. త్వరలోనే మరో పాటని రిలీజ్ చేయబోతున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రి మూవీ మేకర్స్ గర్వంగా సమర్పించిన ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్. మార్చి 27న పెద్ది గ్రాండ్ పాన్ ఇండియా థియేట్రికల్ రిలీజ్ కాబోతుందని మేకర్స్ మరోసారి అనౌన్స్ చేశారు.

## వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో హారర్ -కామెడీ ఫిలిమ్



వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ, యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్, ఎస్ థమన్ -విటి 15 టైటిల్ గ్లింప్స్ జనవరి 19న రిలీజ్‌మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ -విటి 15, టాలెంటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్‌లో, యువి కియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో గ్రాండ్‌గా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబధించి మేకర్స్ ఎక్సయిటింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా టైటిల్, గ్లింప్స్ జనవరి 19న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్, ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌గా ఉండబోతోంది. హారర్-కామెడీ, ఇండియన్ కొరియన్ బ్యాక్డ్రాప్, యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్. సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్ - థమన్ కాంబో మరోసారి అదరగొట్టే ఆల్బమ్ ఇవ్వబోతోంది.

## ప్రేక్షక మహాశయులకు కృతజ్ఞతలు: రవితేజ



మాస్ మహారాజా రవితేజ సంక్రాంతి బ్లాక్ బస్టర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో డింపుల్ హయతి, ఆశికా రంగనాథ్ కథానాయిక లుగా నటించారు. జనవరి 13న గ్రాండ్‌గా విడుదలైన ఈ సినిమా సంక్రాంతి బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని హౌస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సంక్రాంతి బ్లాక్‌బస్టర్ మీట్ నిర్వ హించారు. బ్లాక్ బస్టర్ మీట్ లోమాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ, అందరికీ హాయ్. చాలా హ్యాపీగా ఉంది. ఆర్ డైరెక్టర్ ప్రకాష్, డిఓపి ప్రసాద్‌తో ఎన్నో ఏళ్ళుగా వర్క్ చేస్తున్నాను. వాళ్ళతో కలిసి మరోసారి పనిచేయడం ఎంత ఆనందాన్నిచ్చింది. ప్రసాద్ సినిమాని చాలా కలర్‌ఫుల్‌గా తీశారు. మురళీధర్ గౌడ్ అద్భుతంగా చేశారు. తన జోక్స్‌కి థియేటర్స్‌లో చాలా ఎంజాయ్ చేస్తున్నారు. డైరెక్టర్ కిషోర్ తిరుమల మాట్లాడుతూ, అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఈ సినిమాకి ఇంత పెద్ద విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షక మహాశయులందరికీ థాంక్యూ. థియేటర్ విజిట్స్‌కి వెళ్ళాను. నాన్ స్టాప్‌గా నవ్వుతున్నారు. ప్రతి క్యారెక్టర్‌ని ఎంజాయ్ చేస్తున్నారు. ఫన్ చాలా ఆర్గానిక్ అని ఉందని చెప్తుంటే చాలా ఆనందంగా అనిపించింది. రవితేజ లాంటి పెద్ద హీరోతో సినిమా చేస్తున్నప్పుడు ప్రతి క్రాఫ్ట్‌ని ఎలా హ్యాండిల్ చేయాలనే ఒక టెన్సన్ ఉండేది. అయితే రవితేజ ఎంతో అద్భుతంగా సపోర్ట్ చేశారు ఒకటి దర్శకుడుగా మరో అడుగు ముందుకు వెళ్ళ గలిగాను. మాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన రవితేజకి నిర్మాత సుధాకర్‌కి ధన్య వాదాలు. ఆ టెక్నీ షియన్స్ అందరికీ థాంక్స్. డింపుల్ ఆశికా సునీల్‌కిషోర్ సత్య అన్ని పాత్రలు కూడా హిలేరియస్‌గా వచ్చాయి. అందరూ థియేటర్‌కి వెళ్ళండి. కచ్చితంగా సినిమా చూసి ఎంజాయ్ చేస్తారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ, సంక్రాంతికి అద్భుతమైన బ్లాక్బస్టర్ ఇచ్చిన ఆడియన్స్ అందరికీ కృతజ్ఞతలు. ఇంత కాంపిటీషన్లో కూడా పెద్ద హిట్ ఇచ్చినందుకు తెలుగు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఇంకా చూడని వారు ఉంటే తప్పకుండా థియేటర్స్‌కి వెళ్లి చూడండి. ఫుల్ ఎంటర్టైన్మెంట్. మా హీరో రవితేజకి డైరెక్టర్ కిషోర్‌కి అలాగే వెన్నెల కిషోర్‌కి సునీల్ అన్నకి అందరికీ థాంక్స్. సునీల్ మాట్లాడుతూ, అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఇంత అద్భుతంగా ఆదరించిన ప్రేక్షకులు అందరికీ కృతజ్ఞతలు అని అన్నారు.

## 5వ రోజు ఆల్‌టైమ్ రికార్డ్ 226 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్



మెగాస్టార్ చిరంజీవి హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు' ఈ సంక్రాంతి సీజన్‌లో బాక్సాఫీస్ వద్ద రికార్డులు క్రియేట్ చేస్తోంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం థియేటర్లను పండుగ వేడుకలుగా మార్చింది. తెలుగు రాష్ట్రాలలో భారీగా ఫ్యామిలీ ఆడియన్స్‌ని అలరిస్తోంది. 'మన శంకరవరప్రసాద్ గారు' 5వ రోజు ఏపీ/తెలంగాణలో పెద్ద సంఖ్యలో వసూళ్లు సాధించింది, గత రికార్డును బద్దలు కొట్టింది. పరిశ్రమలో అత్యధిక 5వ రోజు వసూళ్లు సాధించిన చిత్రంగా మన శంకర వరప్రసాద్ సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. కేవలం ఐదు రోజుల్లో 2.5 మిలియన్లకు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి, ప్రపంచ వ్యాప్తంగా 226రూ.కోట్లు వసూళ్లు సాధించింది. ఆరవ, ఏడవ రోజు నెంబర్స్ కూడా భారీగా ఉండబోతున్నాయి. అద్భుతమైన మౌత్ టాక్‌తో థియేటర్లు హౌస్‌ఫుల్ షోలతో సందడి చేస్తున్నాయి.

## 23న విజయ్, సమంతల సినిమా 'పోలీస్' రీ రిలీజ్



స్టార్ హీరో విజయ్, టాప్ హీరోయిన్ సమంతజంటగా, సెన్సేషనల్ డైరెక్టర్అట్లీ దర్శకత్వంలోవిక్రియేషన్స్ పతాకంపై కలైపులి థానునిర్మించిన తమిళ చిత్రం'తెరి'ఘనవిజయం సాధించింది. తెలుగులో' పోలీస్' పేరుతో అనువాదమై ప్రేక్షకులహృదయాలను దోచుకుని సూపర్‌హిట్‌చిత్రంలా నిలిచింది .ఈచిత్రం మరోసారి వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమైంది.

ఈ 'పోలీస్' చిత్రం ఈనెల 23న రీరిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని నైజాం ప్రాంతంలో ప్రముఖ పంపిణీ సంస్థ ఏషియన్ ఫిలిమ్స్ వారు, ఆంధ్రాలో సురేష్ మూవీస్ వారు భారీస్థాయిలో విడుదల చేస్తున్నారు. ఇప్పటికే రీరిలీజ్ వార్తతో సోషల్ మీడియాలో భారీ స్పందన వస్తుండగా, విజయ్ అభిమానులతోపాటు సినిమాప్రేమికులు మరోసారి ఈఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను థియేటర్లలో చూసేందుకు ఆసక్తిగాఎదురు చూస్తున్నారు. తండ్రి-కూతురు అనుబంధం, పోలీస్‌బ్యాక్‌డ్రాప్, భావోద్వేగాలు, యాక్షన్, కమర్షియల్‌ఎలిమెంట్స్‌ను సమపాళ్లలో మేళవించి అట్లీ ఈ 'పోలీస్'చిత్రాన్ని రూపొందించారు. విజయ్ ద్విపాత్రాభినయంలో మెప్పించగా, సమంతపాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే మరో హీరోయిన్‌గా అమీ జాక్సన్ నటించారు. ప్రభు, రాధికశరత్‌కుమార్‌పాత్రలు కూడాఈచిత్రానికికీలకం. ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాలు, భావోద్వేగ క్షణాలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. ఈచిత్రానికి సంగీతం అందించిన జీవీ ప్రకాష్ కుమార్ పాటలు అప్పట్లోచార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి. నేపథ్యసంగీతం, సినిమాటోగ్రఫీ, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించడంలో కీలకపాత్ర పోషించాయి. ఈ 'పోలీస్' విజయ్‌కు తెలుగులో కూడా బలమైన అభిమాన వర్గాన్ని మరింత పెంచింది. ఇప్పుడు ఆధునిక సాంకేతికతతో మెరుగైన క్వాలిటీతో రీరిలీజ్ అవుతున్న ఈ చిత్రం మరోసారి బాక్సాఫీస్‌వద్ద తనసత్తా చాటుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్, సమంతల అభిమానులకు ఇది నిజంగా ఒక తీపి వార్త.

## స్పెషల్ మూమెంట్‌గా వస్తోన్న 'యుఫోరియా' సినిమా

బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ గుణ శేఖర్ రూపొందించిన లేటెస్ట్ మూవీ ,యుఫోరియా'. శ్రీమతి రాగిణి గుణ సమర్పణలో గుణహ్యాండ్ మేడ్ ఫిల్మ్ బ్యానర్‌పై నీలిమ గుణ, యుక్తా గుణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నూతన నటీనటులతో గుణశేఖర్ నేటి యూత్‌కి, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి కనెక్ట్ అయ్యేలా వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పోలీస్ కమిషనర్ జయదేవ్ నాయర్‌గా ప్రముఖ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ కేసును ఛేదించే క్రమంలో ఆయన. పోక్సో'చట్టాన్ని ఎలా ప్రయోగించారు? ఆధారాలను ఎలా సేకరించారు? అనే అంశాలను గుణశేఖర్ ఎంతో సహజంగా తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. నటుడు విఘ్నేష్ గవిరెడ్డి మాట్లాడుతూ,మ్యూజిక్ చాలా బాగుంది. నేను కాలభైరవ ఫ్యాన్. నా సినిమా ఆయన సంగీతం ఇవ్వడం నాకు చాలా గర్వంగా ఉంది. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ, ట్రైలర్ చూశాక చాలా ఎమోషన్‌గా అనిపించింది. ఇంత ఇంపాక్ట్ ఉన్న సినిమాను తీసినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది ప్రతి ఒక్కరికీ తప్పకుండా నచ్చుతుంది. అని చెప్పారు. సీనియర్ నటి భూమిక మాట్లాడుతూ,యుఫోరియా నాకు చాలా స్పెషల్ జర్నీ. 23ఏళ్ల తర్వాత గుణశేఖర్‌తో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. ఆయన ఫ్యామిలీ ఈ సినిమా కోసం 24 గంటలూ కష్టపడి పని చేశారు. ఇది నా కెరీర్‌లోనే స్పెషల్ సినిమా అవుతుంది. బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ గుణశేఖర్ మాట్లాడుతూ,మా అమ్మాయి నీలిమా ఎప్పుడూ ఇంత ఎమోషన్ అవదు. కానీ ఇప్పుడు ట్రైలర్ చూసి ఎమోషన్ అయిందంటే.. ఈ కథ అంతగా ఇంపాక్ట్ చేసింది. మా కుటుంబం మొత్తం ఈ స్టోరీకి కనెక్ట్ అయింది. అలాగే మీ అందరికీ ఈ సినిమా ఎమోషన్ కనెక్ట్ అవుతుంది.



ఆట

## వరల్డ్ టేబుల్ టెన్నిస్ నుంచి మనికా నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ 2026, స్టార్ కంటెండర్ దోహా ప్రీక్వార్టర్ ఫైనల్‌లో భారత స్టార్ ప్యాడ్లర్ మానికా బాత్రా ఓటమితో భారత్ ప్రచారం ముగిసింది. రౌండ్ ఆఫ్ 16కి అర్హత సాధించిన ఏకైక భారతీయురాలు మనికా రికార్డు సృష్టించినా ఫైనల్లో పరాజయంతో టోర్నీ నుండి నిష్క్రమించింది. ఖతార్‌లో జరిగిన మకావోకు చెందిన జు యులింగ్ చేతిలో ఓడిపోయింది. కేవలం 23 నిమిషాల పాటు కొనసాగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 5వ నంబర్ క్రీడాకారిణి యులింగ్ చేతిలో 6-11, 5-11, 9-11 తేడాతో ఓడిపోయింది. అంతకుముందు, ఆమె చైనాకు చెందిన ప్రస్తుత అండర్19 ప్రపంచ ఛాంపియన్ యుజువాన్ క్విన్, దక్షి ణ కొరియాకు చెందిన 16వ సీడ్ లీ యున్హ్వాపై రెండు మంచి విజయాలు సాధించి మనికా చివరి 16లోకి చేరుకుంది.

ప్రారంభం నుండి ఆమెపై ఝూ పూర్తిగా ఆధిపత్యం చెలాయించింది. దీంతో మొదటి రెండు ఆటల నుండి కేవలం 11 పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. మూడవ గేమ్‌లో బలంగా ఆడి 9-6 ఆధిక్యాన్ని సాధించింది. కానీ ఆ తర్వాత ఆమె తన జోరును కోల్పోయి వరుసగా ఐదు పాయింట్లను కోల్పోయింది. అంతకుముందు, ప్రధాన డ్రాలో ఉన్న మరో ముగ్గురు భారత మహిళల సింగిల్స్ క్రీడాకారిణులు అయిహికా ముఖర్జీ, స్వస్తిక ఘోష్, తనీషా కోటేచ్ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్‌లో, సత్యన్ జ్ఞానశేఖరన్, మనుష్ షా, మానవ్ ఠక్కర్ ప్రధాన డ్రాలో పోటీ పడ్డా, వారు 64వ రౌండ్‌లో ఓటమితో నిష్క్రమించారు.

## హాకీ ఇండియా లీగ్‌లో హైదరాబాద్ జట్టు గెలుపు

### 6-0తో బెంగాల్ టైగర్స్ చిత్తు



**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ఇండియా లీగ్-2026 టోర్నీలో బెంగాల్ టైగర్స్‌పై 6-0 తేడాతో హైదరాబాద్ టూఫాన్స్ ఆధిక్యంలో ప్రారంభించింది. హైదరాబాద్ తరఫున జాకరీ వాలెస్ (2వ నిముషం, 17, 30), టిమ్ బ్రాండ్ (12, 39, 46) హ్యాట్రిక్ సాధించారు. తొలి క్వార్టర్‌లోనే రెండో నిమిషంలోనే హైదరాబాద్ గోల్ చేయడం ప్రారంభించింది. టిమ్ బ్రాండ్ (12) ఆధిక్యాన్ని పెంచాడు. 16వ నిమిషంలో హైదరాబాద్ టూఫాన్స్ రెండవ క్వార్టర్‌లో తమ గోల్ పరంపరను కొనసాగించింది. 19వ నిమిషంలో అభిషేక్ బెంగాల్‌కు మంచి అవకాశాన్ని సృష్టించాడు. అతను గోల్‌పై బలమైన షాట్ కొట్టినా దాన్ని హైదరాబాద్ గోల్ కీపర్ బిక్రమ్‌జిత్ సింగ్ ఆపాడు. మొదటి అర్ధభాగం ముగియడానికి 20 సెకన్లు మిగిలి ఉండగా టూఫాన్స్ మరో గోల్ చేసింది. మూడవ క్వార్టర్ రెండు జట్ల మధ్య గట్టి పోటీతో ప్రారంభమైంది. అయితే, హైదరాబాద్ తమ ఐదవ గోల్ చేయడానికి ఎక్కువ సమయం పట్టలేదు. 39వ నిమిషంలో అర్షదీప్ సింగ్ బేస్‌లైన్ వెంట అద్భుతమైన నైపుణ్యాలను ప్రదర్శించాడు. నాల్గవ క్వార్టర్ మొదటి నిమిషంలోనే హైదరాబాద్ టూఫాన్స్ జట్టు ఆరో గోల్ చేసింది. టిమ్ బ్రాండ్ (46) తన హ్యాట్రిక్ పూర్తి చేసుకున్నాడు. ఆట చివరిలో బెంగాల్ వరుసగా పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకున్నా, నాలుగు క్వార్టర్లలో అగ్రస్థానంలో ఉన్న టూఫాన్స్ రక్షణను ఛేదించలేకపోయారు.



## టీమిండియా నుంచి సుందర్ ఔట్

### ఈ ప్లేస్‌కు ప్లేయర్ల క్యూ

**న్యూఢిల్లీ:** టి20 ప్రపంచకప్-2026కు సమయం దగ్గరపడుతుండటంతో టీం ఇండియాలో స్థానాల కోసం పోటీ తీవ్రమైంది. జట్టులో నిలకడగా రాణించని ఆటగాళ్లను తప్పించి, టీ20 ఫార్మాట్‌కు సరిపోయే ఇంపాక్ట్ ప్లేయర్లను తీసుకోవాలని సెలక్టర్లు భావిస్తున్నారు. ప్రపంచ కప్ వంటి మెగా టోర్నీలో యునివర్సల్ ఆల్‌రౌండర్ పాత్ర చాలా కీలకం. ముఖ్యంగా ఆల్‌రౌండర్ కోటాలో వాషింగ్టన్ సుందర్ పవర్‌ప్లేలో పొదుపుగా బౌలింగ్ చేయగలిగినా బ్యాటింగ్‌లో ఫినిషర్‌గా ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. టీ20లో లోయర్ ఆర్డర్‌లో భారీ సిక్సర్లు బాదే ఆటగాడు భారత్‌కు అవసరం. సుందర్ స్థానంలో రియాన్ పరాగ్ ప్రస్తుతం అత్యంత అనుకూలమైన పోటీదారునిగా ఉన్నాడు. సుందర్ లాగే, రియాన్ కూడా స్పిన్ ఆల్ రౌండర్. అయితే అతను కూడా ఆఫ్‌బ్రేక్ బౌలర్. బౌలింగ్‌తో పాటు, అద్భుతమైన బ్యాటింగ్, అద్భుతమైన ఫీల్డింగ్. ఇందులో అతను సుందర్‌నే కాకుండా ఇతర పోటీదారులందరినీ అధిగమించాడు. ఎడమచేతి వాటం స్పిన్ ఆల్ రౌండర్ షాబాజ్ అహ్మద్ ఇటీవలే టీం ఇండియాకు ఎంపికయ్యాడు. కానీ అతనికి అవకాశం రాలేదు. వరుసగా 2022, 2023లో భారత్ తరపున వన్డే, టీ20లలో అరంగేట్రం చేశాడు. ఇటీవల సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలలో ఈ ఆల్ రౌండర్ బ్యాట్, బంతి రెండింటిలోనూ అద్భుతమైన ప్రదర్శన చేశాడు. అలాగే సుందర్ వన్డే సిరీస్ నుంచి తప్పుకున్న తర్వాత, సెలెక్టర్లు మొదట ఢిల్లీ కెప్టెన్ ఆయుష్ బదోనీని జట్టులోకి తీసుకున్నారు. ఆల్ రౌండర్‌కు టీం ఇండియా నుంచి పిలుపు రావడం ఇదే తొలిసారి. సుందర్, పరాగ్ లాగానే, అతను ఆఫ్ స్పిన్నర్, మిడిల్ ఆర్డర్‌లో లేదా ఫినిషర్‌గా పేలవంగా ఆడగలడు.

ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో అతని సామర్థ్యాలు ప్రదర్శించబడ్డాయి. ఇక నితీష్‌కుమార్ మీడియం పేసర్ ఆల్ రౌండర్ అయినప్పటికీ, అతను కొంతకాలంగా జట్టులో స్థిరంగా ఉన్నాడు. అతని ప్రదర్శన కూడా ప్రశ్నార్థకంగా ఉన్నప్పటికీ, ప్రతిభ, భారత పరిస్థితులపై అవగాహన అనుకూలంగా ఉన్నప్పటికీ ఎంపికయ్యే అవకాశాలు చాలా తక్కువ. ఇక కృనాల్ పాండ్యా టీం ఇండియా నుంచి తొలగించబడిన తర్వాత తిరిగి జట్టులోకి రాలేకపోయాడు. భారత్ తరపున 19 టీ20లు, 5 వన్డేలు ఆడిన ఎడమచేతి వాటం స్పిన్నర్, ఆల్ రౌండర్ అయిన కృనాల్ 2021 నుంచి ఆటకు దూరంగా ఉన్నాడు. అయితే, దేశీయ క్రికెట్, ఐపీఎల్‌లో అతని ఇటీవలి ప్రదర్శనలు ప్రశంసనీయం. బరోడాకు కెప్టెన్‌గా ఉండగా, ముష్తాక్ అలీ ట్రోఫీలో అతను జట్టుకు అసాధారణంగా మంచి ప్రదర్శన ఇచ్చాడు.

## హర్యానా థండర్స్ హ్యాట్రిక్

### ప్రో రెజ్లింగ్ లీగ్‌లో 6-3 తేడాతో దంగల్ వారియర్స్ ఓటమి



**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్ 2026, 5వ మ్యాచ్‌లో ఢిల్లీ దంగల్ వారియర్స్‌పై 6-3 తేడాతో హర్యానా థండర్స్ విజయంతో ఆరంభాన్ని కొనసాగించింది. తొలి మ్యాచ్ నుంచే ఊపు మీదున్న హర్యానా ఈ మ్యాచ్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. ఢిల్లీ దంగల్ వారియర్స్ కఠినమైన పోరాటాన్ని ప్రదర్శించి విలువైన పాయింట్లు సేకరించినప్పటికీ, హర్యానా జట్టు బహుళ వెయిట్ కేటగిరీలలో చాలా బలంగా ఉంది. మహిళల 76 కిలోల బౌట్‌తో హోరాహోరీగా జరిగిన ఈ టైలో కాజల్ 6-5తో అనస్తాసియాను ఓడించి హర్యానాకు తొలి ఆధిక్యాన్ని ఇచ్చింది. ఆ తర్వాత పురుషుల 57 కిలోల విభాగంలో అంకుష్ తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు, శుభమ్‌పై 13-3 తేడాతో అద్భుతమైన విజయాన్ని నమోదు చేసి హర్యానా ఆధిక్యాన్ని పెంచాడు. మహిళల 53 కిలోల బౌట్‌లో యుయి సుసాకి సంచలనాత్మక వేగంతో సారికాను కేవలం 57 సెకన్లలో 16-0తో ఓడించింది. ఆమె ఉత్కంఠభరితమైన ప్రదర్శన ఆమెకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సంపాదించిపెట్టింది. పురుషుల 125 కిలోల విభాగంలో అనిరుధ్ గులియా 13-0తో రోనక్ దహియాను ఓడించడంతో హర్యానా తన పట్టును మరింత పటిష్టం చేసుకుంది. మహిళల 57 కిలోల విభాగంలో నేహా సంగ్వాన్ మరో ఆధిపత్య ప్రదర్శనతో, కార్లా గొడినెజ్‌ను 18-2 తేడాతో ఓడించి హర్యానాను మరింత బలోపేతం చేసింది. పురుషుల 65 కిలోల విభాగంలో సుజీత్ కల్కల్ 2-1తో తుముర్ తుల్గాను ఓడించడం ద్వారా ఢిల్లీ దంగల్ వారియర్స్ కొంత ఉపశమనం పొందింది. పురుషుల 74 కిలోల విభాగంలో పర్వీందర్ సింగ్‌పై 8-0 తేడాతో విజయం సాధించి ఢిల్లీ తరపున తురాన్ బయ్‌రామోవ్ కూడా ఆకట్టుకున్నాడు, తద్వారా టై పోటీని కొనసాగించాడు. అయితే, మహిళల 62 కిలోల బౌట్‌లో ఇరినా కొలియాడెంకో అంజలిపై 13-0 తేడాతో సమగ్ర విజయం సాధించడంతో హర్యానా పోటీని నిర్ణయాత్మకంగా ముగించింది.



## ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రౌండ్ 2లోకి పావోలిని, సక్కారి

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్-2026 తొలి రౌండ్‌లో జాస్మిన్ పావోలిని, మరియా సక్కారి ఆధిక్యం సంపాదించారు. మెల్‌బోర్న్‌లోని రాడ్ లావర్ అరీనాలో ఆదివారం జరిగిన టోర్నమెంట్‌లో పావోలిని వరుస సెట్ల తేడాతో విజయం సాధించి ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టింది. ఈ మ్యాచ్‌లో ఏడో సీడ్ ఇటాలియన్ బెలారసియన్ క్వాలిఫైయర్ అలియాక్సాండ్రా సాస్నోవిచ్‌ను 6-1, 6-2 తేడాతో ఓడించింది. 30 ఏళ్ల ఆమె ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి, కేవలం 10 నిమిషాల్లోనే 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆమె మొదటి సెట్‌ను 26 నిమిషాల్లోనే కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో సాస్నోవిచ్ మరింత ప్రతిఘటనను ప్రదర్శించినప్పటికీ, పావోలిని రనౌట్ చేసింది. పావోలిని 2024లో వింబుల్డన్ మరియు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్స్‌కు చేరుకుంది. మెల్‌బోర్న్ పార్క్‌లో అదే సంవత్సరంలో నాల్గవ రౌండ్‌లో ఆమె అత్యుత్తమ ఫలితం సాధించింది. తదుపరి మ్యాచ్‌లో పావోలిని పోలాండ్‌కు చెందిన మాగ్డలీనా ఫ్రెచ్ లేదా స్లోవేనియాకు చెందిన వెరోనికా ఎర్జావెక్‌తో తలపడుతుంది. మరో మ్యాచ్‌లో మరియా సక్కరి ఫ్రాన్స్‌కు చెందిన లియోలియా జీన్‌జీన్‌ను 6-4, 6-2 తేడాతో ఓడించి టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించింది.

## రూపాయి క్షీణతకు ఇండో యుఎస్ ట్రేడ్ డీల్ లింకు..



**ముంబయి జనవరి 18:** డాలర్‌తో పోలిస్తే రూపాయి మరోసారి తీవ్ర ఇబ్బం దుల్లో పడింది. వారాంతంలో రూపాయి ఈ ఏడాదిలోనే అతిపెద్ద పతనాన్ని చవిచూసింది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి నాలుగు వారాల కనిష్ట స్థాయికి చేరుకుంది. ఇదే టైంలో డాలర్ ఆరు వారాలలో అత్యంత బలమైన స్థాయిలో ట్రేడవుతోంది. వరుసగా మూడవ రోజు కూడా రూపాయి క్షీణించడంతో డాలర్‌తో రూపాయి 60 పైసలకు పైగా తగ్గిందని సర్వేల్లో తేలింది. ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోతే సోమవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి చారిత్రాత్మక కనిష్ట స్థాయికి చేరుకోవచ్చని నిపుణుల అంచనా. రూపాయి విలువ పతనం కావడానికి అతిపెద్ద కారణం అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంలో జాప్యం. డాలర్ డిమాండ్ కారణంగా రూపాయి పడిపోతోంది. ఇదే టైంలో డాలర్ ఇండెక్స్ పెరగడం స్పష్టంగా కనిపిస్తుంది. స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడిదారుల ఉపసంహారణ ఇంకా ముగియలేదు. దీని ప్రభావం రూపాయిపై స్పష్టంగా కనిపిస్తుంది. రూపాయి విలువ క్షీణించి, అమెరికా డాలర్‌తో పోలిస్తే 44 పైసలు తగ్గి 90.78 వద్ద ముగిసింది. బలమైన డాలర్ డిమాండ్, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల మూలధన ప్రవాహాలు రూపాయి పతనంపై మరింత ప్రభావం చూపాయి. అమెరికాభారతదేశం వాణిజ్య చర్చల గురించి ఆం దోళనలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెట్టుబడి దారుల సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీశాయని విదేశీ కరెన్సీ వ్యాపారులు తెలిపారు. ముఖ్యంగా ఈ రూపాయి క్షీణత 2026 తర్వాత ఇదే గరిష్టం. ఇంటర్‌బ్యాంక్ విదేశీ కరెన్సీ మారక మార్కె ట్లో డాలర్‌కు రూపాయి విలువ 90.37వద్ద ప్రారంభమైంది. ట్రేడింగ్ సమయంలో ఇది డాలర్‌కు 90.89కనిష్ట స్థాయికి చేరుకుంది. చివరికి డాలర్‌తో పోలిస్తే 90.78 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమలు చేసిన సుంకాల చర్యలు డాలర్ డిమాండ్ పెరుగుదలకు కారణం అయ్యింది. భారత స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడిదారుల నిధుల ఉపసంహారణలు కూడా రూపాయి క్షీణతకు ప్రధాన కారణంగా నిలిచాయి. శుక్రవారం విదేశీ పెట్టుబడిదారులు రూ.4,346.13 కోట్ల విలువైన లాభాలను బుక్ చేసుకున్నారని స్టాక్‌డేటా చెపుతోంది. అదే సమయంలో ప్రస్తుత సంవత్సరంలో విదేశీ పెట్టుబడిదారులు స్టాక్ మార్కెట్ నుంచి రూ.22,530కోట్లను ఉపసంహారించుకున్నారు. ఈ నెలలో సెన్సెక్స్, నిఫ్టీ ఇప్పటికే దాదాపు 2 తగ్గాయి. ఇది రూపాయి విలువపై ప్రభావం చూపుతోంది.

## కేంద్ర బడ్జెట్, కార్పొరేట్ ఫలితాలే కీలకం

### ఈ వారం మార్కెట్లపై స్టాక్‌బ్రోకింగ్ అంచనాలు




**ముంబయి, జనవరి 18:** డాలర్‌రూపాయి కదలికలతోపాటు కార్పొరేట్‌మూడో త్రైమాసిక ఫలితాలు, దావోస్ సదస్సుల్లో వెలువడే పెట్టుబడుల నిర్ణయాలు, కేంద్ర బడ్జెట్ వంటివి ఈ వారం మార్కెట్లకు కీలకం అవుతాయని మార్కెట్ నిపుణుల అంచనా. వీటికితోడు మధ్యప్రాచ్యంలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల ప్రభావంకూడా స్టాక్ మార్కెట్లపై పడుతుందని అంచనా. అలాగే విదేశీ ఇన్వెస్టర్ల ధోరణులు, పెట్టుబడుల రాక వంటివికూడా కొంత మార్కె ట్లకు దిక్సూచిగా మారతాయి. రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐబ్యాంకుల త్రైమాసిక ఫలితాల ఆధారంగా ఇన్వెస్టర్లు ట్రేడింగ్ ఉంటుంది. ఆ తర్వాత రానున్న భారీ కంపెనీల క్యూ3 ఫలితాలు, మిడ్‌క్యాప్ కంపెనీలపైనా ఈ ట్రేడింగ్ ధోరణులు ప్రస్ఫుటం అవుతాయని అంచనా. ఇక గ్లోబల్ పరంగా అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు, జిడిపి వృద్ధి, నిరుద్యోగ డేటా, పిఎంఐ నివేదికలతోపాటు కరెన్సీ కదలికలు కూడా కొంత కీలకం కాగలవు. అలాగే భారత్ అమెరికాలమధ్య జరిగే ట్రేడ్‌డీల్ చర్చలు కూడా మార్కెట్లను ప్రభావితం చేస్తాయని రెలిగేర్‌బ్రోకింగ్ ఎస్వీపీ అజిత్ మిశ్రా తెలిపారు. అన్నింటికంటే ముఖ్యంగా కేంద్ర బడ్జెట్ ఈసారి ట్రేడింగ్‌కు కీలకం కానున్నది. బడ్జెట్ కేటాయింపుల ఆధారం గానే విభిన్న రంగాల్లో కంపెనీ షేర్లలో మార్పులుంటాయని స్వస్తికా ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ సంతోష్ మీనా అన్నారు. ఇక వచ్చే వారంలో భెల్, ఎల్టీఐ మైండ్‌ట్రీ, పిఎన్‌బి, ఎయు స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు, ఆదాని ఎనర్జీ సొల్యూషన్స్, బ్యాంక్ ఆఫ్ ఇం డియా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, డిఎల్‌ఎఫ్, బిపిసిఎల్, ఆదాని గ్రీన్ ఎనర్జీల ఫలితాలు రానున్నాయి. గతవారం మిశ్రమఫలితాలతో ముగిసిన మార్కెట్లు ఈ వారం బడ్జెట్‌ప్రభావంతో కొంత మార్పులు ఉండవచ్చని స్టాక్‌బ్రోకింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.



## ఐడిబిఐ బ్యాంకు నికరలాభం

### రూ.1935.45కోట్లు

**ముంబయి, జనవరి 18:** జీవితభీమాసంస్థ ఆధ్వర్యంలోనడుస్తున్న ఐడిబిఐ బ్యాంకు డిసెంబరు త్రైమాసికంలో నికరలాభం రూ.1.4 శాతం పెరిగి రూ.1935.45కోట్లుగా ఉన్నట్లు ప్రకటించింది అదే ఏడాదిక్రితం రూ.1908.27 కోట్లుగా ఉన్న లాభం స్వల్పంగా పెరిగింది. నికరవడ్డీ ఆదాయం రూ.3209.5 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలోరూ.4228.2 కోట్లుగా ఉన్నట్లు బ్యాంకు వెల్లడించింది. పూర్తిస్థాయిలో ప్రైవేటీకరణ డెడ్‌లైన్ కొద్దిలో మిస్ అయింది. నికర నిరర్ధక ఆస్తుల్లో క్షీణత కనిపించింది. గత త్రైమాసికంలో ఉన్న రూ.425.3కోట్లనుంచి రూ.474.2కోట్లకు తగ్గాయి.

నిరర్ధక ఆస్తులు నికరంగా 0.21శాతంనుంచి 0.18శాతానికి వచ్చాయి. స్థూల నిరర్ధక ఆస్తులు రూ.6242కోట్లుగా ఉన్నాయి. అదే గత త్రైమాసికంలో 6281 కోట్లుగా ఉన్నట్లు బ్యాంకుప్రకటించింది. 2.57శాతంతగ్గాయి. కేటాయింపుల నిష్పత్తి కూడా 99.33శాతంగా ఉంది. బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.5.46 లక్షలకోట్లుగా ఉంది. 12శాతం వృద్ధితో ఉంది. డిపాజిట్లురూ.3.07 లక్షలకోట్లుగా ఉన్నాయి. నికర అడ్వాన్సులు 15శాతంపెరిగి రూ.2.39 లక్షలకోట్లుగా ఉన్నాయి. కాసా డిపాజిట్లు కూడా రూ.1,35,632 కోట్లుగా ఉనానయి. కాసా నిష్పత్తి కూడా 44.06శాతంగా ఉన్నట్లు బ్యాంకు ప్రకటించింది.

## మూడో త్రైమాసికంలో 11శాతం పెరగనున్న ఫార్మా రాబడులు

**న్యూఢిల్లీ, జనవరి 18:** దేశీయంగా పెరిగిన అమ్మకాలు ఫార్మాకంపెనీల్లో రాబడులను మూడో త్రైమాసికంలో ఎనిమిదినుంచి 11శాతంవరకూ పెంచుతాయన్న అంచనాలున్నాయి. కేన్సర్ డ్రగ్ జనరిక్



రెవ్లిమిడ్ అమెరికాలో విక్రయాలు కూడా కొంత కీలకం కానున్నాయి. బ్రోకరేజి సంస్థల అంచనాల ప్రకారం కంపెనీల్లో నికరలాభాలు రెండునుంచి నాలుగుశాతం వరకూ పెరుగుతాయి. ఆసుపత్రులు, డయాగ్నస్టిక్స్ కంపెనీల్లో కూడా పటిష్టమైన రాబడులు నమోదవుతాయని, 20 నుంచి 22శాతం వార్షిక వృద్ధి ఉంటుందని తేలింది. భారత్ ఫార్మా మార్కెట్‌లో రెండంకెల వృద్ధి ఉంటుందని, 16శాతం కార్డియాక్ చికిత్సలు, ఆంకాలజి 26శాతం, యాంటిడయాబెటిక్స్ 14శాతం చొప్పున ఈత్రైమాసికంలో వృద్ధి ఉంటుందని తేల్చారు. అలాగే యాంటి ఇన్ఫెక్షన్స్ రెండుశాతం, నొప్పులు ఏడుశాతం, గ్యాస్ట్రో ఇంటెస్టినల్, డెర్మటాలజీ థెరఫీలు 8శాతం వృద్ధి ఉంటుందని ఫార్మారంగ నిపుణులు పేర్కొంటున్నారు. యువామా ఆర్థికవేత్తలు అంచనాలప్రకారం లూపిన్ 8 నుంచి 10శాతం వృద్ధిఉ ంటుందని, సన్‌ఫార్మా, టొరెంట్‌ఫార్మా, డా.రెడ్డీస్ ల్యాబ్స్ కూడా 12శాతంవరకూ రాబడులు పెంచుకోవచ్చని అంచనావేసింది. సిప్లా ఆల్కెమ్, జైడస్ కంపెనీలుకూడా తొమ్మిదినుంచి 10శాతంవరకూ దేశీయ వ్యాపారంలో వృద్ధినమోదుచేస్తాయని తేలింది. అమెరికా మార్కెట్‌లో జెనరిక్ రెవ్లిమిడ్ కీలకంగా ఉంది. కాంట్రాక్టు అభివృద్ధి, ఉతయారీ సంస్థలు (సిడిఎంఒలు)కొంత మందగమనం నెలకొనడంతోమూడోత్రైమాసికంలో కొంత వెనకబడిందనే చెప్పాలి. ఇటీవలికాలంలో రెవ్లిమిడ్ మార్కెట్ కొన్ని బిలియన్ డాలర్ల జనరిక్ మం దుగా విస్తరించింది. టెవా, నాట్కో, డా.రెడ్డీస్,సిప్లా, సన్‌ఫార్మాలు ఇపుడు ఈ ఔషధ ఉత్పత్తిలోకి వస్తున్నాయి. ఇక డయాగ్నస్టిక్స్‌పరంగా లాల్‌పాథ్‌ల్యాబ్స్ 11శాతం, మెట్రోపాలిస్ హెల్త్‌కేర్ 15శాతం, వృద్ధిని నమోదుచేసినట్లు రేటింగ్ సంస్థలు చెపుతున్నాయి. ఇక ఆసుపత్రుల రంగంలో అపోలో ఆసుపత్రి 65శాతం వృద్ధితో ఉన్నట్లు తేలింది. సగటురాబడి ప్రతి బెడ్‌కు 13శాతంపెరిగిందని నిపుణుల అంచనా. ఫోర్టిస్ కంపెనీ 67శాతంగా ఉంది. ప్రతి బెడ్‌కురాబడి వ1ద్ధిఐదుశాతంగా ఉంది. మాక్స్ హెల్త్‌కేర్ పదిశాంగా ఉన్నట్లు నువామా అంచనావేసింది.

## మూడు టాప్ కంపెనీల్లో రూ.76 వేలకోట్ల ఎంక్యాప్ వృద్ధి




**ముంబయి, జనవరి 18:** దేశంలోపి పది టాప్ కంపెనీల్లో మూడు కంపెనీల మార్కెట్ విలువలు రూ.75,855.43 కోట్లు పెరిగినట్లు స్పష్టం అయింది. భారతీయ స్టేట్‌బ్యాంకు, ఇన్ఫోసిస్ సంస్థలు భారీ స్థాయిలో లాభపడ్డాయి. ఇతర సంస్థలు మందగమనంతోనే ఉన్నట్లు ఈక్విటీ మార్కెట్లలో రుజువయింది. ఐసిఐసిఐబ్యాంకు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్ఫోసిస్ సంస్థలు భారీ లాబాలు ఆర్జిస్తే, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, టాటా కన్సల్టెన్సీ సర్వీసులు, భారతి ఎయిర్‌టెల్, బజాజ్‌ఫైనాన్స్, హిందూస్థాన్ యూనిలీవర్, ఎల్‌అండ్‌టి సంస్థలు మొత్తంగా 75,549.89 కోట్లు క్షీణించినట్లు కనిపించింది. ఈ ఏడు సంస్థల మార్కెట్ విలువల క్షీణత కనీసం ఈ లాభాలు పొందిన మూడు సంస్థల స్థాయిలోకూడా లేదు. ఎస్‌బిఐ మార్కెట్ విలువలు 39,045.51కోట్లుపెరిగి రూ.9,62,107.27 కోట్లకుచేరి అతిపెద్ద సంస్థగా నిలిచింది. ఇన్ఫోసిస్ కూడా రూ.31,014.59 కోట్లు పెరిగి రూ.7,01,889.59 కోట్లకు చేరింది. ఐసిఐసిఐబ్యాంకు రూ.5795.33కోట్లుపెరిగి మొత్తం విలువలు రూ.10,09,470.28 కోట్లకు చేరింది. ఎల్‌అండ్‌టి సంస్థ విలువలు 23,501.8 కోట్లు క్షీణించి రూ.5,30,410.23కోట్లకు చేరాయి. హెచ్‌డిఎఫ్‌సి విలువలు కూడా రూ.11,615.35కోట్లు కోతకు గురయి రూ.14,32,534.91 కోట్లకు చేరింది. భారతి ఎయిర్‌టెల్ రూ.6443.38 కోట్లు క్షీణించి రూ.11,49,544.43కోట్లు టర్నోవర్‌తో నిలిచింది. ఇక బజాజ్‌ఫైనాన్స్ కూడా రూ.6253.59 కోట్లు క్షీణించి రూ.5,91,447.16 కోట్లతో ఉంది. హిందూస్థాన్ యూనిలివర్ రూ.3312.93 కోట్లు క్షీణించి రూ.5,54,421.30 కోట్లుగా ఉంది. ఇక టెక్నాలజీ దిగ్గజం టిసిఎస్ విలువలు కూడా రూ.470.36 కోట్లు క్షీణించి రూ.11,60,212.12కోట్లకు చేరాయి.

## ఆమ్వే ఇండియాకు తప్పని నష్టాలు: యేడాది మొత్తంగా రూ.74.25 కోట్ల నష్టం




**ముంబయి, జనవరి 18:** ఆమ్వే ఇండియా కంపెనీ మొత్తంనష్టం రూ.74.25 కోట్లుగా ఉంది. కేలండర్‌సంవత్సరంలో నష్టాలు మరింతపెరిగాయని కంపెనీ చెపుతోంది. రాబడులు కూడా 10.56 శాతం క్షీణించి రూ.1148.16 కోట్లకు తగ్గాయి. మొత్తం పూర్తి ఆర్థికసంవత్సరానికిగాను రాబడులు రూ.1174.85 కోట్లుగా ఉన్నాయి. ఆమ్వే ఇండియా మొత్తం నష్టం రూ.53.38 కోట్లుగా ప్రకటించింది. గతఏడాది ఇదే కేలండర్‌సంవత్సరంలో 1283.75 కోట్లు సాధించిందని బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ వెల్లడించింది. గడచిన రెండేళ్లుగా సంస్థ మందగమనంతో కూడిన వృద్ధిని నమోదుచేస్తోంది. ఆమ్వే ఇండియా వ్యయాలు కూడా రూ. 36.20 కోట్లకు చేరాయి. అమెరికా మాతృసంస్థకు రాయల్టీ రూపంలో రూ.55.43కోట్లు చెల్లించింది. ఏజెంట్ విక్రేతలకు రూ.366.91 కోట్లు చెల్లించినట్లు కంపెనీ తెలిపింది. ఆమ్వే ఇండియా మొత్తం వ్యయాలు కేలండర్ సంవత్సరంలో రూ. 1249.10 కోట్లుగా ఉంది. మిచిగాన్‌కు చెందిన అల్టికర్ గ్లోబల్ హోల్డింగ్స్ ఇంక్ అనుబంధంగా కొనసాగుతున్న సంస్థ ప్రత్యక్ష విక్రయాల సంస్థగాలిస్ట్ అయింది. న్యూట్రిషన్ వెల్‌నెస్ విభాగంలో రాబడులు పదిశాతం తగ్గి 2025లో రూ.703.58 కోట్లుగా ఉంది. ఇక హోమ్‌కేర్ ఉత్పత్తుల ద్వారా రూ.120.29 కోట్ల రాబడు లున్నాయి. బ్యూటీ ఉత్పత్తుల విభాగంలో రూ.96.59 కోట్లు సాధించినా 12శాతం తగ్గినట్లు కంపెనీ వెల్లడించింది. అంతర్జా తీయంగా టాప్ పది మార్కెట్లలో ఒకటిగా ఉన్న ఆమ్వే నేరుగా విక్రయాలుజరిపే సంస్థల్లో టాప్ ఐదులో ఒకటిగా నిలిచింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.